www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68
సంచిక : 211
గురువారం 24-01-2019
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
వెల: రూ.4.00
పేజీలు: 12+ టాబ్లాయిడ్
విజయవాడ ప్రచురణ



ప్రియాంక రెడీ

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా పగ్గాలు

- యూపీ తూర్పు ప్రాంత బాధ్యతలు అప్పగింత
- పశ్చిమప్రాంత బాధ్యతలు సింధియాకు...
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్
- హర్యానాకు గులాం నబీ ఆజాద్
- పార్టీ శ్రేణుల్లో జోష్
- కాంగ్రెస్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ : ఏళ్లతరబడి కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడింది. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంకను ఏఐసీసీ బుధవారం నియమించింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రియాంకను కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకొచ్చింది. ప్రియాంక నియామకంపై కాంగ్రెస్ పెద్దలు హర్షాతిరేకాలు వ్యక్తం చేయగా బీజేపీ మాత్రం పెదవి విరిచింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వైఫల్యంతోనే ప్రియాంకను

- మిగతా 2 లో

అదే దందా..



సిక్కోలులో గుంటూరు మాఫియా

- మంత్రుల పేరుతో ఇసుక దోపిడీ
- అధికారులు, స్థానికులపై దాడులు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు
- ఆ ఉప ముఖ్యనేత తనయుడి అండదండలు
- 'బ్లూ ఫ్రాగ్'పై చర్యలకు బ్రేకులు

విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం : ప్రశాంతతకు మారుపేరుగా ఉండే శ్రీకాకుళం జిల్లాలో గుంటూరు ఇసుక మాఫియా హల్‌చల్ చేస్తోంది. ఈ మాఫియా పేరు చెబితే మైన్స్, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం హడలిపోతోంది. నిండా ముప్ఫై ఏళ్లు నిండని ఓ నలుగురు సభ్యుల ముఠా..ప్రభుత్వంలోని ఉప ముఖ్యనేత పేరు చెప్పుకుని నెల రోజులుగా హడావుడి చేస్తోంది. సినిమాల్లో మాదిరిగానే అధికారులను, ఇసుక రీచ్‌లు ఉన్న గ్రామాల్లోని ప్రజలను హడలెత్తిస్తోంది. తమకు అడ్డు ఉండకూడదని ప్రభుత్వం కేటాయించిన బుచ్చిపేట(నరసన్నపేట) ఇసుక ర్యాంపును అర్ధంతరంగా మూయించి వేసింది. చేనులవలస రీచ్‌ను నిర్వహిస్తున్న ఆ ముఠా కన్ను తాజాగా పొన్నాంపై పడింది. మంగళవారం ఉదయం ఆ గ్రామంలోకి వెళ్లిన వారు, తామంతా మంత్రి అచ్చెన్నాయుడి మనుషులమని, ర్యాంపు నిర్వహణ తామే చేస్తున్నామంటూ ట్రాక్టర్ డ్రైవర్లపై బెదిరింపులకు దిగడంతో విషయం బయటపడింది. అజయ్, అనీల్ అనే ఇద్దరు తమపై దౌర్జన్యానికి దిగారని ఫోన్‌లో సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదు. అంతేకాకుండా వారు పెద్దల మనుషులని, సంయమనం పాటించాలంటూ సుద్దులు చెప్పారని, దీంతో తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో ఉన్నామని గ్రామస్తులు చెబుతున్నారు.

మంత్రుల పేరుతో దోపిడీ..

ఉప ముఖ్యనేత కుమారుడికి శ్రీకాకుళం జిల్లాలో గ్రానైట్

- మిగతా 2 లో



షమీ.. వికెట్ల 'సెంచరీ'

న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి వన్డేలో భారత పేసర్ మహమ్మద్ షమీ అరుదైన రికార్డుని నెలకొల్పాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ జట్టుకు షమీ రూపంలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. మొదటి ఓవర్‌లో కివీస్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్(5)ను షమీ క్లీన్‌బౌల్డ్ చేశాడు. తద్వారా ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో వన్డేల్లో భారత్ తరపున అత్యంత వేగంగా వంద వికెట్లు తీసిన బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. 56 మ్యాచ్‌ల్లో ఈ ఘనత సాధించాడు. అతని తర్వాత ఈ జాబితాలో ఇర్ఫాన్ పఠాన్(59), జహీర్ ఖాన్(65), అజిత్ అగార్కర్(67), జవగల్ శ్రీనాథ్(68) ఉన్నారు.

ఆర్థిక మంత్రిగా గోయెల్‌కు అదనపు బాధ్యత...!

న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ స్థానంలో ప్రస్తుత రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయెల్ 2019 బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. అనారోగ్య కారణంగా అరుణ్‌జైట్లీ అమెరికాలో చికిత్స పొందుతున్నారు. బడ్జెట్ సమావేశాలకు ఆయన హాజరుకాలేని స్థితి. దీంతో ప్రధాని నరేంద్ర మోడీ సూచన మేరకు పీయూష్ గోయెల్‌కు ఆర్థిక మంత్రిత్వశాఖ బాధ్యతలను అదనంగా అప్పగించినట్టు రాష్ట్రపతి భవన్ ప్రకటించింది. అరుణ్‌జైట్లీ ప్రస్తుతం ఏ శాఖ లేని మంత్రిగా కొనసాగుతారు. ఆయన తిరిగి విధులకు హాజరయ్యే నాటికి శాఖను అప్పగిస్తారు.



ఏపీలో ఒంటరి పోరే..!

అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో పోటీ

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ఊమెన్‌చాండీ

3లో

ఎల్ఈడీ క్రతువుకు బ్రేక్



గుంటూరు, ప్రకాశం, విశాఖపట్నం జిల్లాల్లో నత్తనడక

3లో

తప్పు చేయనప్పుడు

జంకెందుకు?

- 'రాఫెల్'పై జేపీసీ దర్యాప్తు జరిపించండి
- ఎన్డీయే ప్రభుత్వాన్ని నిలదీసిన సీపీఐ నేత రాజా



చెన్నై : రాఫెల్ కుంభకోణంపై పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జేపీసీ)తో దర్యాప్తు జరిపించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు డి. రాజా డిమాండు చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించి ఎటువంటి తప్పుచేయనప్పుడు జేపీసీని ఎదుర్కొనేందుకు భయమెందుకని ఎన్డీయే ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. ఈ అంశానికి సంబంధించి 'వాస్తవాలను వెల్లడించండి'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కోరారు. బుధవారం ఆయన ఇక్కడ పీటీఐతో మాట్లాడారు. "ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు రక్షణ మంత్రి (నిర్మలా సీతారామన్) లేదా విదేశీ వ్యవహారాల మంత్రి (సుష్మా స్వరాజ్)ఉండాలి. కానీ ప్రధానమంత్రి ఒక్కరే నిర్ణయం తీసుకున్నారు. ఒప్పందాన్ని నిర్ణయించారు" అని రాజా చెప్పారు. "జేపీసీ పార్లమెంటరీ సాధనం. మన ప్రజాస్వామ్యంలో పార్లమెంటే సుప్రీం. ఏమీ (తప్పు) జరగనప్పుడు జేపీసీని వారు ఆనందంగా అంగీకరించాలి. వారు ఎందుకు భయపడుతున్నారు" అని ప్రశ్నించారు. రక్షణ మంత్రి సీతారామన్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, రాఫెల్ ఒప్పందంపై జేపీసీ దర్యాప్తు జరిపించాలన్న డిమాండును మరోసారి త్రోసిపుచ్చడంతో రాజా పైవిధంగా వ్యాఖ్యానించారు. రాఫెల్ ఒప్పందంపై జేపీసీ దర్యాప్తు అవసరంలేదు అని సీతారామన్ అన్నారు. 2జీ అంశంలో వలే రాఫెల్‌కు వ్యతిరేకంగా కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) లేదా సుప్రీంకోర్టు వంటి సంస్థలేవీ వ్యాఖ్యానించలేదని ఆమె చెప్పారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ

- మిగతా 2 లో



ప్రసంగిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

అడ్డంకులు సృష్టిస్తే

ఊరుకోం

ఇది అగ్రిగోల్డ్ బాధితుల సమష్టి విజయం : ముప్పాళ్ల

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం : అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి మొదటి విడతగా రూ.250 కోట్లను కేటాయించడం సంపూర్ణంగా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పోరాటం ఫలితమేనని ఆ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు చెప్పారు. కొన్ని రాజకీయ పక్షాల వారు దురుద్దేశంతో ఈ విజయాన్ని అడ్డుకోవడానికి, అగ్రిగోల్డ్ బాధితులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇదే జరిగితే బాధితులకు అన్యాయం, ద్రోహం చేసినట్లుగా భావించాల్సి ఉంటుందని

- మిగతా 2 లో

మానవీయ ప్రపంచీకరణ



- ఇది నాలుగో పారిశ్రామిక విప్లవం
- దావోస్‌లో ఆర్థికవేదిక చైర్మన్ పిలుపు
- చైనా విధానానికి ప్రశంసలు
- 2008 నాటి సంక్షోభ పరిస్థితులు

దావోస్ : మానవీయ కోణంలో ప్రపంచీకరణను అమలు చేయాలని ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యుఇఎఫ్) వ్యవస్థాపకులు, చైర్మన్ క్లాస్ షెవాబ్ పిలుపునిచ్చారు. ఇక్కడ జరుగుతున్న ఆర్థికవేదిక 49వ వార్షిక సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, మనం నాల్గవ పారిశ్రామిక విప్లవ కాలంలో ఉన్నాం. ఆ దిశలోనే ప్రపంచీకరణను రూపొందించాలి. ఈ సదస్సు ప్రపంచీకరణ4 అన్న అంశంపై ప్రధానంగా కేంద్రీకరించింది. ప్రస్తుతం ప్రపంచం ఒక దేశంతో మరో దేశం పరస్పర సంబంధం కలిగిఉన్నాయి. మరింత సమ్మిళితమైన, సుస్థిరమైన ప్రపంచీకరణ విధానాలు అమలుచేయాలి. వాతావరణ సంబంధ అంశాలకు ఇక్కడ ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. ఈ అంశాలపై ఆయన అమెరికా పత్రిక ఫారెన్ ఎఫైర్స్‌లో వ్యాసం రాశారు. ప్రపంచీకరణ అంతం కాబోదు.. మరింత ప్రగాఢమవుతుందని పేర్కొన్నారు. వాణిజ్య అడ్డంకులు తగ్గిపోయాయి, ప్రపంచం ఇప్పుడు డిజిటల్ విధానంపై ఆధారపడింది. ఇందుకు సంబంధించిన భావాలు, సేవలపై ఆధారపడింది. జాతీయవాదం, రక్షణవాదం, సంపన్న దేశాలలో ముఖ్యంగా అమెరికా, బ్రిటన్‌లలో రాజకీయ అనిశ్చితులు ఏర్పడ్డాయి. డొనాల్డ్ ట్రంప్, థెరిసా మే, మాక్రాన్‌లు తమ దేశాలలో ఇబ్బందులవల్లే ఈ సదస్సుకు రాలేకపోయామని అన్నారు. సదస్సుకు ముందు విడుదల చేసిన నివేదికలో 2019లో భౌగోళిక, రాజకీయ, ఆర్థిక ఉద్రిక్తతలు పెరిగాయి. తక్షణం ఈ రిస్క్‌లను పరిష్కరించుకోవాలి.. ప్రధానమైన సంపన్న దేశాల మధ్య ఆర్థిక ఘర్షణలు పెరుగుతాయని, బహుళవాణిజ్య నిబంధనలు, ఒప్పందాలు దెబ్బతింటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచీకరణపై చైనా అనుసరిస్తున్న విధానాన్ని విశ్లేషకులు ప్రశంసించారు. 2017లో జరిగిన దావోస్ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మహాసముద్రం. దాని నుండి ఎవరూ తప్పించుకోలేరని అన్నారు. ఈ అంశాన్ని విశ్లేషకులు నివేదికలో పేర్కొన్నారు.

2008 నాటి సంక్షోభ పరిస్థితులు:

జర్మనీ ఛాన్సలర్ ఏంజిలా మర్కెల్ మాట్లాడుతూ, 2008లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం ప్రభావాలు నేటికీ పూర్తిగా సమసిపోలేదని అన్నారు. ఇప్పటికీ దాని ఫలితాలను అనుభవిస్తున్నాం..చిత్తశుద్ధితో ఉన్నట్లయితే అప్పటి సంక్షోభం

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఇక కొత్త పద్దు...!

దేశంలో ఆర్థిక సంవత్సరం మారనుంది. కొత్తపద్దు అమలులోకి రానుంది. ఏప్రిల్ నుంచి మార్చి వరకు నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలను... జనవరి నుంచి డిసెంబరు వరకూ చేపట్టేలా కసరత్తు జరుగుతోంది. 152 ఏళ్ల నుంచి అమలు జరుగుతున్న ఆర్థిక సంవత్సరాన్ని మార్చేందుకు మూడేళ్ల కిందటే కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. పార్లమెంటరీ కమిటీ సైతం ఆమోదం తెలిపింది. దీంతో కొత్త ఆర్థిక విధానం ఈ ఏడాది నుంచే ఆరంభం కానుంది. బడ్జెట్ పుస్తకాల సైతం 2019 గానే ముద్రించేందుకు ఆర్థికశాఖ సహాయ మంత్రి పొన్ రాధాకృష్ణన్ శ్రీకారం చుట్టారు.

జనవరి నుంచి ఆర్థిక లావాదేవీలు డిసెంబరుతో ముగింపు

- చైనా..రష్యా స్ఫూర్తితో 152 ఏళ్ల ఆనవాయితీకి తిలోదకం
- 2017లోనే పార్లమెంటరీ కమిటీ సిఫార్సు
- శంకర ఆచార్య కమిటీ విముఖత
- వెల్లడించని మోడీ సర్కారు
- వచ్చే బడ్జెట్ సమావేశంలో ఆర్థిక మంత్రి ప్రకటన
- మార్చి - డిసెంబరుకు బడ్జెట్‌కు ప్రతిపాదన
- బడ్జెట్ 2019 పుస్తకాల ముద్రణ ప్రారంభం



11లో



సమ్మె సైరన్

- 6 నుంచి నిరవధికం
- 26 నుంచి నల్లబ్యాడ్జీలతో విధులకు
- 28న అన్ని డిపోల్లో సామూహిక దీక్ష
- 30న ఆర్ఎం కార్యాలయాల ఎదుట మహాధర్నాలు
- ఏపీఎస్ఆర్టీసీ జేఏసీ హెచ్చరిక

11లో

ట్రంప్ ప్రభుత్వానికి నిధులపై ఓటింగు నేడు?



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ ప్రభుత్వాన్ని దాదాపు నెలరోజులకుపైగా పాక్షికంగా మూసివేశారు. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి 5.7 బిలియన్ డాలర్లను మంజూరు చేయాలన్న ట్రంప్ విజ్ఞప్తిని ప్రతినిధుల సభ తిరస్కరించడంతో ఆయన ప్రభుత్వాన్ని పాక్షికంగా మూసివేశారు. మొత్తం 15 శాఖలుండగా, ప్రస్తుతం కొన్ని శాఖలు మాత్రమే పనిచేస్తున్నాయి. ప్రభుత్వానికి, ప్రతినిధుల సభకు మధ్య ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించేందుకు గురువారం సెనేట్‌లో ఓటింగ్ జరిగే అవకాశముందని సెనేట్‌లో పాలక రిపబ్లికన్ పార్టీ నాయకుడు మిచ్‌మెకొన్నెల్ తెలియజేశారు. ఇందుకు అవసరమైన భూమికను కూడా తయారుచేసినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నడవటానికి మూడువారాలకు సంబంధించిన నిధులను మంజూరు చేయడం, అలాగే మెక్సికో సరిహద్దుల్లో భద్రతకు నిధుల కల్పన అంశాలను చర్చించే అవకాశం వుంది. అయితే ఇలాంటి ప్రతిపాదనే ప్రతినిధుల సభలో రాగా ట్రంప్ దానికి తిరస్కరించారు. చాలాకాలం క్రితం అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వలసదారుల పిల్లలు (డ్రీమర్లు) ఇక్కడే మూడేళ్లపాటు కొనసాగేందుకు తాను అనుమతిస్తానని ట్రంప్ చేసిన ప్రతిపాదనను కూడా డెమోక్రాట్లు తిరస్కరించారు. వలసదారులను వారి దేశాలకు తిరిగి పంపకుండా తాత్కాలికంగా అమెరికాలోనే ఆశ్రయం కల్పిస్తామన్న ట్రంప్ ప్రతిపాదనను తాము చర్చించబోమని డెమోక్రాట్లు స్పష్టం చేశారు. 2017లో వలసదారుల పిల్లలను కూడా దేశంనుండి పంపివేస్తానని ట్రంప్ చేసిన ప్రకటన చివరకు కోర్టుకు చేరింది. ట్రంప్ తన ప్రభుత్వాన్ని పాక్షికంగా మూసివేయడం గత డిసెంబర్ 22న ప్రారంభమయ్యింది. ఇంతవరకు ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కు మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన తొలగలేదు. స్పీకర్ నాన్సీపెలోసీకి కూడా ట్రంప్ చర్చించారు. అయినప్పటికీ సమస్య అలాగే ఉండిపోయింది. ఈనెల 29న ట్రంప్ దేశప్రజలనుద్దేశించి మాట్లాడతారని ప్రభుత్వ అధికారి ఒకరు తెలియజేశారు. నాన్సీపెలోసీ పర్యటనకు సైనిక విమానాన్ని అనుమతించడానికి ట్రంప్ తిరస్కరించడం మరో వివాదానికి దారి తీసింది. ఆమె తన పర్యటనకు బయలుదేరే కొన్ని గంటల ముందుగా ట్రంప్ విమానాన్ని అనుమతించలేదు.

రెండోనెలలోకి ప్రవేశించిన మూత : ట్రంప్ ప్రభుత్వం పాక్షికమూత రెండవనెలలోకి ప్రవేశించింది. ఇది ఇలాగే కొనసాగినట్లయితే దేశ ఆర్థిక వ్యవస్థ గతంలో వేసిన అంచనాకంటె మరింతగా దిగజారుతుందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణానికి 5.7 బిలియన్ డాలర్లు ఇవ్వాలని కోరగా ప్రతినిధుల సభ తిరస్కరించడంతో ప్రభుత్వం మూతపడింది. ప్రభుత్వంలో పనిచేసే 8 లక్షల మంది సిబ్బంది, కార్మికులకు నెలరోజులుగా వేతనాలు లేవు. అత్యవసర విభాగాలలో పనిచేసే సిబ్బందిని మాత్రమే కొనసాగిస్తామని, ఇప్పుడు అవసరంలేని ఉద్యోగులు వెళ్లిపోవాలని ఉన్నతాధికారులు కోరుతున్నారు. నెలరోజులుగా పనులులేక వేతనం లేక వేలాదిమంది సిబ్బంది తీవ్రమైన ఆర్థిక కష్టాలకు గురవుతున్నారని తెలుస్తోంది. ప్రభుత్వ పాక్షిక మూత ఇప్పటికే ఈ ఏడాది మొదటి 3 నెలలకాలంలో జీడిపి 0.5 నుండి ఒక శాతం వరకు తగ్గిపోయే అవకాశముందని న్యూయార్క్ ఫెడరల్ రిజర్వుబ్యాంక్ అధ్యక్షుడు జాన్‌విలియమ్స్ హెచ్చరించారు. చైనా-అమెరికా స్టడీస్ సంస్థలో సీనియర్ ఫెలోగా చేస్తున్న సౌరబ్‌గుప్తా మాట్లాడుతూ ప్రస్తుతానికి ప్రభుత్వ మూతవల్ల ఆర్థికరంగంపై ప్రభావం అదుపులోనే ఉన్నదని, భవిష్యత్తులో ఇబ్బందులు కలిగే అవకాశం ఉంటుందని అన్నారు. స్టాక్‌మార్కెట్లు, ఆర్థిక మార్కెట్లు సయితం ప్రభుత్వ మూతవల్ల ప్రతికూల ప్రభావానికి లోనయ్యాయి.

నవాజ్‌షరీఫ్‌కు గుండెజబ్బు ముప్పు

లాహోర్ : పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్‌షరీఫ్‌కు తక్షణం మెరుగైన వైద్యం అందించినట్లయితేనే గుండెవ్యాధులను నిరోధించేందుకు అవకాశం ఉంటుందని ఆయనకు వైద్యపరీక్ష జరిపిన డాక్టర్ల రిపోర్టులు తెలియజేస్తున్నాయి. బుధవారం ఈ సమాచారాన్ని ఆ రిపోర్టులు వెల్లడించాయి. ప్రస్తుతం ఏడేళ్ల జైలుశిక్షను ఆయన అనుభవిస్తున్నారు. ఇందుకోసం ఆయనను లాహోర్ జైలులో ఉంచారు. తనకు గుండెకు సంబంధించిన ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆయన ఫిర్యాదు చేయడంతో హుటాహుటిన మంగళవారం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. 60 ఏళ్ల షరీఫ్‌ని పంజాబ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజి (లాహోర్) ఆసుపత్రికి తీసుకువెళ్లి పరీక్షలు చేయించగా డాక్టర్లు పై విధంగా తమ రిపోర్టులో హెచ్చరించారు. షరీఫ్‌కి యాంజియోగ్రఫీ కూడా నిర్వహించే అవకాశంవున్నది. తన తండ్రి ఆరోగ్యంపై షరీఫ్ కుమార్తె మరియం షరీఫ్ ఆందోళన వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. తండ్రికి సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు తనకు మీడియా మాత్రమే మార్గంగా ఉన్నదని ఆమె పేర్కొన్నారు. తన సోదరుడికి మంచి ఆరోగ్య భద్రతా సౌకర్యాలను కల్పించాలని షరీఫ్ సోదరుడు షహబాజ్‌షరీఫ్ ప్రభుత్వాన్ని కోరారు.



వెనిజులాలో తిరుగుబాటుకు అమెరికా యత్నం

రెచ్చగొడుతూ ప్రతిపక్షానికి మైక్‌పెన్స్ వీడియో మెసేజ్



కారాస్ : వెనిజులలో నికొలస్ మదురొ ప్రభుత్వంపై తిరుగుబాటుకు అమెరికా ప్రయత్నిస్తోంది. అమెరికా అధ్యక్షుడు మైక్‌పెన్స్ ప్రతిపక్షాన్ని సమర్థిస్తూ వీడియో మెసేజ్‌ని పంపారు. ఈ అంశంపై మదురొ మాట్లాడుతూ అమెరికాతో దౌత్య సంబంధాలపైన తాము సమీక్షించే అవకాశంవుందని అన్నారు. తన ప్రభుత్వంపై తిరుగుబాటుకు అమెరికా యత్నిస్తున్నదని కూడా ఆయన ఆరోపించారు. తనను పదవీచ్యుతుడిని చేయడమే అమెరికా లక్ష్యంగా కనిపిస్తోందని ఆయన అన్నారు. దేశంలో ప్రతిపక్షం ప్రదర్శనలు, ఆందోళనకు పిలుపునిచ్చింది. తమ అధ్యక్షుడు ట్రంప్, తమ దేశ ప్రజలు మదురొ ప్రభుత్వంపైన నిరసన తెలియజేస్తూ స్వేచ్ఛకోసం పోరాడేందుకు మద్దతును పలుకుతున్నట్టు మైక్‌పెన్స్ ఇంగ్లీషులో రికార్డుచేసిన వీడియో మెసేజ్‌ని ప్రతిపక్ష నాయకులకు పంపారు. ఈ మెసేజ్‌లో కొన్ని స్పెయిన్‌పదాలు, అట్లాడే ఫ్రేజ్‌లను కలగలిపి పంపారు. మదురొ నియంతగా ఉన్నారని, అధికారంలోవుండే హక్కులేదని, స్వేచ్ఛగా ఎన్నికలు జరగలేదని, గతంలో జరిగిన ఎన్నికల్లో ఆయన గెలవలేదని వీడియో మెసేజ్‌లో పెన్స్ పేర్కొన్నారు. వెనిజులా ప్రజల ఆందోళనలకు తాము వెన్నుదన్నుగా నిలుస్తామని ఆ మెసేజ్‌లో హామీ యిచ్చారు. ప్రజాస్వామ్యం పునరుద్ధరించేవరకు అండగా వుంటామని, విముక్తిపొందే హక్కు మీకు ఉంది అని పేర్కొంటూ మైక్‌పెన్స్ పేర్కొన్నారు. ఈ మెసేజ్ వచ్చిన తరువాత మదురొ విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఏనాడూకూడా అత్యున్నత స్థాయిలోవున్న వ్యక్తి ఈ విధంగా ప్రభుత్వాన్ని కూలదోయమని ప్రతిపక్షాన్ని రెచ్చగొడుతూ మెసేజ్ పంపించలేదని అన్నారు. అధ్యక్ష ఎన్నికలను ప్రతిపక్షాలు బహిష్కరించాయి. ఈ ఎన్నికల్లో గెలుపొందిన మదురొ ఈనెల 10వ తేదీన పదవీ స్వీకారం చేశారు. గత వారం ప్రతిపక్షం మెజార్టీగల చట్టసభలో మదురొ ప్రభుత్వాన్ని తొలగించి తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రతిపక్షనేత జాన్‌గుయిడొ మాట్లాడారు. అధ్యక్ష పదవిని తానే చేపడతానని ఆ తర్వాత దేశంలో స్వేచ్ఛాయుత ఎన్నికలు జరుపుతాయని కూడా ఆయన అన్నారు. అయితే ఆయన ప్రకటనను వెనిజులా సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. మైక్‌పెన్స్ తన వీడియో మెసేజ్‌ని ఆయనకే పంపినట్టు తెలుస్తోంది.

కమలాహారిస్‌కు గంటల్లో మిలియన్ డాలర్లు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష పదవికి 2020లో జరిగే పోటీలో తాను పాల్గొంటానని అమెరికా సెనేటర్, భారతదేశ మూలాలున్న కమలాహారిస్ ప్రకటించారు. ఆమె ఈ ప్రకటన చేసిన 24 గంటల్లోపు అనేకమంది దాతలు సానుకూలంగా స్పందించారు. అధ్యక్ష ఎన్నికల్లో ప్రచారం కోసం 1.5 మిలియన్ డాలర్లను తాము అందిస్తున్నామని, 38వేల మంది దాతలు ప్రకటించారని మీడియా తెలిపింది. 54 ఏళ్ల హారిస్ 2020లో ట్రంప్‌పైన పోటీ చేస్తానని అధికారికంగా ప్రకటిస్తూ ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. అమెరికా ప్రజలు ఎంతగానో అభిమానించిన మార్టిన్‌లూథర్‌కింగ్ జూనియర్‌ను స్మరించుకుంటున్న రోజే కమలాహారిస్ ఈ ప్రకటన చేశారు. మహాత్మాగాంధీ నుండి స్ఫూర్తిపొందిన లూథర్‌కింగ్ అమెరికాలో నల్లజాతి ప్రజల విముక్తికోసం, స్వేచ్ఛకోసం ఘనమైన పోరాటాన్ని నిర్వహించారు. ఎబిసి సంస్థ నిర్వహించిన గుడ్‌మార్నింగ్ అమెరికా ప్రోగ్రాంలో కమలాహారిస్ తన పోటీ చేయనున్న అంశాన్ని ప్రకటించిన తరువాత ఒకటిన్నర మిలియన్ డాలర్ల విరాళాలను దాతలు ప్రకటించిన ఫాక్స్ న్యూస్ తెలియజేసింది. దాతలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ హారిస్ ట్వీట్ చేశారు. దాతలు ప్రకటించిన విరాళాల మొత్తంలో మిలియన్ డాలర్లు ఇప్పటికే వసూలైనట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలియజేసింది.

సిరియాపై అమెరికా కొత్త ఆంక్షలు

వాషింగ్టన్ : సిరియాపైన అమెరికా కొత్తగా మరోసారి ఆంక్షలను విధించింది. ఇందుకోసం ప్రతినిధుల సభ సీజర్‌సివిలియన్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019ని ప్రతినిధుల సభ ఆమోదించింది. సిరియాకు ఇంధనం సరఫరా, విమానాల రాకపోకలు, వాణిజ్యరంగాలపైన ఈ ఆంక్షలు వర్తిస్తాయని అమెరికా విదేశాంగ వ్యవహారాల కమిటీ ఒక ప్రకటనలో తెలియజేసింది. సిరియానుండి అమెరికా దళాల ఉపసంహరణకు నిర్ణయించినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపైన అమెరికా విదేశాంగ మంత్రి మైక్‌పాంపియో, టర్కీ విదేశాంగమంత్రి చర్చలు జరిపారు. సిరియాతో వాణిజ్యం నిర్వహించినా, అక్కడి ప్రభుత్వానికి, ఇంటిలిజెన్స్ విభాగానికి, భద్రతా విభాగానికి, సిరియా సెంట్రల్ బ్యాంక్‌కు, విమానాలను పంపిన లేదా వాటి విడిభాగాలను పంపినా కూడా తాజాగా విధించిన ఆంక్షలు వర్తిస్తాయి. అంతేకాదు.. సిరియా ప్రభుత్వ నిర్వహణలో నిర్మాణాలు, ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, సిరియా ఇంధన పరిశ్రమకు సహాయమందించిన ఆంక్షలు విధిస్తామని ఆ ప్రకటన తెలిపింది. ఒక్కొక్క కేసు పరిశీలన ఆధారంగా ఆంక్షలను రద్దు చేసేందుకు అధ్యక్షుడు ట్రంప్‌కి తాజా బిల్లు అధికారమిచ్చింది. పరిశీలించిన తరువాత మొత్తం ఆంక్షలను కూడా అధ్యక్షుడు రద్దు చేయవచ్చు. అర్థవంతమైన చర్చలు జరిగిన లేక అక్కడి పౌరులపై హింసను నిలిపివేసిన ఆంక్షలను రద్దుచేసే అవకాశం ట్రంప్‌కు తాజా బిల్లు ఇచ్చింది. సిరియా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థతో సంబంధాలు పెట్టుకునేందుకు కూడా ఆంక్షలు అడ్డుతగులుతాయి. అలాగే సిరియా అధికారులపై వీసాకు సంబంధించిన ఆంక్షలు ఉంటాయి.

పశ్చిమాసియాలో శాంతికి చైనా కృషి



ఐరాస : పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పేందుకు, ఆ ప్రాంత అభివృద్ధికి చైనా తన కృషిని మరింత ఇనుమడింప చేస్తుందని, ఐరాసలో ఆదేశ రాయబారి మార్యూవ్ తెలియజేశారు. ఆయన భద్రతామండలి సమావేశంలో మంగళవారం మాట్లాడుతూ ఇజ్రాయిల్-పాలస్తీనా మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న హింసాత్మక ఘర్షణలను నిలిపివేసి శాంతిని నెలకొల్పేందుకు పరిష్కారం కోసం కూడా గల అవకాశాలను. పశ్చిమాసియాలో శాంతిసాధనపైన ఐక్యరాజ్యసమితి భద్రతామండలి చర్చించింది. ఈ సమావేశంలో చైనా రాయబారి మాట్లాడుతూ పశ్చిమాసియాలో ఉమ్మడి అభివృద్ధిని, న్యాయాన్ని, స్వేచ్ఛను పరిరక్షించేందుకు శాంతి సుస్థిరతను పెంపొందించేందుకు ప్రాంతీయ దేశాలతో సంప్రదింపులను చైనా కొనసాగించడంతోపాటు ఆదేశాలకు సహకరిస్తుందని చెప్పారు. పాలస్తీనా స్వతంత్ర దేశంగా అవతరించేందుకు రాజకీయ పరిష్కారాన్ని తమ ప్రభుత్వం సమర్థిస్తుందని, అయితే ఇందుకు 1967లో కుదిరిన ఒప్పందం ఆధారంగా ఉండాలని ఆయన అన్నారు. స్వతంత్ర పాలస్తీనాకు తూర్పు జెరూసలెంను రాజధానిగా ప్రకటించాలని ఆయన కోరారు. తూర్పు జెరూసలెంతో సహా వెస్ట్ బ్యాంక్ ప్రాంతాలతో కలిపి స్వతంత్ర పాలస్తీనాను గుర్తించాలని, అన్ని దేశాలతో దౌత్య సంబంధాలను అంగీకరించాలని, అనేక దశాబ్దాలుగా అక్కడి ప్రజలు పోరాటం సాగిస్తున్నారు. అయితే అమెరికా, ఇజ్రాయిల్ స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు, దౌత్యపరమైన గుర్తింపునకు దీర్ఘకాలంగా అంగీకరించడంలేదు.

ప్రియాంక రెడీ

(మొదటిపేజీ తరువాయి)

రంగంలోకి దించారని ఆరోపించింది. ప్రియాంక ఫిబ్రవరి మొదటివారంలో బాధ్యతలు స్వీకరిస్తారు. 1980 దశకం వరకూ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న రాజకీయంగా అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్ బాధ్యతలను ప్రియాంకకు అప్పగించారు. ఈ మేరకు ఏఐసీసీ ఓ పత్రికా ప్రకటన విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికల కోసం సమాజ్‌వాదీపార్టీ, బహుజన సమాజ్‌పార్టీ పొత్తు పెట్టుకోవడం, కాంగ్రెస్‌ను కలుపుకోకుండా పక్కనపెట్టడంతో పార్టీ కార్యకర్తల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడంలో భాగంగా ప్రియాంకకు యూపీ బాధ్యతలు కట్టబెట్టారు. ఇప్పటి దాకా తన తల్లి సోనియాగాంధీ, సోదరుడు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పోటీ చేస్తున్న రాయ్‌బరేలీ, అమేథీ లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తూ వచ్చారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పతనావస్థకు చేరడంతో ప్రియాంకను రాజకీయాల్లోకి తీసుకురావాలని ఆ పార్టీ నాయకులు, శ్రేణులు పెద్దఎత్తున డిమాండు చేశారు. ప్రియాంకతోనే కాంగ్రెస్ బతికిబట్టకట్టగలదని వ్యాఖ్యానించారు. ప్రియాంక క్రియాశీల రాజకీయాల్లోకి రావడంపై ఆమే సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారని సోనియా చెబుతూ వచ్చారు. 'ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీ వాద్రాను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నియమించారు. ఫిబ్రవరి మొదటివారంలో ఆమె బాధ్యతలు స్వీకరిస్తారు' అని అశోక్ గెహ్లాట్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తరప్రదేశ్ పశ్చిమ ప్రాంతానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా పార్టీ సీనియర్ నాయకుడు జ్యోతిరాదిత్య సింధియాను రాహుల్ నియమించారు. గులాం నబీ ఆజాద్ స్థానంలో ప్రియాంక, సింధియాను నియమించారు. యూపీ బాధ్యతలు చూస్తున్న ఆజాద్‌ను హర్యానాకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా పంపారు. కేసీ వేణుగోపాల్‌ను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా రాహుల్ నియమించారు. రాజస్థాన్ సీఎంగా ఎన్నికైన అశోక్ గెహ్లోట్ స్థానానికి వేణుగోపాల్‌ను పంపారు. కర్ణాటకకు సంబంధించి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్ బాధ్యతలు నిర్వహిస్తారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా అశోక్ గెహ్లోట్ నిర్వర్తించిన పాత్రను ఆ ప్రకటన కొనియాడింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రుల ఎంపిక సహా సోనియా, రాహుల్‌తో కలిసి అనేక విధాన పరమైన నిర్ణయాలలో ప్రియాంక క్రియాశీల పాత్ర పోషించారు. మన్‌ప్రీత్ బాదల్, నవజ్యోత్‌సింగ్ సిద్ధూ పంజాబ్ కాంగ్రెస్‌లోకి రావడానికి ఆమె ఎక్కువ చొరవ తీసుకున్నారు.

ప్రియాంక సమర్థురాలు : రాహుల్

తన సోదరి ప్రియాంక క్రియాశీల రాజకీయ ప్రవేశంపై రాహుల్‌గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఆమె రాకను స్వాగతించారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రియాంక తనకు చేదోడువాదోడుగా ఉండటం సంతోషమేనని వ్యాఖ్యానించారు. ఆమె శక్తిసామర్థ్యాలు తనకు తెలుసునని చెప్పారు. జ్యోతిరాదిత్య కూడా డైనమిక్ యువనేత అని కితాబిచ్చారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక నియామకం జరిగిన గంటల వ్యవధిలోనే రాహుల్ స్పందించారు. గుజరాత్ కావచ్చు...ఉత్తరప్రదేశ్ కావచ్చు..తాము వెనకడుగేసేది లేదని, ముందుకే సాగుతామని రాహుల్ స్పష్టంచేశారు. ఎస్పీ, బీఎస్పీ పొత్తుపై స్పందిస్తూ యూపీలో బీజేపీని ఓడించడానికి ఆ రెండు పార్టీలు పొత్తు కుదుర్చుకున్నాయని, అందులో తప్పుపట్టాల్సిన అవసరం లేదని రాహుల్ చెప్పారు. కాంగ్రెస్ సిద్ధాంతాన్ని తాను ముందుకు తీసుకెళతానని అన్నారు. యూపీలో కాంగ్రెస్ ఒంటరిపోరుకు సిద్ధమైనట్టు రాహుల్ వ్యాఖ్యలు తేటతెల్లం చేస్తున్నాయి.

రాహుల్ వైఫల్యం వల్లే...: బీజేపీ

నాయకత్వం అందించడంలో రాహుల్‌గాంధీ విఫలమవడంతోనే ప్రియాంకగాంధీ క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారని బీజేపీ ఆరోపించింది. ప్రతిపాదిత మహాకూటమిలోని అనేక పార్టీలు రాహుల్‌గాంధీని తిరస్కరించడంతోనే ప్రియాంకను ముందుకు తెచ్చారని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా వ్యాఖ్యానించారు. ఇది కేవలం కుటుంబ రాజకీయమని అన్నారు. రాహుల్ వైఫల్యం చెందినట్టు కాంగ్రెస్ బహిరంగంగానే ప్రకటించిందని, కుటుంబంలో ఎవరో ఒకరికి ఆ బాధ్యతలు అప్పగించాలన్న డిమాండు పెరిగిందని, మహాకూటమి పార్టీలు తిరస్కరించడంతో ప్రియాంకను రంగంలోకి దించాల్సి వచ్చిందని పాత్రా పేర్కొన్నారు. ప్రియాంక నియామకంపై ప్రకటన వెలువడిన వెంటనే పాత్రా స్పందించారు.

ఇప్పటికే లేటు : పీకే

ప్రియాంకగాంధీ రాజకీయ రంగ ప్రవేశం ఎప్పుడో జరగాల్సిందని జేడీయూ ఉపాధ్యక్షుడు ప్రశాంత్‌కిషోర్(పీకే) బుధవారం వ్యాఖ్యానించారు. ప్రియాంక నియామకంపై పీకే బుధవారం స్పందిస్తూ ఎప్పటి నుంచో తర్జనభర్జన పడుతూ ఇప్పటికి సరైన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. అయితే, ఆమె క్రియాశీల రాజకీయరంగ ప్రవేశం జరిగిన సమయం, ఆమె పోషించాల్సిన పాత్ర, హోదా గురించి ప్రజలు చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రియాంకకు పీకే ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. జేడీయూలో చేరడానికి ముందు ఎన్నికల వ్యూహకర్తగా ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌తో కలిసి ఆయన పనిచేశారు.

అదే దందా..

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారాలున్నాయి. అతడు తన మిత్రులను ఇసుక వ్యాపారానికి పరిచయం చేశారు. ఇప్పటికే కోట్ల రూపాయల విలువైన ఇసుకను తరలించడంలో సఫలమైన వీరంతా విశాఖ అవసరాలకు తాజాగా కేటాయించిన మరో నాలుగు ఇసుక రీచ్‌లపై కన్నేశారు. అడ్డుగా ఉన్న బుచ్చిపేటను మూయించగలిగారు. మంత్రులు అచ్చెన్నాయుడు, కళా వెంకటరావు పేర్లను యథేచ్ఛగా వాడుసుకుంటున్నారు. దీంతో అధికారులు మిన్నకుండిపోతున్నారు. ఆ మాఫియా వ్యవహారాలను గట్టిగా ప్రశ్నించిన గనుల శాఖలో ఓ అధికారికి ఉప ముఖ్యనేత కార్యాలయం నుంచి, ఓ మంత్రి ఓఎస్‌డీ నుంచి ఫోన్‌లు రావడంతో ఆయన భయపడిపోయారు. నిందితులపై చర్యలకు వెనుకంజ వేశారు. ఈ మాఫియా అధికారులపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తున్నారు. ఇదే విషయాన్ని రీచ్‌ల రోజువారీ వ్యవహారాలు పరిశీలించే ఓ మహిళా ఉద్యోగి తోటి ఉద్యోగులతో చెబుతూ బాధపడినట్లు తెలుస్తోంది. జియోట్యాగింగ్ చేస్తున్న సిబ్బందిని చంపేస్తామంటూ బెదిరింపులకు దిగారు. విషయాన్ని ఏడీకి చెప్పగా పోలీసులకు ఫిర్యాదు చేయాలంటూ ఆయన ఉచిత సలహా ఇచ్చినట్టు సంస్థ ఉద్యోగులు చెబుతున్నారు. ఫలితంగా నెలరోజుల్లో ఈ ముఠా వందల కొద్దీ లారీల ఇసుకను లెక్కాపత్రం లేకుండా దర్జాగా అమ్ముకున్నట్లు తేలింది.

బ్లూ ఫ్రాగ్‌పై చర్యలు శూన్యం

సీసీ కెమెరాల నిర్వహణను చూస్తున్న బ్లూ ఫ్రాగ్ సంస్థ కలెక్టర్, జేసీ కార్ల నెంబర్లతో బిల్లులు బయటకు ఇచ్చేస్తున్న వైనాన్ని 'విశాలాంధ్ర' పరిశోధనలో బయటపెట్టినా..వారిపై ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదు. ఆ సంస్థకు నోటీసులిచ్చే దశలో మళ్లీ ఈ ముఠాయే రంగంలోకి దిగి వాటిని అడ్డుకున్నట్లు భోగట్టా. 'బ్లూఫ్రాగ్' సంస్థపై కఠినచర్యలు తీసుకోవాలని స్వయంగా కలెక్టర్ చెప్పినా మైన్స్ సిబ్బంది ఏమిచేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. కలెక్టర్ కారు నెంబరుతో ఇసుక రవాణాకు రశీదులు ఎలా వచ్చాయన్న అంశంపై క్షుణ్ణమైన దర్యాప్తు నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఆదేశించినా ఇప్పటి వరకూ దీనిపై చర్యలు లేవు. రెవెన్యూ యంత్రాంగం గనులశాఖపై నెపం నెట్టి తప్పించుకుంది. చివరకు ఈ అంశంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావించినా అది తమకే చేటవుతుందని అధికారులు మౌనం దాల్చారు. బిల్లులు 'బ్లూఫ్రాగ్'కు ఇచ్చేసిన రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌ను కనీసం వివరణ కోరకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

మాఫియా చెప్పిందే రేటు...

విశాఖ జిల్లాలో నిర్మాణ పనులకు శ్రీకాకుళం జిల్లా నదుల ఇసుకే ఆధారం. రోజూ జిల్లా నుంచి నాలుగు వందల ఇసుక లారీలు వెళుతున్నాయి. పేరుకే ఉచిత ఇసుక విధానమైనప్పటికీ రూ.25వేలకు తక్కువకాకుండా కొనాల్సి వస్తోందని విశాఖవాసులు వాపోతున్నారు. రీచ్‌లలో అన్ని ఖర్చులు పోగా నాలుగు వేల రూపాయలకు మించకుండా ఇసుకను లారీలకు ఇవ్వాల్సి ఉంది. అయితే గుంటూరు మాఫియా ఏకంగా లారీకి ఎనిమిది వేల నుంచి రూ.10వేల వరకూ బలవంతపు వసూళ్లు చేస్తోంది.

ఎవరైనా లారీ డ్రైవర్లు ప్రశ్నిస్తే వారిపై ర్యాంపుల్లోనే భౌతికదాడులకు దిగడం...లేదంటే ఆయా లారీలకు లోడింగ్ చేయకుండా మధ్యలోనే నిలిపేయడం చేస్తున్నారు. రోజూ వందకు తక్కువ కాకుండా లారీలను ఆ ముఠా తరలిస్తోంది. ఒక్కరోజులోనే ఏడు నుంచి పదిలక్షలు వసూలు చేస్తూ, వాటిలో కొంత ముడుపులు చెల్లిస్తూ నెలకు కోట్ల రూపాయల దందా సాగిస్తోంది. దీన్ని పసిగట్టిన అధికారులు సైతం ఒకేసారి నాలుగు ర్యాంపులు మంజూరు చేయడం ద్వారా ఇసుకకు డిమాండు తగ్గించి రేటును తగ్గించేలా చర్యలు తీసుకున్నారు. దురదృష్టకరమేమంటే ఆ ర్యాంపులను సైతం గుంటూరు ముఠా చేజిక్కించుకోవాలని చూస్తోంది.

గుంటూరు మాఫియాకు అడ్డుగా ఉందని భావిస్తున్న బుచ్చిపేట ఇసుక రీచ్‌ను మంగళవారమే మూసివేశారు. ఈ మేరకు గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు సీహెచ్ సూర్యచంద్రరావు ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఆగస్టులో జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం సరసన్నపేట మండలం బుచ్చిపేట ఇసుక రీచ్ నుంచి విశాఖపట్నం వారి అవసరాల కోసం 36 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక రవాణ చేయుటానికి నిర్ణయించింది. వారికి కేటాయించిన ఇసుక రవాణ పూర్తయినందున బుచ్చిపేట రీచ్‌ను మూసివేస్తున్నట్లు తెలియజేశామని ఆ ప్రకటనలో తెలిపారు.

అడ్డంకులు సృష్టిస్తే ఊరుకోం

(మొదటిపేజీ తరువాయి)



ఆయన హెచ్చరించారు. స్థానిక వీకే మెమోరియల్ హాల్‌లో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో బుధవారం జరిగిన విజయోత్సవ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు మొదటి నుంచి తమ పోరాటం చిత్తశుద్ధితో జరిగిందన్నారు. ఉద్యమంలో ఏ ఒక్కరూ తప్పుదోవ పట్టలేదన్నారు. వైసీపీ నాయకులు ద్రోహబుద్ధితో ఉద్యమంలోకి చొరబడి సంతలో గొర్రెలను కొన్నట్లు కొందరు నాయకులను కొనుగోలు చేసి అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ అంటూ బాధితుల పోరాటాన్ని తప్పుదోవలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఒక ప్రణాళిక ప్రకారం ఎస్సెల్ గ్రూపును రంగంలోకి దించి అగ్రిగోల్డ్ ఆస్తులు రూ.1650 కోట్ల నుంచి రూ.2500 కోట్లు ఉండవచ్చునని, యావదాస్తిని తమకు అప్పగిస్తే నాలుగున్నరేళ్ల తర్వాత రూ.4,050 కోట్లు ఇస్తామన్నారు. అంతేకాకుండా కుట్రపూరితంగా కోర్టులో పిల్ కూడా వేయించారని చెప్పారు. కోర్టులో పిల్ వేయకుంటే అగ్రిగోల్డ్ బాధితులకు రెండు సంవత్సరాల క్రితమే డబ్బులు లభించేవన్నారు. ఈ అడ్డంకులన్నీ అధిగమించి ఉద్యమాన్ని పూర్తి స్థాయికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగకుండా అగ్రిగోల్డ్ ఆస్తులను కొట్టేయాలనే దురుద్దేశంతో మిజోరం రాష్ట్రంలో లాటరీ కుంభకోణంలో, బీహార్ రాష్ట్రంలో కరెంటు బిల్లుల కుంభకోణంలో, ఢిల్లీలో సిటీకేబుల్ కలెక్షన్ బిల్లుల కుంభకోణంలో కూరుకుపోయిన ఎస్సెల్ గ్రూపును రంగంలోకి దించారని ధ్వజమెత్తారు. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా తాము ముందుకు సాగామని ముప్పాళ్ల తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ, అగ్రిగోల్డ్ బాధితులు పోరాడి ప్రభుత్వం నుంచి ఫలితం రాబట్టుకుంటే కొందరు నాయకులు సిగ్గులేకుండా ఇది తమ విజయంగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. చనిపోయిన అగ్రిగోల్డ్ బాధితులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వకపోతే నిరవధిక నిరాహారదీక్ష చేస్తామని ప్రకటించిన వైసీపీ నాయకులు రెండు సంవత్సరాలు గడచినా ఉద్యమించలేకపోయారన్నారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండడంతో హడావుడి చేస్తున్నారన్నారు. ఇలాంటి వారిని పట్టించుకోకుండా అగ్రిగోల్డ్ బాధితులు ఆశావహ దృక్పథంతో ముందుకుసాగాలని, ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మల్లికార్జునరెడ్డి, సిద్దేశ్వర్, సి.జాఫర్, నాయకులు శ్రీనివాసులు, బీవీ చంద్రశేఖరరావు, రాజేంద్ర, దస్తగిరి, మహిళా నాయకులు శ్రీవాణి, పద్మావతి, ఆశాబీ తదితరులు ప్రసంగించారు.

మానవీయ ప్రపంచీకరణ

(మొదటిపేజీ తరువాయి)

పర్యవసానాలు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రపంచ ప్రజలలో ఉన్న ప్రతిష్టను రాజకీయ నాయకులు కోల్పోయారు. సుస్థిర అంతర్జాతీయ ద్రవ్యవ్యవస్థ నేడు గణనీయంగా దెబ్బతిన్నది. ఇది మళ్లీ తలెత్తకుండా నివారించాలి. పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలు, బ్యాంకుల నివేదికలను చూసినట్లయితే సంక్షోభంనాటి పరిస్థితుల ప్రభావం కనిపిస్తున్నది. రానున్న సంక్షోభాలను నివారించేందుకు మనకు తక్కువ స్వేచ్ఛ ఉన్నది. అంతర్జాతీయంగా అనేక కల్లోలాలు, కొంతమేర కలవరం నెలకొని ఉన్నాయి. వృద్ధి అంచనాలు తగ్గిపోయి చీకట్లు కమ్ముకున్నాయి.

రష్యా ప్రత్యక్ష పెట్టుబడుల నిధి అధిపతి కిరిల్ డిమిట్రియేవ్ మాట్లాడుతూ, అమెరికాతో తాము చమురు యుద్ధంలో పాల్గొనబోమని చెప్పారు. చమురు ఉత్పత్తిలో కోత విధించేందుకు తమకు చేసిన విజ్ఞప్తిని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ముడిచమురు ధరలను పెంచేందుకు వీలుగా ఒపెక్ దేశాలతో కలిసి రష్యా కూడా ఉత్పత్తిని తగ్గిస్తున్నదని చెప్పారు. షేల్ ఆయిల్ ఉత్పత్తి తగ్గాలని ఆయన అమెరికాను కోరారు. బ్యారెల్ ముడిచమురు 40డాలర్లకు తగ్గించినట్లయితే రష్యా ఆర్థికవ్యవస్థ దెబ్బతింటుందని ఆయన చెప్పారు. అందువల్ల తాము రష్యాతో పోటీలో పాల్గొనడం లేదన్నారు. ప్రపంచపాలన, నాయకత్వానికి ప్రోత్సాహం, లాటిన్ అమెరికాలో కొత్త గొంతుకలు, వాణిజ్య యుద్ధంలో సరళత్వం, ప్రపంచీకరణ చరిత్రనుండి పాఠాలు నేర్వడం, కార్మిక వర్గం ఉపాధులు కోల్పోవడం వంటి ఎనిమిది అంశాలపైన కేంద్రీకరించాలని ఆర్థిక వేదిక నిర్ణయించింది.

న్యూజిలాండ్‌ను వణికించిన భూకంపం

వెల్లింగ్టన్ (న్యూజిలాండ్): న్యూజిలాండ్‌లో బుధవారం ఉదయం స్వల్ప భూకంపం చోటుచేసుకుంది. రిక్టార్ స్కేలుపై భూకంప తీవ్రత 5.1గా నమోదైంది. ఎల్‌ఎస్పెరెన్స్ రాక్‌కు ఆగ్నేయంలో 248 కిలోమీటర్ల దూరంలో పది కిలోమీటర్ల లోతున భూకంపం కేంద్రీకృతమైనట్టు అమెరికా జియలాజికల్ సర్వే వెల్లడించింది.

అయితే ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు. భూకంపం కారణంగా జరిగిన నష్టంపై సమాచారం తెలియాల్సి ఉంది. పసిఫిక్ తీరంలోని 'రింగ్ ఆఫ్ ఫైర్' జోన్‌లో ఉన్న న్యూజిలాండ్‌లో తరచూ భూకంపాలు, అగ్ని పర్వత విస్ఫోటాలు జరుగుతుంటాయి. గతేడాది అక్టోబర్‌లో 6.2 తీవ్రతతో చోటుచేసుకున్న భూ ప్రకంపనలు రాజధాని వెల్లింగ్‌టన్‌ను వణికించాయి. దీంతో పార్లమెంటును కూడా కొద్ది సేపు వాయిదా వేయాల్సి వచ్చింది. 2011లో 6.3 తీవ్రతతో చోటుచేసుకున్న భూకంపం క్రైస్ట్‌చర్చ్ నగరాన్ని అతలాకుతలం చేసింది. దీనికారణంగా 150 మంది ప్రాణాలు కోల్పోగా వేలాది మందికి గాయాలయ్యాయి.

జంకెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

జరిగినప్పుడు ప్రభుత్వ సమాధానం వినేందుకు ప్రతిపక్ష సభ్యులు ఆసక్తి చూపించలేదని ఆరోపించారు. ఈ ఒప్పందానికి సంబంధించి అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయని, ప్రధానమంత్రి మోడీ నోరుమెదపకపోవడంతో అవి మరింత బలపడుతున్నాయని రాజా చెప్పారు. "ఈ ఒప్పందానికి సంబంధించి ప్రధానికి వ్యతిరేకంగా తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికీ ఆయన ఇప్పటికీ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. పార్లమెంట్‌లో జరిగిన చర్చకు ఆయన హాజరుకాలేదు" అని తెలిపారు. "ఈ ఒప్పందానికి సంబంధించి ఏమీ దాచనప్పుడు ప్రధానమంత్రి ఎందుకు నోరుమెదపడంలేదు. నిజమేమిటి?..కనీసం ఏమి జరిగింది, అటువంటి ఒప్పందం ఎందుకు చేసుకున్నారో వెల్లడించండి" అని రాజా డిమాండు చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా, ఉత్తరప్రదేశ్ (తూర్పు) ఇన్‌ఛార్జిగా తన సోదరి ప్రియాంక వాద్రాను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నియమించడంపై వ్యాఖ్యానించమని కోరగా, ఇది ఆ పార్టీ సంస్థాగత అంశమని, దీనిపై వ్యాఖ్యానించేది ఏమీ ఉండదని అన్నారు. అమిత్‌షాను బీజేపీ అధ్యక్షుడిగా ఎలా నియమించారో అలాగే ప్రియాంకను నియమించడం కాంగ్రెస్ పార్టీ నిర్ణయం, ఆ పార్టీ సంస్థాగత అంశం అని రాజా చెప్పారు.

టీడీపీ నేతలతో రాధా భేటీ

25న ముహూర్తం ఖరారు..!

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : వంగవీటి మోహనరంగా తనయుడు, ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన రాధాకృష్ణ టీడీపీలో చేరిక దాదాపు ఖరారయ్యింది. టీడీపీ ఎమ్మెల్సీ తొండెపు జనార్థన్‌తోపాటు పలువురు కీలక నేతలతో తన కార్యలయంలో రాధా సమావేశమయ్యారు. దీంతో వైసీపీ రాజీనామా అనంతరం ఇప్పటి వరకు రాధా ఏ పార్టీలోకి వెళతారనే ఉత్కంఠకు తెరపడింది. ఈ నెల 25న రాధా టీడీపీలోకి చేరే అవకాశముంది. రాధా చేరికను కృష్ణాజిల్లా టీడీపీ నేతలు ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్రవ్యాప్తంగా రాధా సామాజికవర్గ శ్రేణులతో భారీస్థాయిలో ఆయన టీడీపీలోకి వెళ్లేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈయన చేరికతో పార్టీకి మరింత బలం చేకూరుతుందని టీడీపీ శ్రేణులు పేర్కొంటున్నారు. అటు సుదీర్ఘ కాలం నుంచి రంగా అభిమానులుగా ముద్రపడిన వారంతా టీడీపీలోకి ఆయన వెళ్లడంపై భిన్నంగా స్పందిస్తున్నారు.

నేడు మీడియా ముందు వివరాలు వెల్లడిస్తా : రాధాకృష్ణ

వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి వెళ్లిన పరిణామాలపై గురువారం మీడియా ముందు వివరాలు వెల్లడిస్తానని వంగవీటి రాధాకృష్ణ చెప్పారు. టీడీపీ నేతలతో భేటీ అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ఏ పరిస్థితుల్లో టీడీపీలోకి వెళ్తున్నదీ అనుచరులకు, ప్రజలకు వివరిస్తానని పేర్కొన్నారు.

చంద్రబాబు ఆదేశాలతోనే రాధాను స్వాగతిస్తున్నాం : తొండెపు

సీఎం చంద్రబాబు ఆదేశాలతోనే వంగవీటి రాధాకృష్ణను టీడీపీలోకి ఆహ్వానిస్తున్నామని ఆ పార్టీ సీనియర్ నేత తొండెపు జనార్థన్ చెప్పారు. సీఎం సందేశాన్ని తమ ద్వారా రాధాకు వివరించామన్నారు.

కాపుల అభివృద్ధికి చంద్రబాబు కృషి

టీడీపీ నేత చందు సాంబశివరావు

విశాలాంధ్ర - అమరావతి : కాపు సామాజిక వర్గం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారని, టీడీపీ నేత, రేరా చైర్మన్ చందు సాంబశివరావు కొనియాడారు. ఉండవల్లి ప్రజావేదికలో బుధవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాపులకు రిజర్వేషన్లు కేటాయించి వారి అభ్యున్నతికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కాపు రిజర్వేషన్లపై విపక్షాల విమర్శలు సరికాదన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా ఇప్పటికే రూ.3,100 కోట్లు ఖర్చు పెట్టామని వివరించారు. ప్రభుత్వ నిర్ణయం వలన బీసీలు, అగ్రకులాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై ముద్రగడ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ముద్రగడ, కన్నా లక్ష్మీనారాయణ మాత్రమే కాపులకు నాయకులు కాదని వ్యాఖ్యానించారు. కాపులు ప్రభుత్వానికి మద్దతుగా నిలబడాలని సూచించారు.

మూడోరోజు కేసీఆర్ చండీయాగం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తున్న మహారుద్ర సహిత సహస్ర చండీయాగం మూడో రోజుకు చేరుకుంది. బుధవారం కేసీఆర్ దంపతులతో పాటు ప్రముఖులు యాగశాలకు రానుండటంతో పోలీసులు భారీ భద్రత ఏర్పాటుచేశారు. ఈ యాగంలో మూడోరోజు కూడా రుత్వికులు గణపతిపూజ, దేవతాహ్వానం, అష్టదిక్పాలుకుల పూజలతోనే యజ్ఞాన్ని ప్రారంభించారు. మాడుగుల మాణిక్య సోమయాజుల పర్యవేక్షణలో వేద పండితులు మంగళంపల్లి వేణుగోపాలశర్మ, పురాణం మహేశ్వరశర్మ, చంద్రశేఖరశర్మలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.మరో రెండు రోజులపాటు ఈ యాగం కొనసాగనుంది.

అభివృద్ధి చెందిన దేశాల్లోనూ బ్యాలెట్ పేపర్‌లోనే..: శశిధర్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : విమానాలు ట్యాంపరింగ్ జరిగితే ఎడ్ల బండిలో తిరుగుతారా అని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రజత్‌కుమార్ చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి శశిధర్ రెడ్డి మండిపడ్డారు. అక్కడ బ్యాలెట్ పేపర్‌లోనే ఎన్నికలు జరుగుతున్నాయి కదా అని ధ్వజమెత్తారు. ఈవీఎంలను మొట్టమొదట ప్రవేశ పెట్టిన జపాన్‌లో కూడా ఇప్పుడు బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువగా బ్యాలెట్ పేపర్‌లోనే ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. ఈవీఎంలపై విశ్వాసం లేదనే వీవీ ప్యాట్ తీసుకొచ్చారని మరిచిపోవద్దన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవంలో పాల్గొనాలని రజత్‌కుమార్ నుంచి ఆహ్వానం వచ్చిందని తెలిపారు. ఒక్క ఓటర్‌ను వదిలిపెట్టొదన్నది ఈసారి ఓటర్ల దినోత్సవం థీమ్ అని, గత ఎన్నికల్లో లక్షలాది ఓటర్లను తొలగించామని రజత్‌కుమార్ అంగీకరించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల నాటికి అర్హులందరినీ ఓటరు జాబితాలో చేరుస్తామన్న హామీ నెరవేరే పరిస్థితి కనిపించడం లేదన్నారు. అందుకే ఈ ఓటర్ల దినోత్సవాన్ని బహిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఓటర్స్ డేను బహిష్కరిస్తూ నిర్వహించే ధర్నాలో అధికార పార్టీకి తొత్తుగా ఉన్న ఎన్నికల సంఘంపై తమ వైఖరి చెబుతామన్నారు. ధర్నాకు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నాయకులు భట్టి విక్రమార్క, జానారెడ్డి, షబ్బీర్ అలీ, రేవంత్ రెడ్డి, డీకే అరుణలతో పాటు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, టీ టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్, ఎంబీటీ నేతలను ఆహ్వానించామని తెలిపారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంకగాంధీ నియామకంపై హర్షం వ్యక్తంచేశారు. ఆమె రాకతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు.

ఎల్ఈడీ క్రతువుకు బ్రేక్...!

- లక్ష్యం 27.52 లక్షలు
- ఇప్పటికి 21.21లక్షలు పూర్తి
- నెలాఖరుకు ఆరులక్షలు కష్టమే
- గుంటూరు, ప్రకాశం, విశాఖపట్నం జిల్లాల్లో నత్తనడక



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలో గ్రామ పంచాయతీల్లో ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు నత్తనడకన సాగుతోంది. అనుకున్న సమయానికి ఎల్ఈడీ బల్బులు సరఫరా కాకపోవడంతో లక్ష్యం నెరవేరడంలేదు. ఈనెలాఖరుకి నూరుశాతం లక్ష్యాన్ని చేరుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. అయితే క్షేత్ర స్థాయిలోని ఇబ్బందులతోపాటు సరఫరాలో ఆటంకం వలన క్రతువు ముందుకు సాగడంలేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పదమూడు జిల్లాల్లో 12,918 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో గత కొన్నేళ్లుగా 40 వాట్స్ వీధి దీపాలను వినియోగిస్తున్నారు. దీనివలన అధిక యూనిట్లు విద్యుత్తు వినియోగం, నిర్వహణకు అధిక ఖర్చు తడిచి మోపెడు అవుతోంది. ఈనేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం మొత్తం పంచాయతీల్లో 27.52లక్షల ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఎల్ఈడీ దీపాలను సమకూర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దీంతో కేంద్ర ఎనర్జీ డిపార్ట్‌మెంట్ అధీనంలోని ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎల్ఈడీ దీపాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు. ఈ మొత్తం ప్రక్రియను ఒక ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ప్రైవేటు ఏజెన్సీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 21.21లక్షల ఎల్ఈడీ దీపాలను అమర్చారు. ఇంకా మరో ఆరు లక్షల దీపాలకు పైగా ఏర్పాటు చేయాల్సి ఉంది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విజయనగరం, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లో నూరుశాతం ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం, నెల్లూరు, కృష్ణా, కర్నూలు జిల్లాల్లో తొంబై నుంచి తొంబై ఐదు శాతం వరకు దీపాల ఏర్పాటు చేశారు. గుంటూరు, ప్రకాశం, విశాఖపట్నం జిల్లాల్లో పంచాయతీల్లో ఎల్ఈడీ దీపాల ఏర్పాటు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ప్రధానంగా దీపాలను అమర్చే సంస్థ ఎల్ఈడీ దీపాల సరఫరాలో తీవ్ర జాప్యం చేయడం వలన పనులు ముందుకు సాగడంలేదని అధికారులు చెబుతున్నారు. అయితే ఈనెలాఖరులోపు నూరుశాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని సాక్షాత్తు సీఎం చంద్రబాబు ఆదేశించారు. మరో వారం రోజుల గడువు మాత్రమే ఉంది. దీంతో ఏ మేరకు ఏర్పాటు చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఫిబ్రవరి నెలలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలున్నాయి. అప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. అయితే ఎన్నికలకు ముందే నూరుశాతం లక్ష్యాన్ని పూర్తి చేసి దాన్ని ఆర్భాటంగా ప్రచారం చేసుకోవాలని టీడీపీ ప్రభుత్వం భావిస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు తలెత్తుతున్నాయి. కొన్ని పంచాయతీల్లో పలు విద్యుత్ స్తంభాలు శిథిలస్థితిలో ఉండటం, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో కూడా కొంత ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. దీంతో ఉన్నతాధికార్లపై సీఎం తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఎట్టిపరిస్థితుల్లో 12,918 గ్రామపంచాయతీల్లో నూరుశాతం ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రధాన లక్ష్యం విద్యుత్ ఆదా

రాష్ట్రంలో విద్యుత్‌ను ఆదా చేయాలనే ప్రధాన లక్ష్యంతో ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో 40 వాట్స్ వీధిదీపాలు ఉన్నాయి, అయితే వాటి వలన పెద్దఎత్తున విద్యుత్ ఖర్చు అవుతుంది. పైగా పాత సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసినవి కావడంతో లైటింగ్ తక్కువగా వస్తోంది. దీనివలన గ్రామీణులు రాత్రి సమయాల్లో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న ఎల్ఈడీ దీపాలు 24 వాట్స్‌తో రెట్టింపు వెలుతురు లభిస్తోంది. దీంతో ప్రభుత్వం ఎల్ఈడీ దీపాల వైపు మొగ్గు చూపింది. నగరాలు, పట్టణాలకు సమాంతరంగా గ్రామాలను కూడా అభివృద్ధి చేయాలని కృతనిశ్చయంతో రాష్ట్రప్రభుత్వం ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేస్తోంది.

కాపులకు రిజర్వేషన్లు మోసమే

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కేంద్రం అగ్రవర్ణాల్లోని పేదలకు ఇచ్చిన రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకంటూ సీఎం చంద్రబాబు చేసిన ప్రకటన మోసపూరితమని, దీనిపై కాంగ్రెస్, జనసేన పార్టీలు నోరువిప్పాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు డిమాండు చేశారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. చంద్రబాబు తిరిగి అధికారంలోకి రావాలనే కాంక్షతోనే కాపుల ఓట్లకోసం జిమ్మిక్కులు చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో కాపులను బీసీ-ఎఫ్‌లో చేర్చిన ప్రతిపాదనలేమిటని, అది మోసమని టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఒప్పుకుంటారా? అని రాంబాబు ప్రశ్నించారు. కాపులను బీసీల్లో చేరుస్తామంటూ మంజునాథన్ కమిషన్ వేశారని, నివేదిక రాకుండానే అసెంబ్లీలో బీసీ-ఎఫ్‌గా చంద్రబాబు ప్రకటించి స్వీట్లు పంచారని దుయ్యబట్టారు. బీసీలకు 110 వాగ్దానాలిచ్చి, వాటిలో ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రాన్ని, కులాలను చంద్రబాబు మోసం చేశారని, ఆయన మాటలను ఎవరూ నమ్మవద్దని కోరారు.

ఆధిపత్య భావజాలం తగదు

తెలంగాణ ఎడిషన్‌లో ఆంధ్రా వార్తలా?

కేటీఆర్ ఆగ్రహం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఐదేళ్లు అవుతున్నప్పటికీ కొన్ని పత్రిక, మీడియా సంస్థలు ఇంకా ఆ భావజాల అధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నాయని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. మే చేసిందే కరెక్టు...మేం ఏది చెప్తే అదే వేదం' అనే చందంగా వ్యవహరిస్తున్నాయని, ఇప్పటికైనా అలాంటి అధిపత్య భావనలు పోతే మంచిదని సూచించారు. తాము ఎలాంటి వివాదం కోరుకోవడం లేదన్నారు. ఎవరి ఆధిపత్యాన్ని సహించేది లేదన్నారు. ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో జర్నలిస్టు, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌ను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం అభినందించారు. కేటీఆర్ మాట్లాడుతూ తన అస్థిత్వాన్ని చాటుకునే దిశగా పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఈ క్రమంలో ఇక్కడ కొన్ని పత్రికల్లో అమరావతి వార్తలు ఉంటున్నాయన్నారు. 'అమరావతి వార్తలు వేయండి.. మాకు ఎలాంటి సమస్య లేదు. కానీ అమరావతిలోనూ తెలంగాణ వార్తలు వేయాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. తాను ఢిల్లీకి పోయినప్పుడు అక్కడ కొన్ని పత్రికలు చూస్తే మన వార్తలు ఉండనే ఉండవని, తెలంగాణలో ప్రభుత్వం ఉన్నట్లు గానీ, ముఖ్య మంత్రి ఉన్నట్లు గానీ వార్తలు కనబడవన్నారు. ఆ సందర్భంగా తాను అక్కడున్న వ్యక్తిని 'మేం ఈ దేశంలో లేమా' అని అడిగితే 'సార్ అది ఆంధ్రా ఎడిషన్' అని చెప్పాడని, మరి ఆంధ్రా ఎడిషన్‌లో తెలంగాణ వార్తలు రాయనప్పుడు, తెలంగాణ ఎడిషన్‌లో ఆంధ్రా వార్తలు ఎందుకు అని కేటీఆర్ ప్రశ్నించారు. దీనిపై జర్నలిస్టులు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ భావజాలాన్ని అణువణువునా నింపుకున్న తెలంగాణ పత్రికలను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులకు పెద్దపీట వేసి సంస్థాగతంగా గౌరవించిన పార్టీ టీఆర్ఎస్ అని, దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా జర్నలిస్టుల సంక్షేమానికి శ్రీకారం చుట్టిందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం బాధ్యత తనదని స్పష్టం చేశారు. జర్నలిస్టుల కోసం ఓ సంక్షేమ నిధిని ఏర్పాటు చేశామని, న్యాయవాదులు, కళాకారుల సంక్షేమ కోసం కృషి చేస్తున్నా మన్నారు. కోర్టు వివాదాలు లేకుండా ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డుల పంపిణీకి చిత్తశుద్ధితో ముందుకు పోతున్నామని, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల భవనానికి స్థలం కేటాయించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి ఇప్పించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. చంద్రబాబువి ఆపద మొక్కులు అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మన పథకాలను కాపీ కొట్టారని, కేసీఆర్ చేసినవే తానూ చేస్తే గెలుస్తానని చంద్రబాబు అనుకుంటున్నారన్నారు. చిత్తశుద్ధి లేని శివపూజలు చేస్తే ఏం ఒరిగేది లేదన్నారు. ఆంధ్రా ప్రజలు, అక్కడి జర్నలిస్టులు తెలివైన వాళ్లని, చైతన్యవంతులు అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి క్రాంతి, మారుతిసాగర్ పాల్గొన్నారు.

బషీర్‌బాగ్‌లో భారీ అగ్నిప్రమాదం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఖాన్ లతీఫ్‌ఖాన్ భవనంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. నాలుగు, ఐదో అంతస్తుల్లో మంటలు వ్యాపించాయి. ఎల్బీ స్టేడియం ఎదురుగా ఉన్న కేఎల్‌కే బిల్డింగ్‌లోని అడ్వాంటేజ్ వన్ ఆఫీస్‌లో ముందు మంటలు చెలరేగాయి. ఇందులోనే టీసీఎస్ బ్రాంచ్ కూడా ఉంది. ఉద్యోగులు భయంతో పరుగులు తీశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ప్రమాదం సంగతి తెలియగానే అప్రమత్తమైన పోలీసులు భవనంలోని సిబ్బందిని బిల్డింగ్ నుంచి బయటకు పంపేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొస్తున్నారు. అన్ని అంతస్తుల నుంచి అందరినీ బయటకు పంపించారు. ఐదో అంతస్తులో ఉన్న ఐడియా కార్యాలయంలోని ఏసీలో షార్ట్ సర్క్యూట్ సంభవించడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు ఫైర్ అధికారులు అంచనా వేస్తున్నారు. సర్వర్ రూమ్ గుండా మంటలు వ్యాపించడంతో ప్రమాదస్థాయి మరింత పెరిగిందని అధికారులు చెబుతున్నారు. మంటల్లో చిక్కుకున్న ఏడుగురిని అగ్ని మాపక సిబ్బంది రక్షించింది. భవనంలో ఉన్నవారంతా సురక్షితంగా బయటకు వచ్చేసినట్లు సమాచారం. ఐదు ఫైరింజన్లు, క్రేన్, ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలు అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాయి. భారీ క్రేన్ల సాయంతో బయటినుంచి వాటర్ చల్లారు. భవనంలో ఉన్నవారంతా సురక్షితంగా బయటకు వచ్చేసినట్లు అదనపు సీపీ చౌహాన్ చెప్పారు. ప్రమాదం వల్ల భారీగా ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. ఈ భవనంలో పలు కీలక కార్యాలయాలు ఉన్నాయి. రెండో అంతస్తులో రెండు తెలుగు రాష్ట్రాల ఐడియా ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. చాలా మంది నివాసం కూడా ఉంటున్నారు. మంటల్ని గమనించి అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. లేకపోతే ప్రాణనష్టం జరిగేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

జగన్‌పై దాడి కుట్రలో పెద్దలు

ఎన్ఐఏ దర్యాప్తుపై భయమెందుకు ?

వాసిరెడ్డి పద్మ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నాయకులు, వైసీపీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో కీలక వ్యక్తులు ఉన్నారన్న అనుమానాలు బలపడుతున్నాయని ఆ పార్టీ అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు. చంద్రబాబు పదేపదే ఎన్ఐఏ విచారణను అడ్డుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని, ఆయనకు ఎన్ఐఏ అంటే ఎందుకంత భయమని ఆమె ప్రశ్నించారు. ఈసారి ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, జనసేన కలిసి వచ్చినా..దుష్టచతుష్టయ కూటమిని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి హత్యకు పెద్దస్థాయిలో కుట్ర జరిగిందని, ఈ ఘటన వెనుక కీలకమైన వ్యక్తులు ఉన్నారన్న అనుమానాలు బలపడుతున్నాయని చెప్పారు. జగన్‌పై హత్యాయత్నం జరిగిన వెంటనే ప్రాథమిక సమాచారం లేకుండానే డీజీపీ చులకన చేస్తూ మీడియాతో మాట్లాడారన్నారు. ఆ వెంటనే చంద్రబాబు దాడిని హేళన చేస్తూ మాట్లాడటం, ఆ తరువాత జరిగిన పరిణామాలన్నీ ప్రజలు చూస్తున్నారని చెప్పారు. దాడి తరువాత చంద్రబాబు మాట్లాడుతూ జగన్‌పై ఎయిర్‌పోర్టులో దాడి జరిగితే రాష్ట్ర ప్రభుత్వానికి ఏమి సంబంధమని ప్రశ్నించారన్నారు. డీజీపీ, సీఎం మాట్లాడిన మాటలను బట్టి ఈ దాడి ఒక కుట్ర ప్రకారమే జరిగిందన్న అభిప్రాయంతో జగన్ కోర్టుకు వెళ్లారని, ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయించాలని కోరినట్లు చెప్పారు. ఈ కేసును హైకోర్టు ఎన్ఐఏకు అప్పగిస్తే..విచారణను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని పిల్లిమొగ్గలు వేసిందో అని ధ్వజమెత్తారు. విచారణ సజావుగా జరగకుండా చంద్రబాబు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ఐఏ విచారణను ఆపేందుకు చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారని తెలిపారు. ఈ కేసులో ఆధారాలను ఎన్ఐఏకు ఇవ్వకుండా ఉండేందుకు చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే ఇలాంటి కుట్రలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పదేపదే ఎన్ఐఏ విచారణకు చంద్రబాబు అడ్డుపడటం చూస్తుంటే ఈ కేసులో ఆయన పాత్ర ఉందనేది స్పష్టమవుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు తీరును అంతా గమనిస్తున్నారని.. ఆయనకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

బ్యాలెట్ విధానంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

ఎంపీ కనకమేడల రవీంద్ర

విశాలాంధ్ర - అమరావతి : బ్యాలెట్ విధానంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపీ కనకమేడల రవీంద్ర పేర్కొన్నారు. ఉండవల్లిలోని ప్రజావేదికలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. రవీంద్ర మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈవీఎంలపై చర్చ జరుగుతోందన్నారు. బ్యాలెట్ పేపర్ విధానం తీసుకు వస్తేనే ప్రజలకు నమ్మకం కుదురుతుందని, ఒక విమర్శ, అనుమానం వచ్చినప్పుడు నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీపై ఉందని తెలిపారు. దేశంలో అన్ని విపక్షాలు ఈవీఎంలపై సందేహం వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. తెలంగాణలో 31 నియోజకవర్గాల్లో ఈవీఎంల ద్వారా పోలైన ఓట్లకు లెక్కింపు ఓట్లకు మధ్య తేడా వచ్చిందని అన్నారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో సైతం ఇదే విధమైన తేడాలు వచ్చాయని జీవీఎల్ నరసింహారావు గతంలోనే ఈవీఎం లను వ్యతిరేకించి, బ్యాలెట్ పేపర్ కావాలని డిమాండు చేశారని ఆయన పేర్కొన్నారు. అప్పట్లోనే 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అనే పుస్తకాన్ని జీవీఎల్ విడుదల చేశారని గుర్తు చేశారు. ఈసీ ఒక రాజకీయ పార్టీలాగా మాట్లాడడం సరి కాదన్నారు. ఈవీఎంలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ కూడా ఒక కమిటీ వేసి రూ.75 వేల కోట్లు కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాలని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కానీ ఎన్‌డీఏ సర్కార్ ఏ మాత్రం సహకారాన్ని అందించటం లేదని విమర్శించారు. కేంద్రం రాష్ట్రానికి చేసిన అన్యాయంపై పోరాటం చేయాలని పిలుపునిస్తున్నామని పేర్కొన్నారు.

22 రైళ్ల పొడిగింపు

తిరుపతి వరకు 'హమ్‌సఫర్'

ఇచ్ఛాపురం వరకు కటక్ మెమూ

న్యూఢిల్లీ : హౌరా - విజయవాడ మధ్య నడుస్తున్న హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును తిరుపతి వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు అలాగే కటక్ - బరంపూర్ వరకు నడిచే మెమూ రైలును ఆంధ్రప్రదేశ్‌లోని ఇచ్ఛాపురం వరకు పొడిగించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా మొత్తం 22 రైళ్ల గమ్యస్థానాల పెంపుపై న్యూఢిల్లీలోని రైల్ భవన్‌లో బుధవారం సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తొలుత ఆగ్రా - గ్వాలియర్ మధ్య ప్రయోగాత్మకంగా నడిపిన గతిమాన్ ఎక్స్‌ప్రెస్‌ను ఝాన్సీ వరకు పొడిగింపుతో సత్ఫలితాలు వచ్చాయి. దీంతో అన్ని జోన్‌లలోని 22 రైళ్లను పొడించాలని నిర్ణయిచినట్లు మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. తిరుపతి వరకు పొడించిన హౌరా - విజయవాడ హమ్‌సఫర్ ఒంగోలు, నెల్లూరు, రేణిగుంటలో ఆగుతుందని తెలిపారు. అలాగే ఇచ్ఛాపురం వరకు పొడిగించిన కటక్ మెమూ రైలు ఆ రూట్‌లోని అన్ని స్టేషన్లలో ఆగుతుందన్నారు. మిర్యాలగూడ - కాచిగూడ మధ్య తిరిగే డెమూ రైలును నడికుడి వరకు పొడించి, కొండప్రోలు, విష్ణుపురం, పొందుగలలో హాల్టులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విశాఖపట్నం - పలాస పాసింజర్ రైలును బరంపురం పొడిగించి, అన్ని స్టేషన్లలో హాల్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైల్వేబోర్డు చైర్మన్ వినోద్‌కుమార్ యాదవ్, సభ్యులు గిరీష్ పిళ్లై, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీలో ఒంటరి పోరే..!

- అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో పోటీ
- జాతీయ స్థాయిలోనే టీడీపీతో పొత్తు
- 31న బస్సుయాత్రపై చర్చిస్తాం
- ప్రత్యేక హోదా సాధన సమితి బంద్‌కు మద్దతు
- 'ప్రియాంక'కు కీలక పదవి హర్షణీయం
- రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ ఊమెన్‌చాందీ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీలో అన్ని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతామని, ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకోబోమని ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్, కేరళ మాజీ సీఎం ఊమెన్‌చాందీ తేల్చిచెప్పారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..పీసీసీ సమన్వయ కమిటీ, రాష్ట్ర కమిటీ సమావేశాల్లో రాబోయే ఎన్నికలను ఎదుర్కొనేందుకుగాను పలు నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. 'ఢిల్లీలో రాహుల్‌గాంధీని పొత్తుల వ్యవహారంపై టీడీపీ అధినేత చంద్రబాబు కలిశారు కదా..? జాతీయస్థాయిలో పొత్తులు పెట్టుకుని, ఏపీలో రెండు పార్టీలు వేర్వురుగా ఎలా పనిచేస్తాయ'ని విలేకరుల అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. కాంగ్రెస్‌తో టీడీపీ పొత్తు జాతీయ స్థాయికే పరిమితమని, రాష్ట్రానికి సంబంధం లేదని స్పష్టంచేశారు. జాతీయ స్థాయి పొత్తుల వ్యవహారంపై పార్టీ అధినేత రాహుల్ గాంధీ చూస్తారని అన్నారు. 'రాష్ట్రంలో అన్ని ఎంపీ స్థానాలకూ మీకు సమర్థులైన అభ్యర్థులున్నారా? ఎన్ని ఎమ్మెల్యే స్థానాలు గెలుస్తార'ని అడిగిన ప్రశ్నలపై ఊమెన్‌చాందీ స్పందిస్తూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని చెప్పారు. ప్రజలంతా కాంగ్రెస్‌ను ఆదరిస్తారనే విశ్వాసం తమకు ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహించాలనే అభిప్రాయాన్ని సమన్వయ కమిటీలో చర్చించామని తెలిపారు. దీనిపై ఈ నెల 31న 175 అసెంబ్లీ, 25పార్లమెంటు నియోజకవర్గాల బాధ్యులతో విజయవాడలో కీలక సమావేశాన్ని నిర్వహించి, భవిష్యత్తు కార్యాచరణ్ని రూపొందిస్తామని చెప్పారు.

ఫిబ్రవరి1న ప్రత్యేక హోదా సాధన సమితి బంద్‌కు మద్దతు: రఘువీరారెడ్డి

ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి నేతలు ఫిబ్రవరి 1న తలపెట్టిన బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతిస్తున్నట్లు పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి చెప్పారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హోదా సాధన సమితి నేతలు తమను కలిసి బంద్‌కు సహకరించాలని కోరారని, దీనిపై సమన్వయ కమిటీ సమావేశంలో చర్చించామని, ఈ బంద్‌ను విజయవంతం చేయాలని తీర్మానించామన్నారు. పార్లమెంటు చివరి సమావేశాల్లోనైనా సరే.. ఏపీకి ప్రత్యేక హోదా అమలుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. అడక్కపోయినా అగ్రవర్ణాలకు 10శాతం రిజర్వేషన్లు, ఇతరత్రా కార్యక్రమాలతో కేంద్ర ప్రభుత్వం హడావిడి చేస్తోందని ఎద్దేవా చేశారు. చివరి సమావేశంలోనైనా హోదాను అమలు చేయాలని డిమాండు చేశారు. ప్రియాంకాగాంధీని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించడాన్ని స్వాగతిస్తున్నామని, ఒక క్లిష్ట దశలో కీలక నిర్ణయం తీసుకున్న పార్టీ అధినేత రాహుల్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రియాంకను ఉత్తరప్రదేశ్‌కు ఇన్‌చార్జ్‌గా నియమించడాన్ని హర్షిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఆమె ప్రభావముంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే సాధ్యమని చెప్పారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాలకు ఒంటరిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 1నుంచి ఎన్నికల ప్రక్రియలోకి కాంగ్రెస్ పూర్తిగా వెళ్తుందని, రాహుల్‌ను ప్రధాని చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శులు మెయప్పన్, క్రిష్టోఫర్ తిలక్, పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కనుమూరి బాపిరాజు, బైరెడ్డి రాజశేఖరరెడ్డి, పీసీసీ ప్రధానకార్యదర్శి నరహరిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు కాంగ్రెస్ తొలిజాబితా..!

కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థుల తొలిజాబితాను ఈనెలాఖరుకు విడుదల చేసేందుకు పార్టీ అధిష్టానం చర్యలో నిమగ్నమైంది. ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి 100 మంది అభ్యర్థుల జాబితాను ఇటీవల పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి అందజేసినట్లు తెలిసింది. అధిష్టానం ఆమోదంతో తొలిజాబితాను ఈ నెల 31న విడుదల చేసే అవకాశమున్నట్లు సమాచారం.

సంపాదకీయం

మోడీ ప్రభుత్వానికి కాగ్ అక్షింతలు

ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా వున్నప్పుడే దేశం పురోగమిస్తుంది. అందుకు దోహదపడే చర్యలు తీసుకోకుండా పాలకులు తొందరపాటుతో తీసుకునే నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను కుదేలు పర్చడమే గాక దేశాభివృద్ధిని కుంటుపరుస్తుంది. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం 2016, నవంబర్ 8 న తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం, ఆ తరువాత హడావిడిగా అమలు చేసిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ) దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయడమే కాక, సామాన్య, మధ్య తరగతి ప్రజల బతుకులను ఛిద్రం చేశాయి... కోలుకోలేని విధంగా నడ్డి విరిచాయి. ఈ ఆర్థిక సంవత్సరం నుండి రెవిన్యూ లోటు లక్ష్యాలను తొలగించాలని మోడీ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈవిధంగా నిర్ణయం తీసుకున్నందుకు కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, రెవెన్యూ లోటు లక్ష్యాల భర్తీతో నిమిత్తం లేకుండా లక్షకోట్ల రూపాయల తాయిలాలతో కూడిన పథకాలనుకూడా మోడీ ప్రభుత్వం ప్రకటించింది. మోడీ ప్రభుత్వ నిర్ణయం స్థూల ఆర్థిక స్థిరత్వానికి, ద్రవ్య పరిస్థితికి దోహదం చేయదని, సబ్సిడీలవంటి వాటికి రెవిన్యూ ఖర్చును రుణాలద్వారా సమకూర్చవలసి వస్తుందని, అంటే దానర్థం ద్రవ్య దుబారానేనని కాగ్ అక్షింతలు వేసింది. రుణాలు తెచ్చిన డబ్బు పెట్టుబడి వ్యయానికి అతి తక్కువగా లభ్యమవుతుంది, ఇది ఆనందదాయక ఆర్థిక పరిస్థితి కాదని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. 2018 బడ్జెట్‌లో మొదటిసారిగా రెవెన్యూలోటు లక్ష్యాన్ని ప్రభుత్వం కలిపివేసినప్పటినుండి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) ఆర్థికవేత్త ఎన్ఆర్ భానుమూర్తితో సహా పలువురు విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ, ద్రవ్యలోటును అదుపులో వుంచడానికి రెవిన్యూలోటు పరిష్కరించడం క్లిష్టమని పేర్కొంటూ ప్రభుత్వ ద్రవ్య పరిస్థితిపై కాగ్ ఆక్షేపణలు వ్యక్తీకరించడంతో ఇప్పుడు ఆ సమస్య మళ్లీ ముందుకొచ్చింది. ఫిసికల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఎఫ్ఆర్‌బిఎం)కు అనుగుణంగా జనవరి రెండవవారంలో పార్లమెంటులో సమర్పించిన కాగ్ నివేదిక ద్రవ్య పరిస్థితి అంతాసజావుగా లేదని స్పష్టంగా వెల్లడించింది. ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం, రెవిన్యూ వ్యయం, రెవిన్యూ జమల మధ్య అంతరాన్ని భర్తీ చేయడానికి రుణాల ద్వారా ఆర్థిక సహాయం చేయాలి. పన్నుయేతర ఆదాయ జమలను ప్రభుత్వం పెంపొందించుకోకపోయినట్లయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరాల్లో సేకరించిన రుణాలను పన్నుల విధింపు నుండి డబ్బు వసూలు ద్వారా అంతిమంగా చెల్లించవలసి వున్నందున చేసిన రుణాలు "వాయిదా వేయబడిన" పన్నుగానే పరిగణించాలి.

రెవిన్యూలోటు లక్ష్యాలను తొలగించడానికి 2018లో ఎఫ్ఆర్‌బిఎం చట్టాన్ని సవరించారు. ఇది 2018-19 నుండి వర్తించబడుతుంది. తమ అవసరాలను ఆఫ్-బడ్జెట్ (బడ్జెట్‌తో సంబంధం లేకుండా) రుణాలద్వారా నెరవేరుస్తున్నందువల్ల పెట్టుబడి వ్యయంపై ఈ వ్యూహం రాజీపడదని ప్రభుత్వం చెప్పుకొంటున్నందని కాగ్ తెలిపింది. ఇందుకొరకు సేకరించిన రుణాలు అటువంటి పథకాలు సృష్టించే ఆదాయాల ద్వారా తిరిగి చెల్లించబడుతుందని, ఆ విధంగా ఆర్థిక వ్యవస్థకు కావలసిన ఆదాయ, పెట్టుబడివ్యయాల అవసరాలు తీర్చనున్నట్లు ప్రభుత్వం చెప్పుకొంది. అయితే, ప్రభుత్వ వాదనను కాగ్ తోసిపుచ్చింది. ఆఫ్-బడ్జెట్ ఆర్థిక సహాయం తరువాతి సంవత్సరాలకు వ్యయాన్ని వాయిదావేసే సాధనమని కాగ్ పేర్కొంది. ఆ విధంగా ద్రవ్య సూచికలకు అందనంత పరిమాణంలో రుణాలు పేరుకుపోతాయి. ప్రభుత్వ అవ్యక్త ప్రమేయ లేదా స్పష్టమైన హామీపై పూర్తిగా ఆధారపడుతున్నప్పటికీ, అటువంటి రుణాలు రుణాలుగా లేదా హామీలుగా ఖాతాలలో చేర్చడంలేదు. అంటే ఆర్థిక సహాయ పథకాలకు, సబ్సిడీలకు ఆఫ్-బడ్జెట్ రుణాలను ప్రభుత్వం ఉపయోగిస్తున్నదని దానర్థం. 2014-17 మూడు సంవత్సరాల్లో రెవిన్యూలోటు ధోరణులను కాగ్ విశ్లేషించింది. ఎఫ్ఆర్‌బిఎం చట్టం ఆదేశిత రెవిన్యూలోటు లక్ష్యాలను మూడు సంవత్సరాల్లో వరుసగా స్థూలజాతీయ ఉత్పత్తిలో 2.9 శాతం, 2.5 శాతం, 2.1 శాతం నెరవేర్చగలిగినట్లు కాగ్ కనుగొన్నది. అయితే, ఆహారపదార్థాలు, ఎరువుల సబ్సిడీ ఆఫ్-బడ్జెట్‌ఆర్థిక సహాయం ద్వారా ఈ లక్ష్యాలు తీర్చబడ్డాయి. వీటికి సంబంధించి సమాచారాధ్యయనాలనుకూడా కాగ్ వెల్లడించింది. ఒక ఏడాదిలో రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖకు చేసిన బడ్జెట్ కేటాయింపు ఎరువుల సబ్సిడీల బకాయిలన్నింటినీ తీర్చడానికి సరిపోకపోతే, ఆ తరువాతి ఆర్థిక సంవత్సరానికి దాన్ని కొనసాగించినట్లు ఒక సమాచారాధ్యయనంలో కాగ్ స్పష్టంగా పేర్కొంది. 2018లో సవరించబడిన ఎఫ్ఆర్‌బీఎం చట్టం రెవిన్యూలోటు లక్ష్యాలను నిర్మూలించడంతో, రెవిన్యూలోటు క్లిష్టమైన సమస్యను పరిష్కరించలేని ప్రమాదాన్ని కొనసాగిస్తుంది.

2003 నాటి ఒరిజినల్ ఎఫ్ఆర్‌బీఎం చట్టం ద్రవ్యలోటును జీడీపీలో 3 శాతానికి, రెవిన్యూలోటు జీరోకి తగ్గించి రెవిన్యూ వ్యయంకొరకు రుణాలు చేయకుండా చూసేందుకు వుద్దేశించబడింది. భవిష్యత్ రుణ సేవల అవసరాలను తీర్చడానికి తగిన ఆదాయాన్ని సృష్టించలేని రంగాలలో అప్పుచేసిన నిధులను గుమ్మరించడంవల్ల తీవ్రప్రమాదం ఏర్పడగలదని కూడా కాగ్ అభిప్రాయపడింది. నరేంద్రమోడీ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో లక్షకోట్ల రూపాయల తాయిలాలు ప్రకటించారు. రైతుల ఖాతాల్లోకి నిధులు, వడ్డీలేని రుణాలు సహా రకరకాల పథకాలకు లక్షకోట్లు ఖర్చు చేస్తారు. రెవిన్యూలోటు లక్ష్యాలను నిర్మూలించడంవల్ల దేశంలో ద్రవ్యలోటు జీడీపీలో 3.4 శాతానికి పెరగవచ్చని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ తెలియజేసింది. మోడీ ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చేపట్టే పథకాలకు ఆఫ్-బడ్జెట్ ఆర్థిక సహాయం అంతిమంగా దేశ ప్రజలనుండి ముక్కు పిండి పన్నులు వసూలు చేయడానికి దారితీస్తుందని అర్థంచేసుకొని అప్రమత్తంగా వ్యవహరించవలసిన అవసరంవుంది.

చురక

హ్యాకింగ్‌తోని ఓట్లు
అయిపోతే తారుమారు
ఈవీఎం యంత్రాల్లో
ఇక నమ్మిక దిగజారు

అనుమానం విపక్షాల్లో
అంతా పుట్టిదనే బదులు
సర్కారిక నివృత్తిని
చేస్తే నిజం ఏదో కదులు

- వేల్పుల నారాయణ

ఉన్మాదంగా మారుతున్న అభిమానం

ఒక పక్క అవివేకంతో అభిమానులు తన్నుకు చస్తుంటే, మరోపక్క చిత్ర సీమలో కూడా కుల కార్చిచ్చు అభిమానుల జీవితాలతో చెలగాటమాడుతోంది. ఈ కులాల కుమ్ములాటలు ఎప్పుడో సినీ రంగంలో ప్రవేశించినా, అది అంతర్గతంగానే ఉండేవి కాని బయటపడేవి కాదు. సినీరంగంలో కూడా ఒక వర్గానిదే ఆధిపత్యం కావటంతో ఇతర కులాలకు చెందిన ఎంతో మంది వర్ధమాన హీరోలు ఒక మెరుపు మెరిసి మాయమయ్యారు. ఇప్పుడు సినీ పరిశ్రమను రెండు కులాలు శాసించాలని చూడటంతో అభిమానులు కూడా రెండు వర్గాలుగా చీలిపోయి పరస్పరం ఒకరి మీద ఒకరు కాలు దువ్వుతున్నారు.

అక్షర శరాలు

- అలేఖ్య

ఇటీవల తమిళనాడులో ఇద్దరు అగ్రహీరోల చిత్రాలు సంక్రాంతి సందర్భంగా విడుదల కాగా, ఇద్దరి హీరోల అభిమానులు తమ హీరోల సినిమాల ఫ్లెక్సీలు చించారని ఆరోపిస్తూ పరస్పరం ఘర్షణకు దిగగా చివరకు కొంతమంది అభిమానులు కత్తిపోట్లకు గురయ్యారు. దాని పర్యవసానంగా తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా సినిమా థియేటర్ల దగ్గర పోలీసులు కాపలా కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. చివరకు మన దేశంలో రెండు గంటల పాటు నడిచే సినిమాలను సైతం పోలీసు బందోబస్తు మధ్య చూడాల్సి రావటం సిగ్గుచేటు. ఒకప్పుడు సినిమా హీరోల అభిమానులు వారు ఆరాధించే సినీ హీరోల పుట్టిన రోజు పండుగలు, సినిమా విడుదల వేడుకలు వంటివి పెద్ద ఎత్తున జరిపి సంతృప్తి చెందేవారు. కాని నేటి అభిమానులు అంతటితో ఆగకుండా ఇతర హీరోలపై దురభిమానం పెంచుకుంటూ వారి సినిమాలపై బురద జల్లుతున్నారు.

టాలివుడ్, కోలివుడ్, బాలివుడ్ వంటి అన్ని చిత్ర పరిశ్రమల్లో అగ్రస్థాయి నటులందరికీ అభిమాన సంఘాలున్నాయి. వీరి చిత్రాలు విడుదలయ్యేటప్పుడు ఈ అభిమాన సంగాలు చేసే హడావుడి అంతా ఇంతా కాదు. హీరోలకు భారీ ఎత్తు కటౌట్లను ఏర్పాటు చేయటం, విడుదలయిన మొదటి రోజు థియేటర్లలో టిక్కెట్లన్నీ కొనుగోలు చేసి టపాసులు కాలుస్తూ ఓ పెద్ద ఉత్సవంలా జరుపుతుంటారు. ఈ అభిమానుల్లో ఎక్కువ శాతం కాలేజీ కుర్రకారే. వీళ్లు చదువులను అశ్రద్ధ చేస్తూ, తల్లిదండ్రుల కష్టార్జితాన్ని దుర్వినియోగం చేస్తూ అభిమానం అనే ముసుగులో అరాచకాలకు పాల్పడుతున్నారు. వీళ్ల కళాశాలకు వెళ్లే రోజుల కన్నా, సినిమా హాళ్లలో గడిపే రోజులే ఎక్కువ. వీరిలా ప్రవర్తించటానికి వీరి తల్లిదండ్రులే కారణం. వీళ్లసలు కళాశాలకు వెళ్తున్నారా లేదా, వీరు ఎవరితో స్నేహం చేస్తున్నారు వంటివేమీ పట్టించుకోక పోవడం వల్ల వీళ్లిలా విచ్చలవిడిగా తిరగటానికి అలవాటు పడ్డారు. సినీ హీరో కూడా ఎంత సేపటికి వీరిని కేవలం వాళ్ళ "కీర్తి ప్రతిష్టలు మోసే కూలీలు"గా పరిగణిస్తున్నారు తప్ప నిజమైన అభిమానం చూపించట్లేదనేది నిజం. అభిమానులను వాళ్ల అవసరాల కోసం వాడుకునే వారే కాని, అభిమానుల మంచి చెడులు పట్టించుకునే వాళ్లేలేరు. వీళ్ల సినిమా ఫంక్షన్లలో ప్రమాదాలకు లోనయి అశువులు బాసిన అభిమానులు ఎంతో మంది ఉన్నారు. మరణించిన అభిమానుల కుటుంబాలను ఆదుకున్న హీరోలను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు.

సినిమా అనేది ఒక రంగుల కల. తను చెయ్యలేని పనులు తెరపై తమ హీరో చేస్తున్నప్పుడు తనకు తెలియకుండానే ఆ హీరో తన శరీరంలోకి పరకాయ ప్రవేశం చేసి అచ్చు ఆ హీరోలానే ప్రవర్తించటం మొదలెడతారు అభిమానులు. ఇది ఒక రకమైన మానసిక బలహీనతే. జీవితం వేరు, తెరపై సినిమా వేరు అనే నిజాన్ని గ్రహించలేని అనుభవ శూన్యులైన యువకులందరూ కొద్దో గొప్పో ఈ మాయా ప్రపంచంలో గడుపు తుంటారు. వీళ్లు ఎంతగా తమ అభి మాన నటీనటులను ప్రేమిస్తారంటే, కేవలం మొదటి ఆట సినిమా టిక్కెట్లు దొరక లేదని ఆత్మ హత్యలు చేసుకున్న వాళ్లూ వున్నారు. ఇప్పుడు ఒకేసారి ఇద్దరు అగ్రహీరోల సినిమాలు విడుదల కావటంతో పోటీలు పడి అభిమానులు తమ హీరో సినిమా బాగుందంటే, తమ హీరోదే బాగుందని వాదులాటకు దిగి, చివరకు ఘర్షణలు తలెత్తి ఆరుగురు కత్తిపోట్లకు గురయ్యారు. మరో అభిమాని సినిమా టిక్కెట్టు కొనటానికి డబ్బులివ్వలేదనే కోపంతో కన్న తండ్రినే కిరోసిన్ పోసి కాల్చి చంపేశాడు.

ఒక పక్క అవివేకంతో అభిమానులు తన్నుకు చస్తుంటే, మరో పక్క చిత్ర సీమలో కూడా కుల కార్చిచ్చు అభిమానుల జీవితాలతో చెలగాటమాడుతోంది. ఈ కులాల కుమ్ములాటలు ఎప్పుడో సినీ రంగంలో ప్రవేశించినా, అది అంతర్గతంగానే ఉండేవి కాని బయటపడేవి కాదు. సినీ రంగంలో కూడా ఒక వర్గానిదే ఆధిపత్యం కావటంతో ఇతర కులాలకు చెందిన ఎంతో మంది వర్ధమాన హీరోలు ఒక మెరుపు మెరిసి మాయమయ్యారు. ఇప్పుడు సినీ పరిశ్రమను రెండు కులాలు శాసించాలని చూడటంతో అభిమానులు కూడా రెండు వర్గాలుగా చీలిపోయి పరస్పరం ఒకరి మీద ఒకరు కాలు దువ్వుతున్నారు. ఇటీవల ఇద్దరు తెలుగు హీరోలు ఒకరి మీద ఒకరు సంస్కార హీనంగా విమర్శలు గుప్పిస్తూ పరోక్షంగా అభిమానులను రెచ్చగొడుతున్నారు. పలు టీవీఛానల్స్ కూడా వీరి అసందర్భ ప్రేలాపనలకు అం తం చెప్పకుండా, ఒకరి తరువాత ఒకరితో మార్చి మార్చి ఇంటర్వ్యూలు కొనసాగిస్తూ వీరి వివాదాన్ని రావణ కాష్టంలా కొనసాగిస్తూనే ఉన్నాయి.

సామాజిక మాధ్యమాలు వచ్చిన తరువాత ఈ అభిమానులనబడే ఆకతాయిల ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. సినీ హీరోల కుటుంబ సభ్యులను కూడా ఈ సామాజిక మాధ్యమాల్లోకి ఈడ్చి వారి పరువు మర్యాదలకు భంగం కలిగించటం ఎంత వరకు సమం జసమో ఒకసారి ఆలోచించుకోవాలి. ఈ మధ్య ఒకే కుటుంబం నుండి ఇద్దరు ముగ్గురు హీరోలు తెరపైకి వస్తుండటంతో, అభిమానులు కూడా ఎవరికి మద్ద తివ్వాలో తెలియక సందిగ్ధంలో పడ్డ సందర్భాలూ లేకపోలేదు. సినిమాను సినిమాగా చూడలేని ఈ దురభిమానుల వల్ల సినీ హీరోలు కూడా ఒక చట్రంలో ఇరుక్కుపోతున్నారు. ఈ చట్రం దాటి బయటికొచ్చి నటిద్దామని కథానాయ కులకున్నా వారి అభిమానులు మాత్రం అంగీక రించే స్థితిలో లేరు. కమల్‌హాసన్ లాంటి బహు ముఖ ప్రజ్ఞాశాలికి, మాత్రమే ఇటువంటి ఇనుప చట్రాల నుండి బయటపడే సామర్థ్యం ఉంది.

ఇటీవల సినిమా థియేటర్లు కూడా కొంత మంది వ్యక్తుల చేతుల్లో ఉండటం వల్ల, చిన్న హీరోల సినిమాలకు థియేటర్లు దొరకని పరిస్థితి. ఇటీవల ఒక అగ్ర హీరో చిత్రానికి సైతం సినిమా థియేటర్లు దొరకకపోవడంతో, ఆ హీరో అభిమానుల ఆగ్రహజ్వాలలకు అంతే లేకుండా పోయింది. ఒకప్పుడు హీరోల మధ్య సయోధ్య ఉండటంతో మల్టీస్టారర్ సినిమాలు ఎక్కువగా వచ్చేవి. సినిమాలో పాత్రపరంగా ఒకరికి ఎక్కువ నిడివి, మరొకరికి తక్కువ నిడివి ఉండవచ్చు. ఉదాహరణకు మిస్సమ్మ సినిమా తీసుకుంటే కథా పరంగా సావిత్రిది అందులో కథానాయిక, ఎన్‌టి రామారావుది ఆమె కన్నా తక్కువ పాత్రే, ఏఎన్ఆర్‌ది ఒక రకంగా హాస్యనటుడి పాత్ర. కాని ఎవరి పాత్రల్లో వారు జీవించటంతో ఆ చిత్రం ఇప్పటికీ అజరామరమే. అదే కోవలోకి మాయాబజార్, గుండమ్మ కథ వంటి గొప్ప గొప్ప చిత్రాలు వచ్చాయి. అటువంటి చిత్రాలు మళ్ళీ రావనే చెప్పుకోవాలి.

ఈ మధ్య తమ హీరో చిత్రం కన్నా, వేరొక హీరో చిత్రం ఎక్కువ రోజులు ఆడకూడదని, సామాజిక మాధ్యమాల్లో వేరొక హీరో సినిమా విడుదల కాక ముందే సినిమా బాగోలేదనే ప్రచారం చేస్తూ వారి వక్రబుద్ధిని చాటుకుంటున్నారు. ఈ విషయంలో అగ్ర హీరోలు సైతం అభిమానులపై మండిపడటం గమనించదగ్గ విషయం. అభిమానుల ముసుగులో కొంత మంది రౌడీలు సినిమా విడుదల రోజు థియేటర్ యజమానులను బెదిరించి టిక్కెట్లన్నింటిని చేజిక్కించుకుని, వాటిని బ్లాక్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. వీరి ఆగడాలు ఒప్పుకోని సినిమా థియేటర్లపై దాడులకు పాల్పడి తీవ్ర నష్టానికి గురి చేస్తున్నారు. అభిమానుల మంచి, చెడులు ఆలోచించే హీరోలైతే వారి అభిమాన సంఘాలను రిజిష్టర్ చేసి, ప్రతి అభిమాని వివరాలు నమోదు చేయాలి. దీనివల్ల నిజమైన అభిమానులెవరో, వీధి రౌడీ లెవరో తెలిసిపోతుంది. ప్రతి అభిమానికి గుర్తింపు కార్డు ఇవ్వటం ద్వారా ముందు ముందు గొడవలకు తావుండదు. అభిమానులకు ప్రవర్తనా నియమావళి కూడా ఏర్పరిచినట్లయితే వాళ్ల హద్దులు మీరకుండా కట్టడి చేయగలుగుతాం. ఇటువంటి చర్యల పట్ల సినీ హీరోలు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఏది ఏమైనా సినిమాను సినిమాగా చూస్తే అందరికీ మంచిది. చివరిగా అభిమానులకు ఒక్క విన్నపం. మీ సినీ హీరోల కోసం మీరు జీవితాలు పణంగా పెట్టే ముందు మీరే జీవితమని, జీవితాంతం మిమ్మల్ని అభిమానిస్తూ, మీ కోసం బ్రతికే మీ తల్లిదండ్రుల గురించి ఒక్కసారి ఆలోచించండి.. మీ నిజమైన హీరోహీరోయిన్లు, మీ తల్లి, తండ్రే అని గుర్తించండి.

వి-మెయిల్

కాంగ్రెస్ వద్రా/వజ్రా-యుధం ప్రియాంక

కాంగ్రెస్ పార్టీ ప్రియాంక గాంధీని క్రియాశీలక రాజకీయాల్లోకి తీసుకురావడం ఒక అనివార్య పరిణామం. ఆమె 2004 నుండి తన తల్లి, తమ్ముడు ఎన్నికల వరకూ ఆయా నియోజకవర్గాల్లో చేదోడుగా ఉన్నా విస్తృత పరిధిలో ఏ భూమికా తీసుకోలేదు. ఈ సారి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా తూర్పు ఉత్తరప్రదేశ్ భాధ్యతలు తీసుకోవడం ఆ పార్టీకి మేలైన వ్యూహం. సార్వత్రిక ఎన్నికల ముంగిట్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపగలదు.పార్టీ పునరుజ్జీవనం మాటెలా ఉన్నా ప్రస్తుతం నిలదొక్కుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఎంతో కీలకంగా మారింది. దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభ తగ్గుతున్నా అందుకు దీటుగా కాంగ్రెస్ ఎదిగిన దాఖలాలు లేవు. తన ఖాతాలోకి కొన్ని విజయాలు వచ్చి చేరుతున్నా మొత్తంగా చూస్తే మెజారిటీ సాధించడానికి అనుకూలతల కన్నా ప్రతికూలతలే ఎక్కువ. పోలిక వచ్చినప్పుడు ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీ మోడీ ముందు తేలిపోతున్నారు.రాన్రానూ ఎదుగుతూనే ఉన్నా.

ఇందులో ఆయన తప్పేమీ లేకున్నా ఆయన్ని ప్రధానికి సమవుజ్జీగా భావించే పరిస్థితులు లేవు. జాతీయ పార్టీలు పూర్తి మెజారిటీలు సాధించే పరిస్థితులు అనుమానాస్పదమౌతున్నపుడు ప్రాంతీయ పార్టీలు చొరవ తీసుకుంటున్నాయి. బీజేపీ వ్యతిరేక పార్టీలు కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని బేషరతుగా ఆమోదించే ఆలోచనలో లేవు.ఉన్నా అవి నిలకడగా లేవు. నిన్నటివరకూ రాహుల్ ప్రధాని అభ్యర్థి అన్న డీఎంకే స్టాలిన్ నేడు మమత బెస్ట్ అంటున్నారు.కాంగ్రెస్ లేనిదే స్థిరమైన బీజేపీయేతర పక్షం సాధ్యం కాదంటున్న చంద్రబాబు రాహుల్ ప్రధాని అభ్యర్థి అంటూ గట్టిగా చెప్పడం లేదు.ఈ పరిస్థితిలో వీలైనన్ని ఎక్కువ సీట్లు తెచ్చుకోవడమొక్కటే కాంగ్రెస్ కే కాదు ఏ పక్షానికైనా మొదటి ప్రాధమ్యం. సీట్లను బట్టే గౌరవమైనా.. అధికారమైనా. ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతానికి కాంగ్రెస్‌ది దయనీయ స్థితి. ఎస్పీ, బీఎస్పీ బలంగా ఉన్నాయి. బీజేపీ అధికారంలో ఉంది.అక్కడ ఏమైనా ముందంజ వెయ్యగలిగితే ఆ ప్రభావం అన్ని విధాలా పనికి వస్తుంది. ప్రియాంకతో బాటు సింధియాని కూడా ఉత్తరప్రదేశ్ బాధ్యతల్లో చోటు కల్పించడం ద్వారా తాను చేస్తున్నది వన్ మాన్ షో కాదు అని ఆ పార్టీ చెప్పినట్టయింది. బీజేపీయేతర పక్షాన్ని నడపడానికి రాహుల్ తో పాటు ప్రియాంకను కూడా గమనంలోకి తీసుకోవచ్చు అంటూ మిత్రపక్షాలకు సందేశం పంపినట్టయింది. ఆమె అక్కడి భాధ్యతలకే పరిమితం కాకుండా మరికొన్ని రాష్ట్రాల్లో ప్రచారం నిర్వహిస్తే ఫలితాలు మెరుగుపడొచ్చు. ఏదేమైనా సమయానికి తగ్గ సరైన నిర్ణయం.

- డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం

పరిపాలకులు

రాజ్యాంగ విలువలను కాపాడాలి

సోమవారం విజయవాడ సంగమం వద్ద ఒక దొంగస్వామి పిల్లలులేని వారికి పిల్లలు పుట్టిస్తానంటు సువర్ణ దాంపత్య యాగం చేశాడు. ఈ యాగానికి కేంద్రమంత్రి గడ్కారీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెళ్లి దొంగస్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధం కాదా!

42 వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976 లో అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి లౌకికవాదం (సెక్యులరిజం) అనే పదాన్ని రాజ్యాంగాల్లో చేర్చింది. లౌకికవాదమంటే పాలనలో ఎక్కడా మతపరంగా ఆచారాలు, దేవుడు, మూహుర్తాలు, పూజలు, వాస్తు, జ్యోతిష్యం, ఇలాంటి వాటిని పాటించకూడదు. ఒకవేళ ఉండివుంటే వ్యక్తిగతంగా మాత్రమే సొంత విషయాలలో పాటించుకోవాలి. అంతేతప్ప ప్రభుత్వ పరంగా, ప్రజాధనంతో అలాంటివి చేయరాదు. లౌకికవాదమంటే అది. ఈ విధంగా పాటించకపోవటం రాజ్యాంగ విరుద్ధం. మరి మొన్న మంత్రులు చేసింది దేనికిందకువస్తుంది??

ప్రకాశంజిల్లాలో ఈ రామదూత అనబడే ఈ దొంగస్వామి గుడ్లూరుమండలం చేవూరు లోని చెరువుపోరంబోకు సర్వే నంబరు 879లోని కోట్లాది రూపాయల విలువగలిగిన ప్రభుత్వభూమిని ఆక్రమించి పెద్దపెద్ద కట్టడాలు నిర్మించి ఆశ్రమం పేరుతో దేవుడు, ధ్యానము, పిల్లలులేని వారికి పిల్లలు పుట్టిస్తామంటూ సువర్ణ దాంపత్య యాగాలు చేస్తూ మోసం చేస్తున్నాడు. పైగా ఈ భూమితనదేనంటూ జిల్లా రిజిష్ట్రార్ కార్యాలయంలో తప్పుడు అఫిడవిట్ ఇచ్చాడు. తరువాత ఆర్టీఐ కింద ఆ భూమి ఎవరిదని గుడ్లూరు తహశీల్దారుని అడుగగా ఆభూమి ప్రభుత్వానిదేనని అడంగల్ కాపీ పంపించాడు. ఈ దొంగస్వామి ఆక్రమించిన భూమికి సంబంధించి కేసులు హైకోర్టులోనూ, లోకాయుక్తలోను ఉన్నాయి.

ఈ పరిస్థితులలో దొంగస్వామి నిర్వహించే యాగానికి ముఖ్యమంత్రి, కేంద్రమంత్రులు వస్తే ప్రజలకు ఏ రకమైన సంకేతాలు అందుతాయి? మంత్రులు దొంగలకు మద్దతు ప్రకటించినట్లు కాదా! ఇది రాజ్యాంగ విరుద్ధం కాదా ! హైకోర్టు, లోకాయుక్తలపై ఈ మంత్రుల ప్రభావం పడదా!! తక్షణమే భూఆక్రమణదారునిగా పేరుపొందిన దొంగరామదూతస్వామిని అరెస్టు చేసి, ఆక్రమణ భూమిని స్వాధీనం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది .

కేంద్రమంత్రి గడ్కారీ పదేపదే ఈ ఆశ్రమానికి వచ్చిపోతుంటాడు, చుట్టాల ఇంటికి వచినట్లు.ఇందువలన అధికారులు కూడా ఈ దొంగస్వామి ప్రభుత్వ భూఆక్రమణను పట్టించుకోవడంలేదు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అయినా చంద్రబాబు నాయుడు 2001లో జన్మభూమిలో మూఢ నమ్మకాల నిర్మూలనను చేరుస్తానని ప్రకటించాడు. కనుక ఇప్పటికైనా దొంగ స్వాములను అరెస్టు చేసి, వారు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసికొని, ఆశ్రమాల గుట్టురట్టు చేసినట్లయితే దేశ లౌకికవాదాన్ని కాపాడినట్లుంటుంది. అయినా మంత్రులు పొందవలసింది ప్రజల ఆశీర్వాదాలుగాని, దొంగబాబాల ఆశీర్వాదంకాదు. దేరాబాబా, ఆశారాంబాపు, రాంపాల్, నిత్యనందస్వామి, ప్రేమానంద స్వామి, అంతా జైల్లలో మగ్గుతు న్నారు. ఇవ్వాళ కాకపోయినా రేపైనా రామ దూతలు జైలుకి పోవలసినవారే. ఎందుకంటే రామదూత తనవద్ద దీర్ఘరోగాలు నయంచేసే మహిమలున్నాయని చెప్పుకుంటున్నాడు. ఇలాంటి దొంగలను "ది డ్రగ్స్ అండ్ మాజిక్ రెమెడీ అక్ట్ 1954" కింద అరెస్టు చెయ్యాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య.
అధ్యక్షుడు, ఏ.పి, హేతువాదసంఘం.

కృశిస్తున్న ఉద్యోగ రంగం

విద్యారుణాలకు గడ్డుకాలం

రుణదాతలు, బ్యాంకులు మౌనం

రోజురోజుకూ ఉద్యోగం కృశించిపోవడంతో నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో దేశీయ, విదేశీయ విద్యా ర్థులకు రుణాలు పుట్టడం గగనంగా మారింది. బ్యాంకు రుణాలతో విద్యార్జన చేసినవారు రుణచెల్లింపులకు నానా అగచాట్లు పడుతున్నారు. దీంతో చాలా బ్యాంకుల్లో విద్యార్థులు డిఫాల్టర్లుగా మారుతున్నారు. విద్యారుణాలన్నీ ప్రభుత్వ రంగ బ్యాంకులవే కావడం గుర్తించతగ్గ అంశం. విద్యారుణాలు జమకాకపోవడం ఉద్దేశ్యపూర్వకం గానో లేదా సంపాదన లేక చెల్లించడంలేదా అనే విషయంపై బ్యాంకులు దృష్టి పెట్టాయి. దేశ వ్యాప్తంగా ఉద్యోగ రంగంపై కారుమబ్బులు కమ్ముకున్నాయి. సాంకేతికత నిండిన వ్యాపా రాలు, స్టార్టప్ కంపెనీలు జోరందుకున్నాక ఈ పరిస్థితి తలెత్తింది. క్లౌడ్, అనలిటికల్, ఆర్టిఫీషి యల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమమేధ) ఆటోమేషన్ (యాంత్రీకరణ), ఇంటర్‌నెట్ విస్తృతమయ్యాక ఉద్యోగాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ పరిస్థి తుల్లో విద్యార్జన చేసి బయటకు వచ్చిన వారి విషయం దారుణంగా మారింది. ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రుణాలు రాజకీయంగా సున్నిత అంశాలుగా మారాయి. భారతీయ బ్యాంకుల అసోసియేషన్ (ఐబీఏ) మేరకు ప్రభుత్వ బ్యాంకుల్లో రుణ ఎగవేతలు గత రెండేళ్లలో ఎక్కువగా పెరిగాయి.



2016లో విద్యారంగంలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 7.29 ఉండగా, 2018 నుంచి 8.97కు పెరిగాయి. విద్యా రుణాలు మంజూరు చేసినవాటిలో 94.68శాతం ప్రభుత్వ బ్యాంకులే ఉన్నాయి. విద్యారుణాలు పొందినవారిలో నర్సింగ్ విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. 2017-18లో రూ. 2,263 కోట్ల రుణాలు మంజూరు కాగ, అంతకు ముందు ఏడాది రూ.1,154 కోట్లు బ్యాంకులు రుణాలుగా అందించాయి. రుణాలు చెల్లించనివారిలో ఇంజనీరింగ్ విద్యార్థులు రెండో స్థానంలో ఉన్నారు. 2018 నాటికి 9.76 శాతం మొండి బకాయిలు ఉన్నాయి. 30 మంది వ్యాపారవేత్తల పరిశ్రమలకు రుణాలు రద్దు చేయడంతో విద్యారుణాలు మంజూరు చేయడం బ్యాంకులకు కష్టంగా మారింది. దీంతో విద్యార్థులకు వ్యతిరేక ఫలితాలు వస్తున్నాయి. 2018 మార్చినాటికి మొత్తం రూ. 72,839 కోట్ల విద్యా రుణాల బకాయిలు ఉన్నాయి. 2017 మార్చి నాటికి అవి రూ. 72,818 కోట్లుగా ఉన్నాయి. 2016లో విద్యారుణాలపై వడ్డీ 9.46 శాతం ఉండగా 2017 నాటికి దాన్ని 6.87 శాతంగా పెంచారు. 2013-14ల్లో విద్యారుణం 24 శాతానికి పెరిగి, రూ. 11,452 కోట్ల నుంచి 59,834కోట్లకు పెరిగింది. 2012-13ల్లో మొత్తం విద్యారుణాలు రూ.48,382 కోట్లు. బ్యాంకుల్లో విద్యారుణాల నిరర్థక ఆస్తులు రూ. 2,615 కోట్లుగా ఉన్నాయి. రూ. 4 లక్షల వరకు విద్యారుణాలకు హామీ ఉండనక్కర్లేదు. రూ. 4 లక్షల నుంచి రూ.7.5 లక్షల వరకు బ్యాంకులు మూడో పార్టీ గ్యారెంటీలను అడుగుతాయి. రూ.7.5 లక్షల నుంచి అంతకు సమానమైన హామీలతోపాటు రానున్న రోజుల్లో ఉద్యోగిగా ఎంతమొత్తం సంపాదిస్తాడు ? వాయిదాకు ఎంత చెల్లింపులు జరుపుతారన్న విషయంలో బ్యాంకులు వివరణ కోరుతున్నాయి. బ్యాంకుల విద్యారుణాల చెల్లింపులు విద్యానంతరం వారు ఉద్యోగాలు పొందే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుందని కేర్ నివేదిక తెలిపింది.

విద్యారుణాల చెల్లింపులు విద్యాలయాలపై ప్రభావం చూపుతోంది. బలహీనమైన జాబ్ మార్కెట్ నిరుద్యోగులకు శాపంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యారుణాల చెల్లింపులను 15 ఏళ్ల వరకు పెంచడం వరంగా భావించవచ్చు. విద్యకు సరిపడా ఉద్యోగాలు పొందకుంటే ఈఎంఐలు చెల్లించడం కష్టంగా మారుతుంది. అందువల్ల వారికి చిన్నమొత్తాల్లో వాయిదాలు కట్టేందుకు బ్యాంకులు అనుమతించాలి. ఏది ఏమైనా ఉద్యోగాల కల్పన లేకుంటే విద్యారుణాలు జమకావు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 30 శాతం విద్యారుణాల డిఫాల్టర్లు ఉన్నారు.

విశాలాంధ్ర
బతుకు
The Life
గురువారం
24 జనవరి 2019



మాకూ హక్కులున్నాయ్!

మాకూ హక్కులున్నాయ్, వాటిని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న హిజ్రా. ఢిల్లీలో జరిగిన ఒక నిరసన కార్యక్రమంలో దృశ్యం ఇది.

పండుటాకులకు ఆసరా



ఒంగోలు ఎఐఎస్ఎఫ్ హాస్టల్ విద్యార్థులకు ఒక చరిత్ర ఉంది. అది కేవలం విద్యలో ఉన్నతంగా రాణించటం మాత్రమే కాదు. అప్పటి సామాజిక సమస్యలపై పోరాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నతంగా ఎదగటం ఇలా ఏదైనా వారికి వారే సాటి అన్నతీరుగా వారి జీవితాలు దిశానిర్దేశం చేసుకున్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలను స్పృశించారు. కేవలం వారు ఉన్నత శిఖరాలకు ఎదగటమే కాకుండా తాము నేర్చుకున్న మానవతా వాదాన్ని ఆచరణ రూపంలో పెట్టారు. ఇది వారి విలువలతో కూడిన నడవడికకు దర్పణం పడుతుంది. అటువంటి వారి ఆలోచనల నుండి ఉద్భవించినదే ఆసరా కేంద్రం. సరోజ్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడపబడుతున్న ఈ వృద్ధాశ్రమ కేంద్రం... జీవితంలో అనేక ఒడిదుడుకులు చవి చూసిన వారికి చరమాంకంలో ప్రశాంతమైన జీవితాన్ని అందిస్తోంది. పేరుకు తగ్గట్టుగా స్వచ్ఛమైన పల్లెటూరి వాతావరణంలో ఆసరా అందిస్తోంది. ఈ 'ఆసరా కేంద్రం' ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం లోని పెద్దకొత్తపల్లి పంచాయితీ పరిధి మారెళ్లగుంట పాలెంలో మూడు ఎకరాల సువిశాల స్థలంలో పచ్చని పంట పొలాల నడుమ ఉంది. నాటి ఎఐఎస్ఎఫ్ హాస్టల్ విద్యార్థులు ముందుకు వచ్చి దీనిని నిర్మించారు.



ఆసరా కేంద్రం ప్రారంభోత్సవ దృశ్యం

నిర్మాణానికి బీజాలు ఇలా

జర్నలిస్టుగా ఉన్న నాతాని భూపతిరావు బిల్డర్‌గా బెంగుళూరులో వుంటున్న చిడిపోతు వెంకటేశ్వర్లు యాదృశ్చికంగా ఒకరోజు బెంగుళూరులో కలుసుకున్నారు.సుదీర్ఘకాలం తర్వాత కలుసుకున్న వీరిరువురు నాటి కాలేజీ చదువులు, ఎఐఎస్ఎఫ్ హాస్టల్‌లో భోజనాలు, ఉద్యమాలు, ఘటనలు గుర్తు చేసుకున్నారు. వారిద్దరి ఆలోచన ఫలితం వెంటనే విజయవాడలో ఒక సమావేశానికి దారి తీసింది. ఈ సమావేశానికి గద్దం కోటేశ్వరరావు, ఎన్ అంజయ్య, నలజాల కొండయ్య, నలజాల రంగారావు, పి బాబూరావు, వి సింగయ్య, ఇండ్లమూరి రామయ్య, బాల సుబ్రమణ్యం, సిహెచ్ వెంకటేశ్వర్లు, నాతాని భూపతిరావు హాజరయ్యారు. ఈ సమావేశంలో నాటి ఎఐఎస్ఎఫ్ హాస్టల్‌లో కలిసి చదువుకున్న సంఘటనలు, కలిసి భోజనం చేసిన తీపిగుర్తులు, ఎటువంటి దురలవాట్లకు లోనుకాకుండా క్రమశిక్షణతో మెలిగిన వైనం, జీవితాలలో ఉన్నత శిఖరాలకు ఎలా ఎదిగామో మననం చేసుకున్నారు. నాటి భావాలకు అనుగుణంగా ఏదైనా మంచి కార్యం చేపట్టాలని నిర్ణయానికి వచ్చారు. అనుకున్నదే తడవుగా ఒంగోలులో ఉన్న ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న)కు విషయం తెలిపారు. ఇటువంటి మంచి కార్యం ఎప్పుడో చేయాల్సిందని హితవు పలికారాయన.వెంటనే నాటి హాస్టల్ విద్యార్థుల అడ్రస్సులు, ఫోన్ నంబర్లు సేకరించి అందరితో 2013 నవంబర్ 24న సమావేశం ఏర్పాటు చేశారు. సమవేశానికి వచ్చిన నాటి శర్మకళాశాలలో చదువుతూ ఎఐఎస్ఎఫ్ హాస్టల్‌లో భోజనం చేసిన 200 మంది పూర్వ విద్యార్థులు విషయం విని ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. పేద, ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్స్‌లో ఉండి విద్యను అభ్యసించే అవకాశం వుందని, మిగతా కులాలకు ఆవసతి లేనందున రూములలో ఉండి, ప్రతి రోజు ఒంగోలు వచ్చి పోతూ చదువుకునే విద్యార్థులకు కొంతమందికైనా భోజనం పెట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.



ఆశ్రమంలో జిమ్ చేస్తున్న వృద్ధుడు



లాన్ లో ఏర్పాటు చేసిన షెల్టర్

యువతలో ప్రగతశీల భావాలను పెంపొందించేలా, సామాజిక సమస్యలపై సదవగాహన కలిగేలా సభలు సమావేశాలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు అసోసియేషన్ ఫర్ సోషల్ రీసెర్చి అండ్ అడ్వన్స్‌మెంట్ (ఆసరా) సంస్థను ఏర్పాటు చేశారు. 15 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. చిడిపోతు వెంకటేశ్వర్లును అధ్యక్షులుగా, నన్నపనేని అంజయ్యను ప్రధాన కార్యదర్శిగా, వి సింగయ్యను కోశాధికారిగా ఎంపిక చేసుకున్నారు. ఈ సంస్థను 2014 సెప్టెంబర్ 28న ఒంగోలులో అప్పటి హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించారు. ఆ కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి, అరసం నాయకులు కోట పురుషోత్తమరావులు హాజరయ్యారు. ఆసరాకు అధ్యక్షులుగా ఉన్న చిడిపోతు వెంకటేశ్వర్లు ఆ పాటికే సరోజ్ సేవా ఫౌండేషన్ పేరుతో తన స్వగ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తన కుమారులు శ్రీధర్, చక్రధర్‌లతో కలిసి ఆసరా ముందు ఒక ప్రతిపాదనను ఉంచారు. పెద్ద కార్యక్రమం చేపడితే కోటి రూపాయలు విరాళం ఇస్తామని ముందుకు వచ్చారు. దీంతో వృద్ధాశ్రమం నిర్మాణానికి ఆలోచన రూపుదిద్దుకుంది.



భోజనశాలలో భోజనం చేస్తున్న వృద్ధులు

మారెళ్లగుంట పాలెంలోనే ఎందుకు

మారెళ్లగుంట పాలెం ఒకప్పుడు కమ్యూనిస్టు కార్యక్రమాలకు పుట్టినిల్లుగా భాసిల్లింది. 1967లోనే అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటిసారి విద్యార్థుల రాజకీయ పాఠశాల జరిగిన గ్రామం అది. ఈ భారీ కార్యక్రమం నల్లూరి అంజయ్య నేతృత్వంలో నిర్వహించారు. నల్లూరి అంజయ్య ఆప్రాంతంలో సుప్రసిద్ధ కమ్యూనిస్టు నాయకుడు. నీతినిజాయితీలకు మారుపేరు. వారి వారసత్వం ఆ గ్రామంలో ఉంది. అటువంటి చోట వృద్ధాశ్రమం పెట్టటం సబబుగా భావించిన నిర్వాహకులు అక్కడే అంజయ్య కుటుంబీకుల నుండి మూడు ఎకరాల భూమిని నామినల్ ధరలకు కొనుగోలు చేసి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2016 ఏప్రిల్ 27న ఆసరా వృద్ధాశ్రమానికి అన్న నల్లూరి వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. 2018 ఏప్రిల్ 12న ఆయన చేతుల మీదుగానే దీనిని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లాపరిషత్ ఛైర్మన్ ఈదర హరిబాబు, పార్లమెంట్ సభ్యులు శ్రీరాం మాల్యాద్రి, ఎమ్మెల్సీ కరణం బలరామకృష్ణమూర్తి, ఒంగోలు ఎమ్మెల్యే, టీడిపి జిల్లా అధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు, కందుకూరు, కొండపి ఎమ్మెల్యేలు పోతుల రామారావు, డాక్టర్ బాల వీరాంజనేయులు, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.



పెంచిన కూరగాయల తోట

-గంగినేని నాగేశ్వరరావు
ఒంగోలు, ప్రకాశం జిల్లా

35రూములలో వసతి

ఇక్కడికి వచ్చే వృద్ధులకు గదికి ఇద్దరు చొప్పున 35 గదులతో వసతి కల్పిస్తున్నారు. ప్రతి గదిలో టీవిలు ఉన్నాయి. వ్యాయామం చేసుకునేందుకు జిమ్‌కు సంబంధించిన ఫిట్‌నెస్ పరికరాలు ఉన్నాయి. వీటితో పాటు అందరూ కలిసి కాలక్షేపం చేయడానికి వీలుగా పెద్దటీవి కలిగిన హాలు ఉంది. గాలి వెలుతురు సమృద్ధిగా ఉండేలా గదుల నిర్మాణం జరిగింది. గ్రామీణ వాతావరణంలో చక్కని ఆక్సిజన్ లభించేలా,ప్రకృతి అందాల నడుమ ఈ వృద్ధాశ్రమం ఉంది. ఈ ఆసరాకు ఒంగోలులోని నల్లూరి నర్సింగ్ హోం వైద్యుల పర్యవేక్షణలో వైద్యం అందుబాటులో ఉంది. స్టార్ హోటల్‌ను తలపించేలా భోజన శాల, ఇంటి భోజనాన్ని మరిపించే భోజన వసతి, మంచి వంట మాస్టర్లతో ఈ వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా ప్రశాంతంగా పగటివేళ సేద తీరేందుకు ప్రత్యేకంగా లాన్‌లను ఏర్పాటు చేశారు.

మేకప్ నిలవాలంటే...
ఐస్ ఫేషియల్



పార్లర్‌లోకి ఫేషియల్ కోసం వెళ్ళినప్పుడు ఆక్సిజన్, డైమండ్, ఫ్రూట్ వంటి పేర్లు చాలానే వినుంటారు. వీటన్నింటిని మించి ప్రాచుర్యం పొందింది ఈ ఐస్ ఫేషియల్. మనిషి శరీరానికి కనీసం ఎనిమిది గంటల విశ్రాంతి అవసం. విశ్రాంతి తక్కువైతే ఆ ప్రభావం కనిపించేది మొదట ముఖంలోనే. ఈ సమయంలో ఐస్‌ను ఉపయోగిస్తే మీ చర్మం నిగారింపును సంతరించుకుంటుంది.

ఐస్‌తో ఫేషియల్ చాలా చవకైనది. ఐస్ కేవలం నీటితో తయారువుతుంది కదా! దీనితో ఏమంత అద్భుతాలు జరగవని తేలికగా తీసుకోకండి. థ్రెడ్డింగ్, వాక్సింగ్ ద్వారా హెయిర్ రిమూవల్ చేసిన తర్వాత సైడ్ ఎఫెక్ట్ రాకుండా ఉండడం కోసం ఐస్‌ను ఉపయోగించమని చాలా మంది సలహా ఇస్తారు. ఇది మాత్రమే కాక ఐస్ ముఖంపై ఉన్న ట్యాన్‌ను తొలగిస్తుంది, మెటిమలను రాకుండా నివారిస్తుంది.

ఐస్ ఫేషియల్‌ను ఈ విధంగా ప్రయత్నించండి.

ఖాళీ ఐస్ ట్రే, కొన్ని టూత్ పిక్స్, ఒక టేబుల్ స్పూన్ కలబంద రసం, విటమిన్-ఇ క్యాప్స్యూల్ కొంచెం నీటిని తీసుకోండి.

ముందుగా నీటితో కలబంద రసాన్ని మిక్స్ చేయండి. దీనిలో విటమిన్-ఇ క్యాపిసిల్‌ను వేయండి. తర్వాత ఈ నీటిని ఐస్ ట్రేలో వేయండి. వీటితో పాటు టూత్ పిక్స్‌ను వేసి ఫ్రీజర్‌లో పెట్టండి. గడ్డకట్టిన తర్వాత తీసి మీకు నచ్చిన విధంగా ముఖంపై రుద్దండి. ఈ ఫేషియల్ ఏ చర్మం వారికైనా సరిపోతుంది.

లాభాలు

- నిద్ర లేమి సమస్య వల్ల ముఖం ఉబ్బుగా కన్పిస్తుంది. ఈ సమయంలో ఐస్ ఫేషియల్‌ను ఉపయోగిస్తే మెరుగైన ఫలితాలు లభిస్తాయి. ప్రత్యేకించి కళ్ళ కింద భాగంలో దీన్ని ఉపయోగిస్తే మంచిది.
- ఎండ వల్ల ఎర్రబడిన చర్మం దురదలు రావడం సహజం. ఆ సమయంలో ఐస్‌ను ఉపయోగించడం వల్ల చర్మం యథావిధిగా ఉంటుంది. ఎరుపుదనం తగ్గుతుంది.
- మీరు ఏదైనా ఫంక్షన్‌కు వెళ్ళానుకున్నప్పుడు కొంచెసేపటి ముందు ఐస్ ఫేషియల్‌ను ఉపయోగిస్తే మీ ముఖం తాజా ఉంటుంది. అంతేకాక మేకప్ ఎక్కువ సేపు ఉంటుంది.
- ముడతలను రాకుండా నివారిస్తుంది. ఐస్ ఫేషియల్ చర్మాన్ని బిగుతుగా ఉంచుతుంది. అంతేకాక యవ్వనవంతమైన లుక్ ఉంటుంది.
- ఐస్ ఫేషియల్ చర్మంపై జిడ్డును తగ్గిస్తుంది. వేప, తులసి రసంతో తయారు చేసిన ఐస్ క్యూబ్‌లను ఉపయోగిస్తే చర్మంపై బ్యాక్టీరియా నశిస్తుంది. వీటితో పాటు వాపులను తగ్గిస్తుంది.



టీ ఆరోగ్యమా...అనారోగ్యమా!



టీ ఆరోగ్యం అని కొందరంటారు. కాదు అనారోగ్యం అని కొందరంటారు. మరి ఈ రెండింటిలో ఏది నిజం. రెండూ నిజమే. మితంగా, పరిమితంగా తీసుకుంటే ఆరోగ్యం. అతిగా తీసుకుంటే అనారోగ్యం. అవును...అన్నింటికీ వర్తించే ఈ సూత్రమే టీకి వర్తిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మంచినీళ్ళ తర్వాత అత్యధికంగా మానవుడు తీసుకునే పానీయం టీనే. ఆ తర్వాత కాఫీ, ఆపై ఇతర పండ్ల రసాలు, కొబ్బరినీళ్ళు, శీతల పానీయాలూ ఉన్నాయి. తేయాకు చెట్ల ఆకుల్ని ఒక క్రమబద్ధీకరణ పద్ధతిలో వేడి చేసినప్పుడు అవి పెళుసుగా మారతాయి. వాటిని దంచితే వచ్చేదే టీ పొడి. ఆకుల కాలం, ఏ ఉష్ణోగ్రతలో వేడి చేశారు, ఏ ప్రాంతంలో పెరిగే తేయాకు తోటల నుంచి ఈ టీ పొడి తయారు చేశారు అన్నదానిని బట్టి దాని రంగు, రుచిలో తేడా ఉంటుంది. కాఫీలో మాదిరిగానే టీలోనూ ఉండే ప్రధానమైన పదార్థం కెఫీనే. ఇది ఒక ఆల్కలాయిడ్. టీని పరిమిత మోతాదులో తీసుకుంటే హృదయ సంబంధ వ్యాధుల నివారణకు సహకరిస్తుందని పరిశోధనలు రుజువు చేశాయి. కానీ ఎక్కువగా వాడితే ఆరోగ్యానికి మంచిది కాదు. తేయాకు ఉత్పత్తిలో చైనా ప్రథమ స్థానంలో ఉండగా, తర్వాత స్థానంలో మన భారత్ ఉంది. ఈ రెండు దేశాల ఉత్పత్తి ప్రపంచపు ఉత్పత్తిలో సగం కన్నా ఎక్కువేననే విషయం తెలుసా మీకు!

హాట్ కలెక్షన్!

తెల్లని ఆకాశంలో నిండుగా నవ్వే చంద్రుడు, చుట్టూ నక్షత్రాలు, వాటినే చూస్తున్నట్టుగా...నేల మీద రెండు పచ్చని చెట్లు, ఆ పక్కనే ఓ పూరి గుడిసె లేదా చిన్న పెంకుటిల్లు, దానికి కిటికీలు...అబ్బ ఆ దృశ్యం చూడడానికి భలే బాగుంటుంది కదా! అదుగో...ఆ...డిజైనే ఇప్పుడు లేటెస్ట్ ట్రెండ్. తాగే కప్పులు, తినే ప్లేట్‌లు, ఫ్లవర్‌వాజ్‌లు, ఎపెన్నుల స్టాండ్‌లు, ఆఖరికి హ్యాండ్‌వాష్ డబ్బాల మీద కూడా ఈ డిజైనే. మార్కెట్ అంతా ఈ డిజైన్లతోనే కనిపిస్తోంది. మరి మీరూ తెచ్చుకోండిక!




నేను - సుడిగుండం (నవల) 24

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

పత్రికల వారు వచ్చి ప్రకటనలు ఇవ్వమనే వారు. మాకు ఇంకా బడ్జెట్ లేదు. అలాంటిది వచ్చినప్పుడు మేమే మీ దగ్గరకు వస్తాం అని చెప్పేవాడిని.

ఇలా రకరకాల పరిచయాలు.. ముందు మరింతమంది పిల్లల్ని మా దగ్గర చేరేలా చూడాలి. యూనివర్సిటీ సమయంలో నేను రచయితలని పిలిచాను. అలాగే కొంతమంది కళాకారుల్ని కూడా. అందులో రకరకాల వారున్నారు.

మా పిల్లల తల్లిదండ్రులు వారిలో కొంత మందిని ఇష్టపడతారు. పిల్లలు కూడా పెరుగుతున్నారు. మా దగ్గరకు వచ్చిన రచయితలు తమ పుస్తకాలు యిచ్చేవారు. తర్వాత అభిప్రాయం అడిగేవారు. అలా సాగుతోంది ప్రయాణం!

నేను ఈ ఒత్తిడిలో వున్నాను. అప్పుడు అనిపించింది.

మా పెళ్లి జరిగినప్పుడు నాలుగు జతల మంచి బట్టలు కూడా నేను కుట్టించుకోలేదు. మావయ్య మాటలు ప్రభావం నా మీద వుంది. వెన్నెలకీ అంతే. అమిత ఓ చీర యిచ్చింది. రెండు మూడు చీరలు తక్కువలో అమ్మ తీసుకుంది. ఇప్పుడవి పాత బడ్డాయి. నేను స్కూల్లో వుంటాను కాబట్టి నాకిష్టం వున్నా లేకపోయినా మంచి బట్టలు తీసుకోవాలి. బండి అవసరం వుంది.

ముందు తనకు బట్టలు తీసుకోవాలి. ఓ రాత్రి తన మనసులో ఏముందో తెలుసుకోవాలని అడిగాను.

"మన ఇద్దరం విడిగా పడుకుంటున్నాం కదా... నీకు యిబ్బందిగా వుందా?"

"నాకు ఎందుకు ఇబ్బంది" అంది.

"అలా కాదు. నీ మనసులో వుంది చెప్పేయ్" అన్నాను.

"నువ్వు ముందే చెప్పావు కదా" అంది.

"మీ అత్త తొందర పడుతోంది కదా!"

మాట్లాడలేదు.

"మాట్లాడు"

"బావా... నాకు నువ్వు ఏం చెబితే అది చేయాలని వుంటుంది. పెద్దవాళ్లు ఏదో చెబుతారు. అవి వింటాం. నువ్వు ఏం చేసినా బాగా ఆలోచిస్తావు. ఆ నమ్మకం నాకుంది?

ఆ మాట వినగానే నాకు హాయిగా అనిపించింది "సాయంకాలం మనం బయటకు వెళ్తున్నాం"

"వంట" అంది.

"బయట హోటల్లో భోం చేస్తాం. నీకు చీరలు తీసుకుందాం"

"నాకున్నాయి కదా"

"ఎన్ని వున్నాయో నాకు తెలుసు"

"సాయంకాలమయితే రంగులు కనిపించవు. చీరల కోసం అయితే నేను రావటం ఎందుకు? నువ్వే తీసుకురా బావా?"

"నీకు నచ్చాలి కదా?"

"నేను కట్టుకుంటే చూసేది నువ్వు కదా" అంది.

"నీ దగ్గర చమత్కారం వుంది" అన్నాను. చిన్న నవ్వు. తర్వాత షాపుకి తీసుకు వెళ్లాను. ముందు వెన్నెల చీరలు ధరను చూస్తోంది.

"ముందు ఏ చీరలు నచ్చుతాయో చూడు" అన్నాను. రెండు చీరలు చూపించి... "ఇందులో ఏం బాగుంటుంది" అంది.

ఆ రెండు చీరలు కాకుండా రోజూ కట్టుకోవటానికి ఇంకో రెండు తీసుకున్నాను. అప్పుడు మొహమాట పడుతోంది.

"ఏమైంది?"

"ఇన్ని ఎందుకు... పోనీ అర్చనకి..." అని ఆగింది.

"అర్చన విషయం నాకు గుర్తుంది. మనం ఇప్పుడే మన ఊరు వెళ్లటం లేదు. అప్పుడు తీసుకుందాం" అన్నాను.

బయట భోజనం చేసాక ఇంటికి వచ్చాం.

"నిన్ను నాకంటే ఎక్కువ చదివించాలనుకు న్నాను. గుర్తుంచుకో. ఆడవారు తాము భర్తల మీద ఆధారపడకూడదు. రేపు ఏమయినా జరగవచ్చు. ఎదుర్కొనే ధైర్యం వుండాలి"

"నాకు అర్థం కాలేదు బావా?"

"మా నాన్న చనిపోయాడు. మా అమ్మ చదువు కుని వుంటే ఇంకో రకంగా వుండేది. నువ్వు చదువుని సీరియస్‌గా తీసుకుంటే బాగుంటుందని చెబుతున్నాను"

తన కళ్లల్లో నీళ్లు చూసాక

"ప్రతిదానికీ ఏడవటం నాకు నచ్చదు. నాకు మించిన ప్రపంచం నీకు వుండాలని అంటున్నాను"

"నాకు అవసరం లేదు బావా" అంది.

****

ఇంటికి రాగానే ఉత్తరం యిచ్చింది.

అది అమిత నుండి వచ్చింది.

"చదవకపోయావా?"

"ఓసారి నువ్వు వద్దన్నావు. అలా చెప్పాక నేను అలాంటి పని చేయను" అంది.

"అవునూ... నీకు చీరలు కొన్నది ఎందుకు? దాచుకుంటానికా... నువ్వు కాస్త మారు సుచిత్రా" అని గదిలోకి వెళ్లాను. ఉత్తరం తీసాను.

రామూ అనే ప్రభాత్‌కి,

ఎలా వున్నారు? కొత్త సంసారం ఎలా వుంది. చిన్నప్పటి మీ బంధం వేరు. ఇప్పుడు వేరు. ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్నారనుకుంటున్నా.



ఇప్పుడు నాకు పెళ్లి ఘడియలు వచ్చాయి!

అమ్మా - నాన్నలు చూసిన సంబంధమే. అతను మల్టీనేషనల్ కంపెనీలో ఎగ్జిక్యుటివ్‌గా పని చేస్తు న్నాడు. ముందు ముందు ఎబ్రాడ్ వెళ్లే అవకాశాలున్నాయి.

నాన్నతో నేను అతన్తో మాట్లాడాలన్నాను. ఒప్పుకున్నారు. ఓ అరగంట మాట్లాడితే ఎవరూ ఎవరికి అర్థం కాదు. అది మనకు తెలుసు. ప్రస్తుతం ఢిల్లీలో పనీ చేస్తున్నాడు.

నేను నా ఫీలింగ్స్ చెప్పాను. సావధానంగా విన్నాడు. భవిష్యత్ గురించి తన ఆలోచనలు చెప్పాడు.

"మీరు సైకాలజీనే ఎందుకు తీసుకున్నారు?" అని మాత్రం అడిగాడు.

"అందుకు పునాది ఎప్పుడు పడిందో నాకు తెలియదు. నాకు మనుషుల్లో వున్న ధోరణుల్ని పరిశీలించటం ఇష్టం" అన్నాను.

తను అభ్యంతరం చెప్పలేదు. నా పేరు బాగా నచ్చిందంట! కాస్త భావుకత్వం వుందనిపించింది. అతను తెలుగు పుస్తకాలు చదవడు. సంప్రదాయాలంటే ఇష్టం. రోజువారీ జీవితంలో ప్రజలు చేయకపోయినా డివైన్ పవర్ మీద నమ్మకం వుందన్నాడు.

ఇలా ఏవేవో మాట్లాడుకున్నాం.

అతని పేరు వెంకటేశ్వరరావు. అది నచ్చక పోయినా మార్చుకోను అన్నాడు. అప్పుడు నువ్వు గుర్తొచ్చావు. 'మిస్టర్ రావ్' అని పిలుస్తారనుకో.

ఇంతకీ నాకు నచ్చాడా అని అడుగుతావు. నాకు కావల్సిన వ్యక్తిని నిర్ణయించుకోలేకపోయాను. అందుకు కారణం నేనే.

తీవ్రంగా అభ్యంతరం చెప్పాల్సినవి కనిపించ లేదు. పెళ్లి నిర్ణయం అయింది. డేట్ నేను చెబుతాను. ఢిల్లీ వెళ్లాలి పెళ్లి అయ్యాక..

వెన్నెలకి - మీ అమ్మగారికి నా శుభా కాంక్షలు చెప్పు.

ఉత్తరం పూర్తయ్యాక నేను అమితని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాను. వెన్నెలని పిలిచాను.

"అమితకు పెళ్లి" అన్నాను.

వెన్నెల ముఖంలో వెలుగు కనిపించింది.

"ఎప్పుడు?" అంది.

"తొందర్లో"

ఈ విషయం తెలిస్తే అమ్మకి సంతోషం కలుగుతుంది అనుకున్నాను.

****

వెన్నెల స్నానం చేసి కొత్త చీర కట్టుకుంది. రకరకాల ఆలోచనల్లో వున్న నేను వెన్నెలని చూడగానే చూపులు తిప్పుకోలేక పోయాను. ఇప్పటివరకు పక్క పక్కనే వున్నా, ఒకటి రెండు సందర్భాల్లో తప్ప చిన్నప్పటి వెన్నెల్లానే వుంది.

"ఇంత అందంగా వుందా!" అనుకున్నాను.

మన పక్కనే వున్న అందాలు కనిపించవు. అలాగే పక్కన వున్నవారి సమస్యలు కూడా!

వెన్నెల మల్లెపూలు కూడా పెట్టుకుంది. ఆ వాసన నాకు గమ్మత్తుగా వుంది.

"చీర బాగుందా?" అంది.

అప్పుడే నేను వెన్నెల చేతిని పట్టుకున్నాను. ఇంతకుముందు నాకెప్పుడూ ఇలాంటి భావన కలగలేదు.

మంచం మీద కూర్చోపెట్టాను.

తన కళ్లల్లోకి చూస్తున్నాను.

"బావా నాకు భయంగా వుంది" అంది.

"ఎందుకు?"

"నువ్వు నన్ను కొత్తగా చూస్తున్నావు" అంది.

"అవును. నువ్వు నా భార్యవని ఇప్పుడు గుర్తొచ్చింది"

"అది కాదు బావా..."

"ఏంటి నీ సమస్య"

"అత్త... ముందుగా..."

"ముహూర్తం కావాలా... అవన్నీ చూసుకుని కాపురం చేస్తే కుక్క పిల్లలు పుడతాయంటారు" అంటూ వెన్నెలని కౌగలించుకున్నాను.

"అత్తయ్య ఏమనుకుంటుందో..."

"ఏంటి అత్తయ్య అనుకునేది. మనం తప్పు చేయటం లేదు" అని బలంగా కౌగలించుకున్నాను. అప్పటికీ తను యిబ్బంది పడటం గమనించాను.

"నువ్వు మీ అత్తకు ఏమీ చెప్పకు. కావాలంటే ఇంకోసారి ముహూర్తం చూసి ఏర్పాట్లు చేసుకుందాం. సినిమాల్లో చూపించినట్లు" అంటూ చెంపల మీద ముద్దు పెట్టుకున్నాను.

కెమిస్ట్రీ ఎలా మొదలవుతుందో అనుభవంలోకి వచ్చింది. ఇంత మధురమైన అనుభూతి కోసమే స్త్రీ-పురుషులు తపిస్తారు అనుకున్నాను.

************* (ఇంకా ఉంది)

యువతకు మరో ఉపాధి రంగం.. ఓషనోగ్రఫీ

మానవాళికి సముద్రంతో విడదీయరాని సంబంధం ఉంది. అపారమైన చమురు, ఖనిజ, మత్స్యసంపదలకు నిలయమిది. అసంఖ్యాకమైన జీవులకు తన గర్భంలో చోటిస్తోంది. ఈ జలనిధిని శోధించి, దాని రహస్యాలను ఛేదించాలనే ఆసక్తి చాలామందికి ఉంటుంది. ఈ ఆసక్తినే ఆకర్షణీయమైన కెరీర్‌గా మలచుకోవచ్చు.

'సముద్రంలో ఫలానా జీవుల సంఖ్య పెరిగింది', 'సాగర తీరం పరిధి పెరిగింది' లాంటి విషయాలు వార్తల్లో చదువుతుంటాం. కడలిలో చమురు నిల్వల సంగతీ, వందల ఏళ్ల క్రితం మునిగిపోయిన నౌక కనుమరుగవటానికి సముద్ర జీవులు కారణమనీ వింటుంటాం. ఇలాంటి సమాచారమంతా అందించడంలో ప్రధాన పాత్ర- ఓషనోగ్రాఫర్లది.

సాగరం గురించిన వివిధ అంశాలను అధ్యయనం చేసేవారే ఓషనోగ్రాఫర్లు. ఈ అధ్యయనాన్ని ఓషనోగ్రఫీ అంటారు. సముద్రాలు, వాటి కోస్తారేఖ, నదీ ముఖాలు, తీరసంబంధ అంశాలు, ఓషన్‌బెడ్ మొదలైన వాటిని అధ్యయనం చేసే దీన్ని వివిధ శాఖల సమ్మిళితంగా చెప్పొచ్చు. బయాలజీ, కెమిస్ట్రీ, జియాలజీ, మెటియోరాలజీ, ఫిజిక్స్ వంటివన్నీ దీనిలో భాగం. వివిధ రకాల శాస్త్రీయ అంశాలతోపాటు నిరంతరం నేర్చుకునే అవకాశాన్ని కలిగిస్తుందీ శాస్త్రం. ఓషనాలజీ/ మెరైన్ సైన్స్ అనే పేర్లతోనూ దీన్ని పిలుస్తారు.

ఈ విభాగంలోని అంశాలు చదివి, నైపుణ్యం సాధించినవారిని ఓషనోగ్రాఫర్/ మెరైన్ బయాలజిస్టులుగా పిలుస్తారు. ఖనిజాల విశ్లేషణ, షిప్పింగ్, ఫిషరీస్, తీర సంబంధ అంశాల పరిశీలన, వాతావరణ అంచనా, వాతావరణ మార్పుల విశ్లేషణ వంటివి వీరు చేస్తారు. వీరికి సైన్స్‌కు సంబంధించిన ప్రాథమిక జ్ఞానం అవసరమవుతుంది. దీనికి సంబంధించిన కోర్సులను చదివితే సంబంధిత పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతోపాటు ఉద్యోగావకాశాలనూ దక్కించుకోవచ్చు.

కోర్సులివే..

సైన్స్ నేపథ్యం ఉన్నవారు ఈ కోర్సులను చేయడానికి అర్హులు. బయాలజీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీలతోపాటు కొన్ని కోర్సులకు మేథ్స్ నేపథ్యమూ అవసరమే.

డిగ్రీస్థాయిలో..

బీటెక్ ఇన్ నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషన్ ఇంజినీరింగ్ మాత్రమే అందుబాటులో ఉంది. అంతకుముందు బీఎస్సీ మెరైన్ సైన్స్ అందుబాటులో ఉండేది. డిగ్రీ స్థాయి నుంచే కోర్సు చేయాలనుకునేవారు బీటెక్‌ను ఎంచుకోవచ్చు. తమిళనాడుకు చెందిన అన్నామలై యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ కోర్సును అందిస్తోంది. దాన్నైనా ఎంచుకోవచ్చు. బీటెక్ చదవాలనుకునేవారు ఇంటర్‌లో ఫిజిక్స్, మేథమేటిక్స్, కెమిస్ట్రీలను సబ్జెక్టులుగా చదివుండాలి. జేఈఈ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

పీజీ స్థాయిలో..

ఎంఎస్సీ, ఎంటెక్, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

➡ ఎంఎస్సీ ఓషనోగ్రఫీ, ఎంఎస్సీ మెరైన్ బయాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కోర్సు కాలవ్యవధి- రెండేళ్లు. ఈ కోర్సుల్లోకి ప్రవేశం పొందాలంటే డిగ్రీ స్థాయిలో జువాలజీ/ బోటనీ/ కెమిస్ట్రీ/ ఫిషరీస్ సైన్స్/ ఎర్త్ సైన్స్/ ఫిజిక్స్/ అగ్రికల్చర్/ మైక్రోబయాలజీ/ అప్లయిడ్ సైన్సెస్ లేదా తత్సమాన విభాగాల్లో కోర్సులు పూర్తిచేసుండాలి. సంబంధిత ప్రవేశపరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

➡ ఎంటెక్ ఇన్ నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషన్ ఇంజినీరింగ్, ఎంటెక్ ఇన్ ఓషన్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కోర్సు కాలవ్యవధి- రెండేళ్లు. డిగ్రీ స్థాయిలో ఇంజినీరింగ్ చదివినవారు అర్హులు. గేట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

➡ కెమికల్ ఓషనోగ్రఫీలో ఎంఫిల్ అందుబాటులో ఉంది. కోర్సు కాలవ్యవధి- ఒకటి లేదా రెండేళ్లు. పీజీ స్థాయిలో సంబంధిత సబ్జెక్టులు చదివినవారు అర్హులు. మెరిట్ ఆధారంగా కానీ, ప్రవేశపరీక్షను నిర్వహించి కానీ ప్రవేశాలు కల్పిస్తారు.

➡ సైన్స్ విభాగంలో పీజీ చేసినవారు పీహెచ్‌డీకి అర్హులు. నెట్/ గేట్ ద్వారా అర్హత సాధించొచ్చు.

మనదేశంలో ఓషనోగ్రఫీకి సంబంధించి చాలావరకూ సంస్థలు/ విశ్వవిద్యాలయాలు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తున్నాయి. చాలా కొన్ని సంస్థలు మాత్రమే ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులను అందిస్తున్నాయి. కోర్సుల్లో భాగంగా థియరిటికల్ పరిజ్ఞానంతోపాటు ప్రాక్టికల్ జ్ఞానాన్నీ అందిపుచ్చుకుంటారు. శాంపిల్స్‌ను సేకరించడం, సర్వేలు నిర్వహించడం, తగిన పరికరాల సాయంతో గంటలకొద్దీ సముద్రంలో డేటాను విశ్లేషించడం వంటివి ప్రాక్టికల్ తరగతుల్లో భాగంగా ఉంటాయి.

కోర్సులు అందిస్తున్న ప్రముఖ సంస్థలు

➡ సీఎస్ఐఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, గోవా
➡ ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం
➡ అన్నా యూనివర్సిటీ, చెన్నై
➡ అన్నామలై యూనివర్సిటీ, తమిళనాడు
➡ ఐఐటీ- ఢిల్లీ, ఖరగ్‌పూర్, మద్రాస్
➡ కర్నాటక యూనివర్సిటీ
➡ కేరళ అగ్రికల్చర్ యూనివర్సిటీ
➡ మంగళూరు యూనివర్సిటీ, కర్నాటక
➡ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మరద్వాడా యూనివర్సిటీ, మహారాష్ట్ర
➡ బెర్హంపూర్ యూనివర్సిటీ, ఒడిశా
➡ కలకత్తా యూనివర్సిటీ
➡ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్, ముంబయి
➡ కొచ్చి యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ
➡ గోవా యూనివర్సిటీ
➡ ఉత్కల్ యూనివర్సిటీ, భువనేశ్వర్ మొదలైనవి.

ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్లు జూన్, జులైల్లో విడుదలవుతాయి.

ఉద్యోగావకాశాలు

ఓషనోగ్రఫీకి సంబంధించి మనదేశంలోనూ, విదేశాల్లోనూ మంచి ఉద్యోగావకాశాలున్నాయి. ప్రభుత్వ, సంబంధిత సంస్థలతోపాటు ప్రైవేటు సంస్థల్లోనూ వీరిని ఎంచుకుంటున్నారు. 2020 నాటికి ప్రపంచవ్యాప్తంగా పరిశోధన రంగంలో ఉద్యోగావకాశాలు 16% పెరుగుతాయని అంచనా. మిగతా రంగాలతో పోలిస్తే దీనిలోనే ఎక్కువ అభివృద్ధి కనిపిస్తోంది. దీనిలోనూ ఓషనోగ్రఫీదే ప్రధాన పాత్ర. కాబట్టి, బలమైన సైంటిఫిక్ నేపథ్యంతోపాటు వాతావరణ అంశాలపై అవగాహన, మంచి కంప్యూటర్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే మంచి ఉద్యోగావకాశాలను చేజిక్కించుకోవచ్చు.

➡ మెరైన్ పాలసీ ఎక్స్‌పర్ట్స్
➡ మెరైన్ అండ్ ఓషన్ ఇంజినీర్స్
➡ మెరైన్ ఆర్కియాలజిస్ట్
➡ మెరైన్ బయాలజిస్ట్
➡ ఫిజికల్ ఓషనోగ్రాఫర్స్
➡ మెరైన్ ఎన్విరాన్‌మెంటలిస్ట్స్
➡ జియోలాజికల్ ఓషనోగ్రాఫర్స్ అండ్ జియోఫిజిసిస్ట్స్
➡ ఫిజికల్ ఓషనోగ్రాఫర్స్
➡ కెమికల్ ఓషనోగ్రాఫర్స్ అండ్ మెరైన్ జియోకెమిస్ట్స్
➡ బయాలాజికల్ ఓషనోగ్రాఫర్స్, మెరైన్ బయాలజిస్ట్స్ అండ్ ఫిషరీస్ సైంటిస్ట్స్
➡ మెరైన్ అండ్ ఓషన్ ఇంజినీర్
➡ హైడ్రోగ్రాఫర్
➡ మెరైన్ టెక్నీషియన్ మొదలైన విధుల్లోకి వీరిని ఎంచుకుంటున్నారు.

ఉద్యోగాల్లోకి తీసుకుంటున్న సంస్థలు : ఇండస్ట్రియల్ రిసెర్చ్ లేబొరేటరీలు, ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీలు, విద్యాసంస్థలు, నేవీ, వివిధ ఆయిల్, చమురు సంస్థలు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, మెటియోరాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఓషనోగ్రఫీ డిపార్ట్‌మెంట్లు, మెరైన్ వర్క్‌షాప్‌లు, కన్సల్టెన్సీలు, సేఫ్టీ ఆర్గనైజేషన్లు వీరిని ఎక్కువగా ఎంచుకుంటున్నాయి. వివిధ మెరైన్ పరిశ్రమలు కూడా వీరికి ఉద్యోగావకాశాలిస్తున్నాయి. ఆసక్తి ఉన్నవారు



సంబంధిత విభాగంలో బోధనకూ ప్రాధాన్యమివ్వవచ్చు.

జీతభత్యాలు : మనదేశంలో ప్రారంభ వేతనం నెలకు రూ.20,000 నుంచి రూ.30,000 వరకూ పొందే వీలుంది. ఎంచుకున్న స్పెషలైజేషన్, అనుభవం ఆధారంగా జీతంలో పెరుగుదల ఉంటుంది. విదేశాల్లో 50,000 డాలర్ల నుంచి 80,000 డాలర్ల వరకూ పొందొచ్చు. అయితే విదేశాల్లో ఉద్యోగావకాశాలు పొందాలంటే డాక్టరేట్ పొందివుండటం తప్పనిసరి.

నాలుగు స్పెషలైజేషన్లు

సైన్స్ విభాగంలో వివిధ స్పెషలైజేషన్లు ఉన్నట్లే ఓషనోగ్రఫీలోనూ ప్రధానంగా నాలుగు ఉన్నాయి.

1. బయలాజికల్ ఓషనోగ్రఫీ : సముద్రంలో జీవించే మొక్కలు, జంతువులు, ఇతర జీవరాశుల గురించి అధ్యయనం చేస్తారు. జీవుల ప్రవర్తన, ఆహార అలవాట్లు, ఇతర జీవులతో సంబంధ బాంధవ్యాలు, సంతానోత్పత్తి, సముద్రంలోని పెద్ద జీవులపై జీవరాశులు చూపే ప్రభావం వంటివన్నీ దీనిలో భాగంగా ఉంటాయి. వాతావరణ, ఉష్ణోగ్రతల్లో మార్పులు, కాలుష్యం జీవులపై ఎలాంటి ప్రభావం చూపుతోందో పరిశీలిస్తారు. నిపుణులు పనిలో భాగంగా ఫీల్డ్ అబ్జర్వేషన్లు, కంప్యూటర్ మోడళ్లు, లేబొరేటరీలో ప్రయోగాలు వంటివి కూడా చేస్తుంటారు.

2. కెమికల్ ఓషనోగ్రఫీ : సముద్రపు నీటితో మిశ్రమమై ఉన్న రసాయనాల గురించి అధ్యయనం చేస్తారు. వాతావరణ పరంగా మార్పులు సంభవించినపుడు అది సముద్రపు నీటిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అంచనా వేస్తారు. ఈ ప్రభావం సముద్రంలో జీవించే జీవరాశిపై ఏ విధమైన ప్రభావం చూపుతోందో పరిశీలిస్తారు. కెమిస్ట్రీని ఉపయోగించి, సముద్ర అలల కరెంటు భూమి చుట్టూ నీటిని ఎటువైపు మళ్లిస్తున్నాయో, దీని కారణంగా ఎక్కడ ఎలాంటి వాతావరణం ఏర్పడుతుందో అంచనావేస్తారు. అలాగే సముద్ర గర్భంలో దొరికే సహజ వస్తువులను ఔషధ రంగంలో ఎంతవరకూ ఉపయోగించవచ్చో పరిశోధనలు చేస్తారు.

3. జియోలాజికల్ ఓషనోగ్రఫీ : సముద్ర భూభాగం, దాని నిర్మాణాల గురించి చదువుతారు. సముద్రంలో పర్వతాలు, లోయలు వంటి వాటిల్లో మార్పులకు గల కారణాలపై పరిశోధనలు జరుపుతారు. గత సర్వేల సాయంతో ఏ మేరకు మార్పు సంభవమైందో గుర్తిస్తారు. సముద్రంలో ఏర్పడే అల్పపీడనాలు, తుపానులకు గల కారణాలు, ఏర్పడే అవకాశాలను అంచనావేస్తారు.

4. ఫిజికల్ ఓషనోగ్రఫీ : దీనిలో సముద్ర అలలు, తరంగాలు, కరెంట్, సుడిగుండాలు, అవి ఏర్పడటానికి గల కారణాలు మొదలైనవాటిని అధ్యయనం చేస్తారు. తీరప్రాంతాలు జరగడం, వాతావరణానికి, సముద్రానికి మధ్య జరిగే చర్య, ప్రతిచర్యలు వంటి వాటిని గమనిస్తుంటారు. వీటి కారణంగా వాతావరణం, శీతోష్ణస్థితిపై పడే ప్రభావం, నీటి ద్వారా కాంతి, శబ్దాల ప్రయాణం వంటివాటిపై పరిశోధనలు జరుపుతారు.

ఈ విభాగాలన్నీ ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉంటాయి. ఈ సబ్జెక్టులన్నింటిపై అవగాహన తప్పనిసరి.

జనవరి 28 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

టెర్రిటోరియల్ ఆర్మీలో..
సోల్జర్(జనరల్ డ్యూటీ),
సోల్జర్(క్లర్క్), సోల్జర్ (ట్రేడ్స్‌మెన్)
వంటి వివిధ ఉద్యోగాల భర్తీకి
రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరగనుంది.

జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ.. హైదరాబాద్‌లోని మౌలాలీలో ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటన విడుదల చేశారు.



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, రాజస్థాన్, తమిళనాడు, గుజరాత్, గోవా, పాండిచ్చేరి, దాదర్ నగర్ హవేలీ, డామన్, డయ్యూ, లక్షదీవుల అభ్యర్థులు ఈ ర్యాలీలో పాల్గొనేందుకు అర్హులు.

18-42 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు అర్హులు. సోల్జర్(జనరల్ డ్యూటీ), సోల్జర్ ట్రేడ్స్‌మెన్(మెస్ కీపర్ పోస్టులకు 8వ తరగతి) పోస్టులకు పదోతరగతి పాసై ఉండాలి. సోల్జర్(క్లర్క్)కు 10+2 ఉత్తీర్ణత తప్పనిసరి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన అభ్యర్థులకు జనవరి 28న ఉదయం 5గంటల నుంచే ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. రిపోర్ట్ చేయాల్సిన చిరునామా 1105, రైల్వే ఇంజనీర్ (టెర్రిటోరియల్ ఆర్మీ), మౌలాలీ, హైదరాబాద్.

ఇండియన్ కోస్ట్ గార్డ్‌లో నావిక్ పోస్టులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కోస్ట్‌గార్డు 10+2 ఎంట్రీ-02/2019 బ్యాచ్ ద్వారా నావిక్ (జనరల్ డ్యూటీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత : కనీసం 50% మార్కులతో మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో 10+2 ఉత్తీర్ణత. నిర్దేశిత శారీరక, వైద్య ప్రమాణాలుండాలి.
వయసు : 18-22 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక : రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.
దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 31, 2019.
వెబ్‌సైట్ : www.joinindiancoastguard.gov.in

విశాలాంధ్ర ప్రజ్ఞ

యువ గ్రహశకలాల కూటమి గుర్తింపు

సైన్స్ టెక్నాలజీ తాజా సమాచారం

అత్యంత పిన్న వయస్సున్న నాలుగు గ్రహశకల కూటములను బ్రెజిల్ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇవి అంగారకుడు, బృహస్పతి మధ్య తిరుగుతున్నట్లు చెప్పారు. వీటి వయస్సు ఏడు కోట్ల ఏళ్ల కన్నా తక్కువ ఉంటుందని చెప్పారు. ఏదైనా గ్రహం లేదా భారీ గ్రహశకలం ధ్వంసమైనప్పుడు వెలువడే ఆస్టరాయిడ్లు ప్రారంభదశలో ఒకే కూటమిగా ఉంటాయి. ఆ సమయంలో అవి సూర్యుడికి అత్యంత చేరువగా వచ్చే స్థానం (పెరిసెంటర్), అవి ఉత్తర భాగం నుంచి దక్షిణ భాగం వైపు మళ్లే స్థానం (అసెండింగ్‌నోడ్) సమానంగా ఉంటుంది. బ్రెజిల్‌లోని సావోపోలో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు గుర్తించిన నాలుగు ఆస్టరాయిడ్ కూటముల పెరిసెంటర్, అసెండింగ్‌నోడ్ సమానంగా ఉన్నది. కాబట్టి వీటి వయస్సు ఏడు కోట్ల సంవత్సరాలకు తక్కువే ఉండవచ్చని భావిస్తున్నారు. ఇప్పటివరకు తాము 55 గ్రహశకల కూటములను గుర్తించామని వారు పేర్కొన్నారు.

మనకు చేరువలో మరో భూమి

మనకు కేవలం 17 కాంతి సంవత్సరాల దూరంలోనే భూమి వంటి మరో గ్రహం (సూపర్ ఎర్త్) ఉన్నట్లు అమెరికా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది హెచ్‌డీ-26965 అనే నక్షత్రం చుట్టూ తిరుగుతున్నది. ఈ గ్రహాన్ని '40-ఎరిదనిఏ' అని పిలుస్తున్నారు. ఫ్లోరిడా యూనివర్సిటీ, టెన్నెస్సీ స్టేట్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక బృందం అరిజోనాలోని మౌంట్ లెమ్మన్‌పై బిగించిన ధర్మా ఎండోమెంట్ ఫౌండేషన్ టెలిస్కోప్ (డీఈఎఫ్‌టీ) సాయంతో ఈ గ్రహాన్ని గుర్తించారు. ధర్మా టెలిస్కోప్‌తో గుర్తించిన మొదటి గ్రహం ఇదే కావడం విశేషం.

ముగిసిన కెప్లర్ టెలిస్కోప్ శకం



దాదాపు దశాబ్దం పాటు సౌర కుటుంబం వెలుపల, ఇతర నక్షత్రాల చుట్టూ తిరుగుతున్న గ్రహాల (ఎక్సోప్లానెట్)ను పసిగట్టిన కెప్లర్ అంతరిక్ష టెలిస్కోపు శకం ముగిసిపోయింది. విశ్వంలో మరిన్ని పరిశీలనలు సాగించేందుకు అవసరమైన ఇంధనం ఇందులో లేకపోవడంతో దీని సేవలకు స్వస్తి పలకాలని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ - నాసా నిర్ణయించింది. కెప్లర్ తన ప్రస్థానంలో 2600కు పైగా ఎక్సోప్లానెట్లను గుర్తించింది. అందులో జీవులకు ఆవాసయోగ్యమైనవి కూడా ఉన్నాయి. ఈ టెలిస్కోపు తమ అంచనాలకు మించి పనిచేసిందని నాసా తెలిపింది. సౌర కుటుంబంలో, వెలుపల జీవుల అన్వేషణకు ఇది బాటలు పరిచిందని వివరించింది. రాత్రిపూట మనకు కనిపించే నక్షత్రాల్లో 20 నుంచి 50 శాతం మేర తారల చుట్టూ సమశీతోష్ణ ప్రాంతంలో భూమి పరిమాణంలోని గ్రహాలు ఉన్నాయని వెల్లడించింది. వాటిపై ద్రవ రూపంలో నీటికి ఆస్కారం ఉంటుందని పేర్కొంది. కెప్లర్ టెలిస్కోపును 2009 మార్చి 6న నాసా ప్రయోగించింది. సిగ్నస్ తారామండలంలోని 1.5 లక్షల నక్షత్రాలను నిరంతరంగా పరిశీలించి, వాటిచుట్టూ తిరుగుతున్న గ్రహాలను పసిగట్టడం దీని ఉద్దేశం. నాలుగేళ్లపాటు సక్రమంగానే అది పనిచేసింది. ఆ తరువాత సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో కొంతకాలం దీని పరిశోధనలకు బ్రేక్ పడింది. అయితే ఈ వ్యోమనౌక పరిశీలన ప్రదేశాన్ని మూడునెలలకోసారి మార్చడం ద్వారా దాన్ని కొనసాగించే ప్రక్రియను నాసా రూపొందించింది. 'కె2' పేరుతో సాగిన దీని రెండో ప్రస్థానంలో 5 లక్షలకు పైగా తారలను పరిశీలించింది.

అద్భుత సూపర్‌సోనిక్ పారాచూట్ ఆవిష్కరణ

అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ - నాసా మరో అద్భుతాన్ని సాధించింది. ఆ సంస్థ ఆవిష్కరించిన సూపర్‌సోనిక్ పారాచూట్.. కేవలం 0.4 సెకన్ల వ్యవధిలో విచ్చుకొని, 37 వేల కిలోల బరువును విజయవంతంగా మోయడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించింది. సూపర్‌సోనిక్ పారాచూట్ 37 వేల కిలోల బరువును మోయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. నైలాన్, టెక్నోరా, కెవ్లార్ ఫైబర్‌లతో తాజా పారాచూట్‌ను తయారుచేసినట్లు నాసా వెల్లడించింది. దాని బరువు 180 పౌండ్లని తెలిపింది. నాసా 2020లో అంగారకుడిపైకి ప్రయోగించనున్న రోవర్ సురక్షితంగా కిందకు దిగడంలో పారాచూట్ కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది.

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-336.17	-91.25	00	30,970	200	42,300	71.44
36,108.47	10,831.50	30,060	ప్రొద్దుటూరు 30,930	40,200	ప్రొద్దుటూరు 41,867	
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
సన్‌ఫార్మా	431.00	2.88
ఎస్-బ్యాంక్	197.25	2.63
జీ-ఎంటర్‌టైన్	432.85	1.79
టాటా స్టీల్	467.85	1.76
విప్రో	355.80	1.46

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఐటీసీ	277.30	-4.30
గ్రాసిం	782.15	-2.76
ఇండియాబుల్స్	778.70	-2.34
టైటన్‌కంపెనీ	987.40	-2.09
ఇన్ఫోసిస్	742.60	-1.84

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	71.44	71.34
యూరో	81.07	81.06
పౌండ్	92.05	92.90
ఆస్ట్రేలియా డాలర్	50.92	50.89
సింగపూర్ డాలర్	52.49	52.49

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,930	33,080
చెన్నై	30,930	33,080
బెంగళూరు	30,250	32,352
ముంబై	31,720	33,925
విజయవాడ	..	33,300
విశాఖపట్నం	30,970	33,785
ప్రొద్దుటూరు	30,930	32,480
ముడి చమురు		61..50

ఫిబ్రవరిలో
టీ - మధ్యంతర బడ్జెట్ !

ఆర్థికశాఖ అధికారుల కసరత్తు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : రాబోయే 2019-20 ఆర్థికసంవత్సరం కోసం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఫిబ్రవరి మూడోవారంలో రాబోయే ఆరునెలల కాలానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు అసెంబ్లీ సమావేశం కానున్నది. బడ్జెట్ సమావేశాలు మూడు లేదా నాలుగు రోజులు ఉండవచ్చని అధికారులం టున్నారు. మార్చి మొదటివారంలో లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశము న్నందున కేంద్రప్రభుత్వం ఫిబ్రవరి ఒకటిన మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సంకేతాలున్నాయి. అదేతరహాలో రాష్ట్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టడం మంచిదన్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు సూచన మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత మూడునెలల్లో పూర్తిస్థాయి బడ్జెట్‌పెట్టే అవకాశమున్నా ముందుజాగ్రత్తగా ఆరునెలల వరకు ద్రవ్య వినిమయానికి సభ అనుమతి తీసుకోనున్నట్టు ఉన్నతాధి కారులు వెల్లడించారు. మధ్యంతర బడ్జెట్‌కు తుదిరూప మివ్వడానికి ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు ఆధ్వర్యంలో సన్నాహాలు జరుగుతున్నాయి. తాత్కాలిక అవసరాలకు ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్‌ను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అంటారు. ఈ బడ్జెట్‌కు పూర్తిస్థాయి బడ్జెట్ మాదిరి సుదీర్ఘ చర్చలుండవు. పూర్తిస్థాయి బడ్జెట్‌లో ఆదాయం, వ్యయాలుంటాయి. మధ్యంతర బడ్జెట్‌లో వ్యయం మాత్రమే ఉంటుంది. కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రాలకు కేటాయింపులు, మొత్తం పన్నులలో రాష్ట్రానికి వచ్చే వాటా, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లను సరిచూసుకుని రాష్ట్రప్రభుత్వాలు వచ్చే సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు రూపొందిస్తాయి. కేంద్రం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పుడే ఇది సాధ్యపడుతుంది. సాధారణంగా ఫిబ్రవరిలో కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెడితే తెలంగాణ రాష్ట్రం మార్చిలో బడ్జెట్‌ను చట్టసభల ఆమోదానికి నివేదిస్తుంటుంది. కానీ ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కేంద్రప్రభుత్వం బడ్జెట్‌ను సిద్ధం చేస్తున్నది. ఆ తర్వాత మేలో అధికారంలోకి వచ్చే ప్రభుత్వం వీలుచూసుకుని పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది.

ఎన్నికలు సమీపించిన సమయంలో ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తున్నది. రాష్ట్ర విభజనకు ముందు 2014మార్చిలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టింది. సీఎం కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. ఇందులో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి వివిధ వర్గాలకు ఇస్తున్న పెన్షన్లు పెంచడానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం లేదని ముఖ్యమంత్రే స్వయంగా అసెంబ్లీలో వెల్లడించారు. ఈ బడ్జెట్‌లోనే పెన్షన్ల పెంపు ప్రతిపాదనలు చేయనున్నారు. మొత్తం పింఛన్లకు ఓట్ ఆన్ అకౌంట్‌లో రూ.3,174 కోట్లు కేటాయించనున్నట్లు తెలిసింది.

మార్కెట్‌కు విక్రయాల తాకిడి

సెన్సెక్స్‌కు 336పాయింట్ల నష్టం



ముంబై : దేశీయ సూచీలు బుధవారం భారీ నష్టాలతో ముగిశాయి. ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన మార్కెట్లు నష్టాల్లోనే కొనసాగుతూ వచ్చి చివరకు కుప్పకూలాయి. చివరి గంటలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు భారీ నష్టాల్లోకి వెళ్లాయి. ఆటోమొబైల్స్, బ్యాంకులు, వినియోగ, ఐటీ, మౌలిక రంగ షేర్లు నష్టపోవడం మార్కెట్లపై ప్రభావం చూపింది. అమెరికా-చైనాల మధ్య తలెత్తిన వాణిజ్యయుద్ధ ఫలితంగా అంతర్జాతీయ వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపినట్లు ప్రపంచ బ్యాంకునివేదిక మార్కెట్లపై ప్రభావం చూపింది. ఆసియా మార్కెట్లు, క్రూడాయిల్ ధరలు మార్కెట్లపై ప్రభావంచూపాయి. బుధవారం దాదాపు 50 కంపెనీలు ఫలితాలను ప్రకటించనున్నాయి. వీటిల్లో ఐటీసీ, గ్లోబల్ ఏవియేషన్స్, భారతీ ఇన్ఫ్రాటెల్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, విజయాబ్యాంక్ వంటి సంస్థలు ఉన్నాయి. లోహ, ఫార్మా రంగ షేర్లు లాభపడ్డాయి. ఉదయం సెన్సెక్స్ 10 పాయింట్లకు పైగా నష్టంతో ప్రారంభం కాగా, నిఫ్టీ 3 పాయింట్ల నష్టంతో 10,926 వద్ద ట్రేడింగ్ ఆరంభించింది. చివరకు సెన్సెక్స్ 336.17 పాయింట్ల నష్టంతో 3,6108.476 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 91.03 పాయింట్లు కోల్పోయి 10831.50 పాయింట్లకు చేరింది. గేజ్ ప్రీవియస్‌సెషన్‌లో 134.32 పాయింట్లు నష్టపోయింది. విదేశీ మదుపరులు సుమారు రూ.78.53 కోట్ల విలువైన షేర్లను అమ్మగా దేశీయ మదుపరులు రూ.84.15 కోట్ల షేర్లను అమ్మినట్లు తెలుస్తోంది. నేడు ఎన్ఎస్ఈలో సన్ ఫార్మా, యస్ బ్యాంకు, జీ ఎంటర్‌టైన్, టాటా స్టీల్, విప్రో తదితర కంపెనీల షేర్లు లాభపడ్డాయి. ఐటీసీ, గ్రాసిమ్, ఇండియాబుల్స్ హెచ్ఎస్‌జీ, టైటాన్ కంపెనీ, ఇన్ఫోసిస్ తదితర కంపెనీల షేర్లు నష్టపోయాయి. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.71.34వద్ద ట్రేడవుతోంది.

జీఎస్టీ అతిపెద్ద సంస్కరణట...!

చెన్నై: ఎన్డీయే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) దేశ వ్యవస్థలోనే అతిపెద్ద సంస్కరణ అని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తమిళనాడు రాజధాని చెన్నైలో జరుగుతున్న 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ (జీఐఎం) సదస్సులో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎంతో ధైర్యంగా ఈ కీలక సంస్కరణలను అమల్లోకి తెస్తోందని చెప్పారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నప్పుడే భారత వృద్ధి, సామర్థ్యాలను ప్రపంచ దేశాలను గుర్తిస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అంటుంటారని ఆమె గుర్తుచేశారు. 'దేశ వృద్ధిరేటు 6.5 శాతానికి మించి ఉంటుంది. ఎన్డీయే హయాంలో కొన్ని సార్లు జీడీపీ 7 శాతాన్ని కూడా తాకింది. భవిష్యత్‌లో ఇది 7 శాతాన్ని దాటుతుందని ఐఎంఎఫ్ కూడా అంచనా వేస్తోంది. ప్రధాని మోడీతీసుకుంటున్న వ్యవస్థీకృత సంస్కరణల వల్లే ఇది సాధ్యమవుతోంది. గత 60 ఏళ్లలో జీఎస్టీనే అతిపెద్ద సంస్కరణ' అని నిర్మలా సీతారామన్ చెప్పుకొచ్చారు.

విజ్ఞానం



70 ఏళ్ల వయసులోనూ ఉత్సాహం
60 ఏళ్లకి బిడ్డకు జననం

80ఏళ్లు వచ్చేనాటికి మనిషి తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడటం చూస్తున్నాం. కానీ 'బురుషా' తెగవాళ్లు వందేళ్లు వచ్చినా ఆరోగ్యంగా ఉంటారు. ఇక కేన్సర్ వంటి రోగాల సమస్యే లేదు. యవ్వనంగా కనిపించడం వీరి ప్రత్యేకత. ఇంతకీ ఆ తెగ పేరేంటో తెలుసా? 'బురుషా'! దీనికి మరో పేరు హుంజాలు!

పాకిస్థాన్‌లోని హుంజా ప్రాంతంలో వీరు నివసిస్తున్నారు. సాధారణంగా మహిళలకు నలభై ఏళ్లు దాటితే పిల్లలు పుట్టే అవకాశం తగ్గుతుంది. ఈ తెగ వారు మాత్రం 60 ఏళ్లు దాటినా ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనిస్తారు. అందరికంటే ప్రత్యేకంగా ఉండటానికి వీరేం అమృతం తాగలేదు. వీరి జీవన విధానమే ప్రత్యేకంగా నిలబెట్టింది. సాధారణంగా పాకిస్థానీల సగటు వయసు 67 ఏళ్లు. కానీ హుంజాల సగటు వయసు వందేళ్లు. గడ్డ కట్టే చలిలోనూ చన్నీళ్లతో స్నానం చేయడానికే ఇష్టపడతారు. వ్యాయామం, నడకకు అధిక ప్రాధాన్యత ఇస్తారు కాబట్టే ఆరోగ్యంగా ఉంటారు. ఇక్కడ ఉన్నవారిలో 90 శాతం అక్షరాస్యులే!

ఆహారమే ప్రత్యేకం

ఆరోగ్యకరమైన జీవన విధానమే వీరి ఆరోగ్య రహస్యం. ఆహారపదార్థాలన్నీ స్వయంగా పండించుకుంటారు. ముఖ్యంగా పండ్లు, తృణధాన్యాలు, గుడ్లు, స్వయంగా పండించిన కూరగాయలు, పాలు, ప్రోటీన్లు ఉన్న ఆహారాన్ని మాత్రమే హుంజాలు తింటారు. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని అసలే ముట్టుకోరు. రోజుకు 2వేల కేలరీలకు మించి ఆహారం తీసుకోరు. ఆప్రికాట్ పండ్లను ఇష్టంగా తింటారు. హిమనీనదాల నుంచి వచ్చే స్వచ్ఛమైన నీటిని మాత్రమే తాగుతారు. ఇక్కడ 'తుమురు టీ' ఇక్కడ చాలా ప్రత్యేకం. మూలికలతో తయారు చేసే ఈ టీ వల్లే వీరి చర్మం యవ్వనంగా కనిపిస్తుంది.

ఆహారానికి సుదీర్ఘ విరామం

ఇక్కడి ప్రజలు రోజూవారీ ఆహారానికి రెండు, మూడు నెలలపాటు విరామం ఇస్తారు. ఆ సమయంలో ఆప్రికాట్ పండ్ల నుంచి తీసిన ఆహరాన్ని ఎక్కువగా తాగుతారు. ఇది సంప్రదాయంగా వస్తున్న ఆచారం. ఇప్పటికీ ఈ ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. ఆప్రికాట్ పండ్లలో ఉండే విటమిన్ బీ-17కు కేన్సర్ వంటి వ్యాధులను నిరోధించే లక్షణాలున్నాయి.

పసిడి వెలవెల..
వెండి ధగధగ..!



న్యూఢిల్లీ : అంతర్జాతీయ పరిణామాల కారణంగా బుధవారం బంగారం ధర తగ్గింది. రూ.115 తగ్గడంతో పది గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.33,210కి చేరింది. దేశీయ మార్కెట్లో ఆభరణాల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ మందగించడం బంగారం తగ్గుదలకు మరో కారణంగా బులియన్ ట్రేడింగ్ వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉంటే వెండి ధర మాత్రం పెరిగింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల దగ్గర నుంచి డిమాండ్ లభించడంతో వెండి ధర పెరిగినట్లు ట్రేడర్లు చెబుతున్నారు. రూ.310 పెరగడంతో కిలో వెండి రూ.40,160కి చేరింది. అటు అంతర్జాతీ యంగాను బంగారం ధర తగ్గింది. న్యూయార్క్ మార్కెట్లో బంగారం ధర 0.11శాతం తగ్గడంతో ఔన్సు 1,284.30 డాలర్లు పలికింది. వెండి 0.16శాతం పెరగడంతో ఔన్సు 15.43డాలర్లు పలుకుతోంది. 99.9శాతం పసిడి ధర రూ.33,210గా ఉండగా, 99.5శాతం పసిడి ధర రూ.33,060గా ఉంది. నిన్నటి ట్రేడింగ్‌లో పసిడి రూ.125 పెరిగిన విషయం తెలిసిందే.

మార్కెట్లో మెల్లోరా కొత్త కలెక్షన్స్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : రాబోయే వాలంటైన్స్ డే సందర్భంగా ప్రముఖ జ్యూయలరీ షోరూం మెల్లోరా లేటెస్ట్ గ్లోబల్ ట్రెండ్స్‌ను తీసుకువచ్చింది. ట్రెండ్స్ హార్ట్ పేరిట ఈ కలెక్షన్‌ను వినియోగదారులకు అందు బాటులోకి తెచ్చినట్లు సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓ సరోజా యర్రమిల్లి తెలిపారు. ప్రస్తుత ఫ్యాషన్, వాతావరణాలకు అనుగుణంగా వీటిని గోల్డ్, డైమండ్‌లతో రూపొందించామన్నారు. డిస్కో సీక్వెన్స్, నైఫ్ ప్లేట్స్, స్కార్ఫ్ ప్రింట్, ఫ్లవర్ బొకే, యానిమల్ ప్రింట్, బౌన్, నియోన్ మొదలైన డిజైన్లు సిద్ధం చేశామని తెలిపారు.

ఈ ఫోన్‌ను
రెండు వైపులా మడతపెట్టొచ్చు..!



మడతపెట్టే ఫోన్లను తీసుకొచ్చేం దుకు స్మార్ట్‌ఫోన్ కంపెనీలు సన్నద్ధమవు తున్నాయి. ఇందులో భాగంగానే శామ్‌సంగ్, ఎల్‌జీ వంటి సంస్థలు ఇప్పటికే మడతపెట్టే ఫోన్లను తయారీ చేస్తున్నట్లు ప్రకటించేశాయి. ఇప్పుడు ఆ జాబితాలో చైనా స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ షామీ కూడా చేరిపోయింది. షామీ నుంచి మడతపెట్టే ఫోన్ మార్కెట్లోకి రానుందని గత కొన్ని రోజులుగా వార్తలు వెలువడ్డాయి. అయితే దానిపై స్పష్టమైన వివరాలు మాత్రం బయటకు రాలేదు. తాజాగా.. షామీ నుంచి ఏకంగా రెండు వైపులా మడతపెట్టే వీలున్న ఫోన్ రాబోతుంది. దీనికి సంబంధించిన వీడియో కూడా బయటకు వచ్చింది. షామీ డబుల్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌కు ప్రస్తుతం ఎటువంటి పేరు పెట్టలేదు. షామీ అధ్యక్షుడు, సహ వ్యవస్థాపకుడు బిన్ లిన్ ఈ మడతపెట్టే ఫోన్‌ను పరిశీలిస్తున్నట్లుగా ఉన్న వీడియోను ఆ సంస్థ ప్రతినిధి ట్విటర్‌లో పోస్టు చేశారు. స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ రెండింటి మాదిరిగా దీన్ని ఉపయోగించుకోవచ్చు. దీనికున్న ప్రత్యేకత ఏమిటంటే.. రెండు వైపులా మడతపెట్టే సదుపాయం ఉంది. అందుకు తగినట్లుగానే స్క్రీన్ కూడా మారిపోతుంది. షామీ అధ్యక్షుడు ట్యాబ్‌ను పరిశీలిస్తూ దాన్ని రెండువైపులా మడతపెట్టడం ఈ వీడియోలో కనిపిస్తోంది. డబుల్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్ టెస్టింగ్ దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఫోన్‌కు 'షామీ డ్యుయల్ ఫ్లెక్స్', 'షామీ మిక్స్ ఫ్లెక్స్' పేర్లను పరిశీలిస్తున్నారట. దీనికి సంబంధించిన ప్రత్యేకతలేంటి, ధర, ఎప్పుడు మార్కెట్లోకి తీసుకొస్తారనే వివరాలను మాత్రం వెల్లడించలేదు



కడపలో హెచ్‌డీఎఫ్‌సీ కార్యాలయం

విశాలాంధ్ర-హైదరాబాద్: హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, భారతదేశ ప్రీమియం హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ కడపలో తన కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ కార్యాలయం ప్రారంభంతో ఆంధ్రప్రదేశ్‌లో తన సేవలను మరింత బలోపేతం చేసిందని ఏపీ, తెలంగాణ రీజనల్ బిజినెస్ హెడ్ రాజన్ టాండన్ తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ కార్యాలయాలు ఏపీలో 13కు చేరాయని, ఈ కార్యాలయం కడప, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, మైదుకూరు, ప్రొద్దటూరు, పులివెందుల, రాయచోటితో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి గృహాల కోసం ఇంటి రుణం తీసుకునే వారికి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి హెచ్‌డీఎఫ్‌సీ ఎల్లవేళలా ప్రోత్సహిస్తుందని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు, తక్కువ ఆదాయం కలిగిన వారికి క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ రూపంలో రుణాలు అందించనున్నట్లు తెలిపారు. హోం ఇంప్రూవ్‌మెంట్ రుణాలు, ఇంటి విస్తరణ, స్థలం కొనుగోలు, గ్రామీణ ప్రాంత ఇంటి కొనుగోలు, ఎన్నారైలకు రుణాలు, ఆస్తులపై రుణాలు, ఇదివరకే రుణాలు తీసుకున్నవారికి టాప్ అప్ లోన్స్, కస్టమైజ్డ్ రీపేమెంట్ ఆప్షన్లు వంటి వినూత్నమైన పథకాలు ప్రవేశపెట్టామన్నారు.

మార్కెట్‌లో కొత్త వేగనార్..!



న్యూఢిల్లీ: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మారుతి సుజుకి మూడో జనరేషన్ వేగనార్ మోడల్‌ను భారత్‌లో విడుదల చేసింది. సరికొత్త 2019 ఎడిషన్ వేగనార్ కొత్త డిజైన్‌తో ముందుకు వచ్చింది. ప్రారంభ ధర రూ.4.19లక్షలు(ఎక్స్-షోరూం ఢిల్లీ). 1.0లీటర్ పెట్రోల్ ఇంజిన్ గతంలో ఉండగా ఇప్పుడు 1.2లీటర్ పెట్రోల్ ఇంజిన్‌ను కూడా చేర్చారు. ఈ సరికొత్త వేగనార్‌ను కొత్త జనరేషన్ హ్యుందాయ్ శాంత్రో, టాటా టియాగోలకు పోటీగా ప్రవేశపెట్టారు. కొత్త వేగనార్‌లో లీటరు ఇంజిన్ 67బీహెచ్‌పీ శక్తిని, 90ఎన్ఎం టార్క్‌ను విడుదల చేస్తుంది. 1.2లీటరు ఇంజిన్ 82బీహెచ్‌పీ శక్తిని, 113ఎన్ఎం టార్క్‌ను విడుదల చేస్తుంది. రెండు ఇంజిన్లకు కూడా 5-స్పీడ్ గేర్‌బాక్స్ ఉంటుంది. కొన్ని వేరియంట్లకు ఏజీఎస్ ఆటోమాటిక్ గేర్‌బాక్స్ కూడా ఉంటుంది. అలాగే డ్రైవర్ వైపు ఎయిర్‌బ్యాగ్, ఎలక్ట్రానిక్ బ్రేక్‌ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్(ఈబీడీ)తోపాటు యాంటిలాక్ బార్కింగ్ సిస్టమ్, సీటు బెల్టు గుర్తుచేసే విధానం, వేగాన్ని హెచ్చరించే విధానం, ప్రత్యేకమైన పార్కింగ్ సెన్సార్లు కొత్త వేగనార్‌లో ఉన్నాయి. ఆరు రంగుల్లో ఈ కారు లభ్యమవుతుంది. కొత్త వేగనార్ కోసం మారుతి ఇప్పటికే బుకింగ్స్ ప్రారంభించింది.

వరి సిరులు

భారీగా పెరిగిన ధాన్యం దిగుబడి



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణలో ఈ ఖరీఫ్‌లో వరి సిరులు కురిపించింది. 20 ఏళ్ల రికార్డును బ్రేక్ చేసింది. పాత రికార్డులను బద్దలు కొడుతూ రైతులు వరి పండించారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువుల సరఫరాలో తగిన చర్యలు తీసుకోవటంతో ఈ ఖరీఫ్ పంటలో దిగుబడి బాగా పెరిగిందని అధికారులు తెలిపారు. దిగుబడిపై 2018-19 ఖరీఫ్ పంటల దిగుబడి, ఉత్పాదకతపై అర్థగణాంక శాఖ అధికారులతో వ్యవసాయ శాఖ కీలక సమావేశం నిర్వహించింది. అందులో పంటల దిగుబడిపై చర్చ జరిగింది. ఖరీఫ్‌లో ఏకంగా 61 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. 20 ఏళ్లలో ఇంతటి దిగుబడి ఎప్పుడూ రాలేదని స్వయంగా వ్యవసాయ శాఖ అధికారులే తెలిపారు. ఈ నివేదికను ప్రభుత్వం అధికారికంగా త్వరలో విడుదల చేయనుంది. 2017-18 ఖరీఫ్ దిగుబడి కంటే ఏకంగా రెట్టింపు స్థాయిలో ఈసారి వరి దిగుబడి వచ్చింది. 2017-18 ఖరీఫ్‌లో వరి దిగుబడి 30.42 లక్షల టన్నులే. 2018-19 ఖరీఫ్‌లో వరి అంచనాలకు మించి సాగు జరిగింది. ఈ క్రమంలో వరిపంట ఏకంగా 107 శాతానికి చేరుకుంది. ఖరీఫ్ వరి సాధారణ సాగు కంటే విస్తీర్ణం 23.75 లక్షల ఎకరాలు కాగా, ఏకంగా 25.44 లక్షల ఎకరాలకు చేరుకుంది. ఉత్పాదకత శక్తి కూడా ఎక్కువ శాతం పెరిగింది. దీంతో ఎకరాకు 20 క్వింటాళ్లపైనే దిగుబడి వచ్చినట్లు అధికారులు నిర్ధారించారు. దీనికి కారణాలు ఎన్నో ఉన్నాయి. వరి పొలంలో ఎప్పుడూ అవసరానికి మించి నీరు ఉండేది. వ్యవసాయ శాఖ సూచనల ప్రకారం రైతులు వరి పొలంలో అప్పుడప్పుడు..అవసరానికి తగినట్లుగా తడి పెట్టారు. దీనివల్ల వరికి పూర్తిస్థాయిలో ఆక్సిజన్ అందటంతో వరి గింజ గట్టి పడటం, దాని బరువు పెరటంతో దిగుబడి పెరిగిందని ఓ అధికారి విశ్లేషించారు. వరిలో ఎంపిక చేసిన విత్తనాలను రైతులకు అందజేయటం వల్లా దిగుబడి పెరగడానికి దోహదం చేశాయని చెప్పారు. కునారం సన్నాలు, తెలంగాణ సోనా విత్తనాలను జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రైతులకు లక్ష క్వింటాళ్ల విత్తనాలు అందజేశామని తెలిపారు. సరైన సమయంలో నాట్లు వేయటం, వాటికి కావాల్సిన ఎరువులు, వేపపూత, యూరియా సరఫరా అన్నీ సరైన సమయంలో సరఫరా చేయటం వల్ల పంట దిగుబడి పెరిగిందని తెలిపారు. పెద్దగా చీడపీడల బాధ కూడా లేదనీ వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి విశ్లేషించారు. వరి పంటే కాకుండా తక్కిన పంటల దిగుబడి పెంచేలా ఓ నివేదికను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

మార్కెట్లోకి టాటా హారియర్

ముంబై: టాటామోటార్స్ సంస్థ ప్రతిష్మాత్మక ల్యాండ్‌రోవర్ ఓమెగా ఆర్క్ ప్లాట్‌ఫామ్‌పై నిర్మించిన హారియర్ ఎస్‌యూవీ వాహనాన్ని మార్కెట్లోకి విడుదల చేసింది. టాటా మోటార్స్ ఎండీ గుంటెర్ బుట్చెక్, టాటా మోటార్స్ ప్రెసిడెంట్ మయాంక్ ఫరేక్ బుధవారం ఆవిష్కరించారు. ఈ ఎస్‌యూవీ ధర 12.69 లక్షల నుంచి రూ.16.25లక్షల వరకు ఉంటుంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మార్కెట్లోకి విడుదల చేసిన నాలుగో కారు హారియర్ కావడం విశేషం. ఇది మొత్తం నాలుగు వేరియంట్లలో లభిస్తుంది. ఎక్స్‌ఈ, ఎక్స్‌ఎం, ఎక్స్‌టీ, ఎక్స్‌జెడ్ అనే వేరియంట్లలో దీనిని విక్రయించనున్నారు. ఈ కారులో నాలుగు సిలెండర్ల 2.0లీటర్ టర్బోఛార్జ్‌డ్ డీజిల్ ఇంజిన్‌ను అమర్చారు. ఈ ఇంజిన్ 350 ఎన్ఎం టార్క్‌ను 138 బీహెచ్‌పీ శక్తిని విడుదల చేస్తుంది. దీనిలో 6స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌ను అమర్చారు. ఇందులో మొత్తం ఎకో, సిటీ, స్పోర్ట్స్ అనే డ్రైవింగ్ మోడ్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి.



హైదరాబాద్‌లో ఫుడ్డీబడ్డీ సేవలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ఇంట్లో చేసిన ఆత్మీయ వంటను వ్యాపారవిపణిలో అందుబాటులో ఉంచాలని భావించే వారందరిని అనుసంధానం చేసే నైబర్‌హుడ్ ఫుడ్ నెట్‌వర్క్ ఫుడ్డీబడ్డీ హైదరాబాద్‌లో తన సేవలను ప్రారంభించింది. ఇప్పటికే నగరంలో 15 వేల నివాసాలకు చేరువై దాదాపు 20 వేలకు పైగా భోజనాలు విక్రయించిందని ఫుడ్డీబడ్డీ కో ఫౌండర్ అఖిల్ సెంథురామన్ తెలిపారు. బుధవారం నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో చెఫ్ శ్రద్ధా జోషితో కలిసి మాట్లాడుతూ కమ్మటి భోజనం తయారు చేసే తపన కలిగిన హోంచెఫ్‌లను, వారి సమీప ప్రాంతంలోనే నివసించే వారిని ఈ స్టార్టప్ ఒక్కతాటిపైకి తెస్తుందన్నారు. ఫుడ్డీబడ్డీ యాప్ ద్వారా హోంచెఫ్ ప్రైవేట్ కిచెన్‌ను ఏర్పాటు చేస్తే ఆ వ్యక్తి తన సమీపంలోని అపార్ట్‌మెంట్లు, పరిసర ప్రాంతాల వారితో అనుసంధానం అవడంతో పాటు మరింతమంది వినియోగదారులను పొందవచ్చని తెలిపారు. ఏ సమయంలో ఏమి అమ్మదలుచుకున్నారో హోంచెఫ్‌లు నిర్దేశించుకొని వారి వారి వెసులుబాటు ప్రకారం ఆ ప్రక్రియను పూర్తి చేసేందుకు గల అనుసంధాన్ని ఫుడ్డీబడ్డీ చేస్తుందన్నారు.

మొబైల్‌తో... పొలానికి నీరు!

కొత్త పరికరాన్ని సృష్టించిన కుర్రోడు

నేటి ఆధునిక వ్యవసాయంలో ఎన్నెన్నో మార్పులు వచ్చాయి. సాంప్రదాయంగా కూలీలు చేసే ప్రతీ పనికి పనిముట్లు వచ్చాయి. మార్కెట్లో ఎన్ని రకాల పరికరాలు వచ్చినప్పటికీ కొన్ని పనులు మాత్రం ఇప్పటికీ రైతే చేయాల్సి ఉంటుంది. వాటిలో ఒకటి పొలానికి నీరు పెట్టడం. నీరు లేకపోతే పంట పండదు. అందుకని చాలా మంది వారి పొలాల్లో బోర్లు వేయించుకుంటున్నారు. కానీ కష్టాలు తప్పడంలేదు. బోరులు వేయించిన కరెంట్ సదుపాయం సరిగ్గా ఉండక అది ఉన్న సమయంలోనే వెళ్ళి పొలాన్ని తడపాలి. ఈ పనికి సరైన సమయం అంటూ ఉండదు. రైతులు పొలాన్ని తడపటానికి నిత్యం 5-7 కిలోమీటర్లు నడిచి వెళ్ళాలి. ఇది చాలా కష్టమైన పని. వయస్సుపైబడ్డ వారికైతే ఇది మరీ ఇబ్బంది. వర్షాకాలంలో వీటితో పడే బాధ అంతా ఇంతా కాదు ఏదైనా పట్టుకోరాని చోట పట్టుకుంటే షాక్ కొట్టే ప్రమాదాలు ఎక్కువే. ఇలాంటి పరిస్థితులను చూసి చలించిపోయిన రాజస్థాన్‌లోని మహాపుర యువకుడు ఇషాన్ మల్‌హోత్ర సరికొత్త ఎలక్ట్రానిక్ పరికరాన్ని తయారు చేశాడు.





అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ రోబోలను, డ్రైవర్ అవసరం లేని కార్లను సృష్టించింది. కానీ వీటివల్ల అన్నం పెట్టే రైతుకు ఏ మాత్రం ఉపయోగం ఉండడం లేదు అంటున్నాడు ఇషాన్.

ఇషాన్ పాఠశాలను చేరుకునే మార్గంలో చాలా పొలాలున్నాయి. పొలాల్లో పురుషులు వారి భుజాలపై మట్టిని మోస్తుండడం, స్త్రీలు విత్తనాలను విత్తడం వంటి పనులు చేయడం కరెంట్ రాగానే పొలానికి నీరు పెట్టడం వంటి పనులు గమనిస్తుండేవాడు. ఇలా వేలకొలది గ్రామల్లో కరెంట్ సరఫరా సరిగ్గా లేక రైతులు రాత్రి పగలు అనే తేడా లేకుండా పొలాల్లోనే పని చేయడం ఇషాన్‌ను కలిచివేసింది. దీంతో ఈ సమస్యకు ఒక పరిష్కారం చూపించాలనుకున్నాడు.





ఇషాన్ జైశ్రీ పేరివాల్ ఇంటర్నేషనల్ స్కూల్, జైపూర్‌లో చదువుకుంటున్నాడు. అతని వయస్సు పదిహేను సంవత్సరాలైనప్పటికినీ రైతుల కష్టాలు తీర్చడం కోసం రెండు సంవత్సరాల పాటు కష్టపడి ఫ్లూటో అనే డివైజ్‌ను ఆవిష్కరించాడు. ఈ డివైజ్ సబ్ మెర్సిబుల్ పంపు, తుళ్ళు పంపునకు రిమోట్‌లా కనెక్ట్ అయిపోయి ఉంటుంది. దీన్ని మీరు మొబైల్ ఫోన్ లేదా ల్యాండ్ లైన్ నుంచైనా వినియోగించుకోవచ్చు. ఈ పరికరానికి 3జీ, 4జీలతో పనిలేదు. ఎలాంటి ఫోన్ నుంచైనా ఎక్కడనుంచైనా ఆపరేట్ చేయవచ్చు. దీని వల్ల రైతులకు విశ్రాంతి తీసుకోవడానికి కొంత ఖాళీ సమయం దొరకుతుంది.

కేంద్ర మంత్రి హర్షవర్ధన్ ఇషాన్ డివైజ్‌ను చూసి ఇది రైతుల సాధికారితకు ఉపయోగపడుతుందన్నారు. ఈ డివైజ్ వినియోగదారులకు ఆ ప్రాంతంలో ఉన్న కరెంట్ స్థితికి సంబంధించిన కచ్చితమైన సమచారాన్ని అందిస్తున్నారు.

ఈ డివైజ్ మ్యానువల్ ఇంగ్లీషు, హిందీ భాషల్లో లభ్యమవుతుంది. ఇప్పటికే 400మంది దీన్ని వినియోగిస్తున్నారు. దీని వెల కేవలం 500 మాత్రమే అంటున్నాడు ఇషాన్.

జైపూర్‌లోని స్టాన్‌ఫోర్డ్ హానర్స్ అకాడమీలో నిర్వహించిన వీడియో గేమ్ డిజైన్ కార్యక్రమానికి ఇషాన్ వెళ్ళాడు. ఆ సమయంలో రైతుల కోసం సహాయపడే విధంగా పనిచేయాలని నిర్ణయించుకున్నాడు.

2015 వేసవిలో షెరోల్ చెన్ మార్గదర్శకత్వంలో బాస్కెట్ బాల్ గేమ్స్, మిడ్‌నైట్ ఫెస్టలు కూడా వదిలేసి ఒక్కడే కూర్చొని నమూనాను తయారు చేశాడు. తర్వాత గూగుల్ ద్వారా కార్సన్ మైక్‌నేల్ అనే ఇంజినీర్‌తో సంప్రదించి అతని సలహాతో రెండేళ్ళల్లో ఈ ఫ్లూటో డివైజ్‌ను తయారు చేశారు.

ఫ్లూటోను తయారు చేసిన ఆరునెలల్లోనే చాలా రకాల సవాళ్ళు ఇషాన్‌కు ఎదురయ్యాయి. ఇషాన్ సవాల్‌ను ఎదుర్కొనే సమయంలో సహనాన్ని కోల్పోయాననుకున్నప్పటికి తిరిగి మరింత ఉత్సాహంతో పనిచేసి సక్సస్ అయ్యాడు. ఈ సమయంలో ఇషాన్‌కు తన తల్లిదండ్రుల నుంచి పూర్తి సహకారం లభించింది. చదువుకున్న యువత వల్లే మార్పులు సంభవిస్తాయని వారు గట్టిగా నమ్మడం కూడా ఇందుకు కారణం. ఇషాన్ అక్క పర్యావరణాన్ని కాపాడటానికి, ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడం కోసం కృషి చేయడం తనలో పదిమందికి సహాయపడాలనే భావన పెంపొందింది.

ఫ్లూటో ఇన్‌పుట్ లేదా అవుట్ పుట్ అనే విధానంతో పనిచేస్తుంది. ప్రతి ఒక్క ఫ్లూటో కూడా ఒక సిమ్ కార్డ్‌ను కలిగి ఉంటుంది. జీఎస్ఎమ్ మాండ్యులే సహాయంతో పనిచేస్తుంది. డివైజ్‌లో ఉన్న సిమ్‌కార్డ్ యాక్టివేట్ అయినప్పటి నుంచి డివైజ్ వర్క్ చేస్తుంది. ఈ డివైజ్‌ను వాటర్ పంపు స్విచ్‌బోర్డుకు అనుసంధానం చేస్తారు. ఒక్కసారి డివైజ్‌ను బిగించాక ఇక మీ ఫోన్‌తో దాన్ని ఆపరేట్ చేయవచ్చు. దీనిలో మూడు రంగుల బల్బులు ఉంటాయి. దీనిలో పచ్చరంగు బల్బు ఎలక్ట్రిసిటీ, పసుపు రంగు సిమ్ కార్డ్ కనెక్షన్ నెట్‌వర్క్‌ను, ఎరుపు రంగు స్విచ్ ఆన్‌ను సూచిస్తుంది.

ఈ డివైజ్ వల్ల వ్యవసాయ రంగంలో నీటి పారుదలకు సంబంధించిన సమస్యలు చాలా వరకు తగ్గిపోయాయి. మొదటగా 25 డివైజ్‌లను మాత్రమే తయారు చేసి మహాపుర గ్రామస్థులకు ఇచ్చాడు. దీన్ని చూసి మిగిలిన వారు కూడా మాకు కావాలని ఇషాన్‌కు ఆర్డర్స్ ఇస్తున్నారు.

రుణదాతలు, గ్రహీతల మధ్య వారధి

లెన్‌డెన్‌క్లబ్



కొందరికి సొంత పనుల కోసం డబ్బు అవసరముంటుంది. ఎన్ని రకాలుగా ప్రయత్నించినా సమయానికి డబ్బు దొరక్క ఇబ్బందులకు గురవుతారు. మరి కొందరు ముందు జాగ్రత్తతో డబ్బు దాచుకుంటారు. అలాంటివారు బ్యాంక్‌లో వేద్దామంటే వడ్డీరేటు తక్కువ అని వెనుకాడుతుంటారు. తెలిసినవారికి అప్పుగా ఇచ్చినా తిరిగి వసూలు చేసుకోవడం కష్టం.

ఈ రెండు రకాల వ్యక్తుల అవసరాలను ఒకే వేదికగా తీరుస్తోంది లెన్‌డెన్‌క్లబ్. సూక్ష్మంగా చెప్పాలంటే రుణదాతలు, గ్రహీతలను కలిపే 'పీర్ టు పీర్' లెండింగ్ వేదికన్న మాట. మొదట్లో ఉద్యోగులకే రుణాలిచ్చిన లెన్‌డెన్‌క్లబ్.. త్వరలో దుకాణదారులకూ రుణాలిచ్చేందుకు సిద్ధమైందని సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ భవీన్ పాటిల్ చెబుతున్నారు.

"2015లో రూ.80 లక్షల పెట్టుబడితో గుర్‌గావ్ కేంద్రంగా లెన్‌డెన్‌క్లబ్‌ను ప్రారంభించాం. ప్రస్తుతం లెన్‌డెన్‌క్లబ్‌లో 40,880 మంది రుణ గ్రహీతలు, 9,982 మంది రుణదాతలు నమోదయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు మాత్రమే రుణాలిస్తున్నాం. కేవైసీ పూర్తి చేసిన 3 గంటల్లో రుణాన్నిస్తాం. రూ.40 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణాన్ని పొందవచ్చు. వార్షిక వడ్డీ రేటు 12.5 నుంచి 35 శాతం వరకుంటుంది. రుణ వాయిదాలను 18-36 నెలల్లో తిరిగి చెల్లించేయాలి. రూ.5 లక్షల కేటగిరీలో 5 శాతం కస్టమర్లుంటారు.

రూ.2.5 కోట్ల ఆదాయం లక్ష్యం..

రుణ గ్రహీతలు చెల్లించే నెలసరి వాయిదా నేరుగా రుణదాతల బ్యాంక్ ఖాతాలో జమవుతాయి. లెన్‌డెన్‌క్లబ్ రుణదాత నుంచి 1.5%, రుణగ్రహీత నుంచి 4% నిర్వహణ రుసుము కింద వసూలు చేస్తుంది. 2017లో రూ.55 లక్షల ఆదాయాన్ని ఈ సంస్థ ఆర్జించింది. 2018లో రూ.2.5 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్ణయించుకుని, దాదాపుగా సాధించింది. ప్రస్తుతం ఎన్‌పీఏ 3.92 శాతంగా ఉంది. త్వరలోనే దుకాణదారులకు అర్హతలను బట్టి రూ.20 వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణాలను అందించనుంది. కాల వ్యవధి 6 నెలలు. వార్షిక వడ్డీ 15 నుంచి 22% ఉంటుంది.



రూ.10 కోట్ల నిధుల సమీకరణ..

ప్రస్తుతం కంపెనీలో 45 మంది ఉద్యోగులున్నారు. త్వరలోనే హోమ్ రెనోవేషన్, ఫ్యామిలీ ఫంక్షన్స్ వంటి వాటికి రుణాలిచ్చేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాం. ఇటీవలే వెంచర్ క్యాటలిస్ట్, అనిరుధ్ దమానీ, ఇండియన్ వెంచర్ క్యాపిటల్ ఫండ్ నుంచి రూ.5 కోట్ల నిధులను సమీకరించాం. త్వరలో మరో రూ.10 కోట్ల వరకు నిధులను సమీకరించనున్నాం. పాత ఇన్వెస్టర్లతో పాటూ ఒకటిరెండు వీసీ సంస్థలతో చర్చలు జరుపుతున్నాం" అని భవీన్ వివరించారు.

> **తెలంగాణలో నెలకు 150 మందికి..**
>
> ప్రస్తుతం కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో సేవలందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 60 వేల మందికి రూ.40 కోట్ల రుణాలిచ్చామని తెలిపారు. ప్రస్తుతం నెలకు వెయ్యి మందికి రూ.4 కోట్ల వరకు రుణాలందిస్తున్నామని వివరించారు. తెలంగాణ నుంచి నెలకు 150 రుణ గ్రహీతలకు రూ.70 లక్షల వరకు రుణాలిస్తున్నామని చెప్పారు. మరో 3 నగరాలకు విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, త్వరలో ఆంధ్రప్రదేశ్‌లోనూ సేవలను ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.

పూరీ- రామ్‌ల ఇస్మార్ట్ శంకర్..

పూరీ జగన్నాథ్- రామ్ పోతినేని కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రం ఇస్మార్ట్ శంకర్. ఇప్పటికే చిత్ర ఫస్ట్ లుక్ విడుదల కాగా, దీనికి భారీ రెస్పాన్స్ వచ్చింది. రామ్ మాంచి మాస్ లుక్‌లో కనిపించాడు. నేడు చిత్రం గ్రాండ్‌గా లాంచ్ కాగా, రేపటి నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. లాంచింగ్ కార్యక్రమానికి చిత్ర యూనిట్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. చార్మీ క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించగా, స్రవంతి రవి కిషోర్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సినిమాలో రామ్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నాడు. కొన్నాళ్ళుగా సరైన హిట్స్ లేక ఇబ్బందిపడుతన్న రామ్, పూరీలు ఈ సినిమాతో మంచి విజయం తమ ఖాతాలో వేసుకోవాలనే కసితో ఉన్నారు. పూరీ జగన్నాథ్ దర్శకుడిగానే కాదు నిర్మాతగాను ఈ చిత్రానికి పని చేస్తున్నారు. చార్మీ సహనిర్మాతగా ఉన్నారు. అను ఎమ్మాన్యుయేల్ తో పాటు మరో భామని ఈ చిత్రంలో కథానాయికలుగా తీసుకోవాలని అనుకుంటున్నారట. మాస్ కంటెంట్‌తో పూరీ జగన్నాథ్ ఈ చిత్రాన్ని కమర్షియల్ ఫార్మాట్‌లో తెరకెక్కించనున్నట్టు సమాచారం.





అఖిల్ చరణ్ తారక్..ఓ ఫొటో

టాలీవుడ్ స్టార్స్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, అఖిల్ కలిసి దిగిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. మంగళవారం రాత్రి తారక్, చెర్రీ అఖిల్ ఇంటికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఫొటోను అఖిల్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'నాకు తెలిసిన మోస్ట్ పవర్‌ఫుల్ ట్యాగ్ టీం. నాకు మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు బ్రదర్స్' అని క్యాప్షన్ ఇస్తూ 'బాయ్స్ విల్ బీ బాయ్స్' అని హ్యాష్‌ట్యాగ్ ఇచ్చారు. అయితే ఏ సందర్భంగా వీరు ముగ్గురూ కలుసుకున్నారో మాత్రం వెల్లడించలేదు. ఫొటోలో అఖిల్ పెంపుడు కుక్క కూడా ఉంది. వీరు ఫొటోకి పోజిస్తున్నప్పుడు కుక్క వారి వైపు తదేకంగా చూడటం ఫన్నీగా ఉంది. ఈ ఫొటో పోస్ట్ చేసిన కొద్దిసేపటికే అరవై వేలకు పైగా లైక్‌లు వచ్చాయి. 'మూడు సింహాలు ఒక్కచోట చేరాయి' అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. కాగా.. ఈ ఫొటోపై సినీ నటుడు మంచు మనోజ్ ట్విటర్ వేదికగా కామెంట్ చేస్తూ 'క్యూటీస్. వీరి ముగ్గురిలో ఎవరు యంగ్‌గా ఉన్నారు?' అంటూ చమత్కరించారు. అఖిల్ కథానాయకుడిగా నటించిన 'మిస్టర్ మజ్ను' ప్రీ రిలీజ్ వేడుకకు తారక్ ముఖ్య అతిథిగా విచ్చేసి సందడి సంగతి తెలిసిందే. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

83 కోసం భారీ కాస్టింగ్..

క్రికెటర్ కపిల్ దేవ్ బయోపిక్ 83 అనే టైటిల్‌తో రూపొందనుండగా, ఈ చిత్రం కబీర్ ఖాన్ దర్శకత్వంలో తెరకెక్కనుంది . రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో కనిపించనున్నాడు. 1983 వరల్డ్‌కప్ ఫైనల్లో అప్పటి డిఫెండింగ్ చాంపియన్ వెస్టిండీస్‌ను ఓడించి తొలిసారి టీమిండియా విశ్వవిజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఆ టీమ్ సక్సెస్ స్టోరీ ఆధారంగా మూవీ తెరకెక్కనుంది. హిందీ, తెలుగుతో పాటు పలు భాషలలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రముఖ నటుడు నవాజుద్దీన్ సిద్దిఖీ ఈ చిత్రంలో రణ్ వీర్ సింగ్‌కి కోచ్ గా నటించనున్నారు. తాజాగా చిత్రానికి సంబంధించిన ఓ వీడియో ట్విట్టర్ ద్వారా విడుదల చేస్తూ అతి త్వరలో చిత్రానికి సంబంధించిన భారీ కాస్టింగ్ ప్రకటించనున్నామని తెలిపారు. 2020లో ఏప్రిల్ 10 గుడ్ ఫ్రైడే రోజు కపిల్ దేవ్ బయోపిక్ చిత్రంని విడుదల చేయబోతున్నట్టు కూడా తెలిపారు. ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మించనుంది. కపిల్ దేవ్ పాత్రలో నటించబోతున్న రణవీర్ సింగ్ ప్రస్తుతం గల్లీ బాయ్ చిత్రంతో బిజీగా ఉన్నాడు.

మళ్లీ పెళ్లి చేసుకోనున్న రజనీ కుమార్తె?

సూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ మళ్లీ పెళ్లి చేసుకోబోతున్నారట. సినీ నటుడు, ఓ ఫార్మా కంపెనీ యజమాని అయిన విషగన్ వనగమూడిని సౌందర్య పెళ్లాడబోతున్నారట. గతేడాది సన్నిహితులు, కుటుంబీకుల సమక్షంలో వీరి నిశ్చితార్థం జరిగింది. ఫిబ్రవరి 11న పెళ్లి జరగనున్నట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. చెన్నైలోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో వీరి వివాహాన్ని గ్రాండ్‌గా జరిపించనున్నట్లు తెలుస్తోంది. మెహెందీ, సంగీత్ కార్యక్రమాలతో కలిపి మూడు రోజుల పాటు వివాహ వేడుక ఉండబోతోందట. వేడుకకు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు హాజరుకాబోతున్నారు. ఇప్పటికే తలైవా నివాసంలో పెళ్లి సందడి మొదలైనట్లు తెలుస్తోంది. 'వంజగర్ ఉలగమ్' అనే చిత్రంలో విషగన్ నటించారు. 2010లో సౌందర్య.. అశ్విన్ అనే వ్యాపారవేత్తను వివాహం చేసుకున్నారు. వీరిద్దరికీ ఓ కుమారుడు ఉన్నారు. కొన్ని కారణాల వల్ల 2017లో సౌందర్య, అశ్విన్ విడాకులు తీసుకున్నారు.



విశాలాంధ్ర సినిమా



8న 'యాత్ర'

"నీళ్ళుంటే కరెంటు వుండదు.. కరెంటు వుంటే నీళ్ళుండవు..రెండూ వుండి పంట చేతికొస్తే సరైన ధర వుండదు. అందరూ రైతే రాజంటారు..సరైన కూడు గూడు గుడ్డ నీడ లేని ఈ రాచరికం మాకొద్దయ్య.. మమ్మల్ని రాజులుగా కాదు కనీసం రైతులుగా బ్రతకనివ్వండి చాలు..అని ప్రతి రైతు గొంతెత్తి అరుస్తున్న సమయం అది.. ఎవరైనా ఆదుకుంటారా అని రైతన్న ఎదురుచూసిన సమయంలో ఒక గొంతుక వినిపించింది.." నేను విన్నాను నేను వున్నాను అంటూ ఓ పిలుపు పేద ప్రజలవైపు నిలుచుంది.. నాయకుడిగా మనకు ఏం కావాలో తెలుసుకున్నాము కాని జనానికి ఏం కావాలో తెలుసుకోలేక పోయాము అంటూ అదిష్టానాన్ని సైతం లెక్క చేయక పేద ప్రజల కష్టాల్ని వినటానికి కడప గడప దాటి ప్రజాయాత్రని పాదయాత్రగా ప్రారంభించిన జననేతగా, మహానేతగా పేద ప్రజల గుండె చప్పుడుగా ఎప్పటికి పదిలమైన చోటు సుస్థిరపరుచుకున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖర్ రెడ్డి పాదయాత్రలో ముఖ్య ఘట్టాలన్ని తీసుకుని రూపొందించిన చిత్రం యాత్ర వైఎస్ఆర్ రాజకీయ జీవితంలో పాదయాత్ర కీలక ఘట్టం.. ఆ సమయంలో జరిగిన ముఖ్య సంఘటనల సమాహారమే ఈ యాత్ర. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి వైఎస్ఆర్ పాత్రలో జీవిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టీజర్లు, ట్రైలర్స్‌కి చాలా మంచి స్పందన రావటంతో యూనిట్ అంతా ఆనందంగా వుంది. ఆనందొ బ్రహ్మ లాంటి హిట్ చిత్రాన్ని అందించిన దర్శకుడు మహి వి రాఘవ్ ఈ యాత్రని తెరకెక్కించారు. భలే మంచి రోజు, ఆనందో బ్రహ్మ వంటి సూపర్ హిట్ చిత్రాలతో మంచి పేరు సంపాదించుకున్న 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ అత్యంత భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ చిత్రానికి శివ మేక సమర్పకుడు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఫిబ్రవరి 8న యాత్ర చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. అలానే తెలుగుతో పాటు తమిళం, మళయాలంలో కూడా యాత్ర చిత్రాన్ని ఫిబ్రవరి 8న రిలీజ్ చేస్తున్నారు. తెలుగు పార్ట్‌కి సెన్సారు కార్యక్రమాలు పూర్తిచేసుకుంది. క్లీన్ యు సర్టిఫికెట్‌ని సొంతం చేసుకుంది.

'లక్ష్మీస్ ఎన్టీఆర్'పై సెన్సార్ బోర్డులకు హైకోర్టు నోటీసులు

ఎన్టీఆర్ జీవిత చరిత్రకు సంబంధించి రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో వస్తున్న 'లక్ష్మీస్ ఎన్టీఆర్' చిత్రంలో 'దగా...దగా.. కుట్ర..' అనే పాట తొలగింపునకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర సెన్సార్ బోర్డులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సినిమాతోపాటు సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్‌లలో పాటను తొలగించాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. 'లక్ష్మీస్ ఎన్టీఆర్' చిత్రంలోని పాటను ఇటీవల విడుదల చేశారని, ఇది ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా చలామణి అవుతోందన్నారు. ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబును మోసగాడిగా చూపించేలా ఈ పాట ఉన్నందున దాన్ని సినిమా నుంచి తొలగించేలా సెన్సార్ బోర్డుకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. పిటిషనర్ ఏపీకి చెందిన వ్యక్తికాగా ఇక్కడెందుకు వ్యాజ్యం దాఖలు చేశారని ధర్మాసనం ప్రశ్నించగా.. వ్యాజ్యం దాఖలు చేసే నాటికి హైకోర్టు ఉమ్మడిగానే ఉందని, అంతేకాకుండా పాటను ఇక్కడే విడుదల చేశారని న్యాయవాది చెప్పారు. అనంతరం ధర్మాసనం.. సెన్సార్ బోర్డులతోపాటు నిర్మాత రాకేశ్‌రెడ్డికి నోటీసులు జారీ చేస్తూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.



హేమమాలిని పర్‌ఫార్మెన్స్‌కి ఫిదా అయిన కేంద్రమంత్రి

అద్భుతం, నమ్మశక్యం కానిది, ఊహించలేనిది.. ఈ మూడు మాటలతో హేమమాలిని పర్‌ఫార్మెన్స్‌ని కేంద్రమంత్రి సుష్మా స్వరాజ్ అభినందించారు. ప్రవాసి భారతీయ దివస్ సమ్మేళనం సందర్భంగా వారణాసి నగరంలో జరిగిన కార్యక్రమంలో బాలీవుడ్ ప్రముఖ నటి ఎంపీ హేమమాలని గంగా నృత్యం చేస్తూ వీక్షకులని అలరించారు. దాదాపు 90 నిమిషాల పాటు సాగిన ఆమె నృత్య ప్రదర్శనకి ప్రతి ఒక్కరు ఫిదా అయ్యారు. ముఖ్యంగా సుష్మా.. జీవితంలో ఇలాంటి అద్భుత ప్రదర్శన తొలిసారి చూశాను. ఆమె ప్రదర్శన చూశాక మాటలు రావడం లేదు అంటూ హేమమాలిని పర్‌ఫార్మెన్స్ పై ప్రశంసలు కురిపించారు. అసిత్ దేశాయ్ అతని కుమారుడు అలాప్ దేశాయ్‌లు హేమమాలిని నృత్యాన్ని కంపోజ్ చేయగా పాటలను సుదేష్ వాడ్కర్, కవితా కృష్ణమూర్తి, శంకర్ మహదేవన్, మీకాసింగ్ లు కలిసి ఆలపించారు. పవిత్ర గంగా నది చరిత్రని తెలియజేస్తూ, ఆ నది ఎలా కలుషితం అవుతుందనే నేపథ్యంలో ఈ నృత్య ప్రదర్శన సాగింది.

సైబర్ నిపుణుడిపై ఈసీ కేసు

న్యూఢిల్లీ : ఈవీఎంలను బీజేపీ హ్యాక్ చేసిందన్న సైబర్ నిపుణుడు సయ్యద్ షుజాపై కేసు నమోదు అయింది. ఎన్నికల కమిషన్ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు ఢిల్లీ పోలీసులు బుధవారం తెలిపారు. ఈసీ మంగళవారం పార్లమెంటు స్ట్రీట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని అధికారి అన్నారు. ఈవీఎంల డిజైనర్‌నని చెప్పుకునే షుజా ఎన్నికల సమయంలో తాను ఈవీఎంలను హ్యాక్ చేయగలనని సవాల్ విసిరాడు. దీంతో ఈసీ ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. షుజా ప్రకటనలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఉన్నాయని, ఇది 505 సెక్షన్‌ను ఉల్లంఘించడమే అని పేర్కొంది.

బీజేపీకి ఎదురుదెబ్బ తప్పదు : తేజస్వి యాదవ్



న్యూఢిల్లీ : బీజేపీ ప్రభుత్వ ఈబీసీ కోటా ప్రకటన ప్రజలను మోసగించేదిగా ఉన్నట్లు బహుజనులు (మెజారిటీ) భావిస్తున్నారని, ఈ చర్య బెడిసికొడుతుందని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నాయకుడు తేజస్వి యాదవ్ అన్నారు. బుధవారం ఆయన పీటీఐతో మాట్లాడుతూ, జనరల్ కేటగిరి పేదలకు విద్య, ఉద్యోగాలలో పది శాతం రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్ ఈ నెలారంభంలో ఆమోదించింది. రిజర్వేషన్ల ఫలితాలు ఇంకా అందనప్పటికీ, ఈ కులాల కీలక డిమాండును మోడీ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఈ విషయమై ప్రభుత్వం హడావుడిగా తీసుకున్న చర్యను యాదవ్ తీవ్రంగా తప్పుపట్టారు. ఆదరాబాదరాగా నోట్ల రద్దు చేసినట్టు రిజర్వేషన్లను అమలు చేయలేరని, ఇదేమి దారిద్ర్య నిర్మూలన కార్యక్రమం కాదని అన్నారు. ఏ కమిషన్ నివేదిక లేదా సామాజిక, ఆర్థిక సర్వే నివేదిక లేకుండానే ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరించిందని చెప్పారు. 'రాజ్యాంగంలో ఇటువంటి నిబంధనను చేర్చాలంటే ప్రభుత్వం గణాంకాలు, వివరాలను కలిగివుండాలి. కానీ, మోడీ ప్రభుత్వం అటువంటిది కలిగిలేదు. నోట్లరద్దు వలే హడావుడిగా ఈ చర్యను అమలు చేసింది. ఇందుకు పర్యావసనాలను బీజేపీ అనుభవిస్తుంది' అని యాదవ్ చెప్పారు. ఈ తాజా నిర్ణయం ప్రభావం లోక్‌సభ ఎన్నికలపై ఉంటుందా? అన్న ప్రశ్నకు 'బీజేపీకి ఎదురుదెబ్బ తప్పదు' అని తేజస్వి యాదవ్ బదులిచ్చారు.



రిపబ్లిక్‌డే పరేడ్‌లో 'నారీశక్తి'

- తొలి మహిళా డేర్‌డెవిల్‌గా కెప్టెన్ షిఖా సురభి
- మొదటిసారి పాల్గొనున్న ఐఎన్ఏ సీనియర్లు

న్యూఢిల్లీ : రిపబ్లిక్‌డే పరేడ్‌లో ఈసారి 'నారీశక్తి' ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అసోం రైఫిళ్ల దళం నేతృత్వంలో డేర్‌డెవిల్ బృందంలో భాగంగా మహిళా అధికారి ఒకరు బైక్‌పై స్టంట్లతో అబ్బురపర్చనున్నారు. పరేడ్‌కు డిప్యూటీ పరేడ్ కమాండర్ అయిన ఢిల్లీ ఏరియా హెడ్‌క్వార్టర్స్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ మేజర్ జనరల్ రాజ్‌పాల్ పునియా ఆధ్వర్యంలో బుధవారం డ్రస్ రిహార్సెల్స్ జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐఎన్ఏ) సీనియర్లు (90ఏళ్ల పైబడినవారు) పరేడ్‌లో తొలిసారిగా పాల్గొనున్నారన్నారు. 70వ గణతంత్ర వేడుకల్లో ఎం777; అమెరికన్ అల్ట్రాలైట్ హోవిట్జర్స్, కే9 వజ్రాను ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ప్రధాని మేకిన్ ఇండియాకు చిహ్నంగా వజ్రా నిలుస్తుందని పునియా అన్నారు. 'ఈసారి పరేడ్‌లో 'నారీశక్తి' ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. మహిళా దళాలు పరేడ్‌లో పాల్గొనున్నాయి. నేవీ, ఆర్మీ సర్వీసెస్ కార్ప్స్, కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్‌లోని విభాగానికి మహిళా అధికారులు నేతృత్వం వహిస్తారు. అసోం రైఫిళ్ల దళంతో పాటు ఇతర మహిళా దళాలు పాల్గొంటుండటంతో పరేడ్‌లో మహిళల ప్రాతినిధ్యం కనిపించనుంది అని ఒక ప్రశ్నకు సమాధానంగా పునియా చెప్పారు. దేశంలోని అతిపురాతన పారామిలటరీ దళంగా ఉన్న అసోం రైఫిళ్ల దళానికి నేతృత్వం వహించటం గర్వంగా ఉందని మేజర్ ఖుష్బూ కన్వర్ (30) తెలిపారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ 'మహిళా దళానికి నేతృత్వం వహించడం నాకు గర్వకారణం. నేను రాజస్థాన్‌కు చెందిన ఓ బస్సు కండెక్టర్ కుమార్తెను. నేను చేయగలిగానంటే.. ఏ అమ్మాయి అయినా తన కలను సాకారం చేసుకోగలదు' అని అన్నారు. కెప్టెన్ షిఖా సురభి (కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్) బైక్‌పై 'డేర్ డెవిల్' స్టంట్లు చేయనున్నారు. ఆమె మాట్లాడుతూ 'పరేడ్‌లోని డేర్‌డెవిల్ సెగ్మెంట్‌లో స్థానం పొందిన తొలి మహిళగా నిలవడం గర్వకారణం. స్టంట్లను పర్‌ఫెక్ట్‌గా చేసేందుకు చాలా సాధన చేశాను. మహిళలు సంకల్పిస్తే ఏదైన సాధించగలరు' అని జార్ఖండ్‌కు చెందిన ఈ 26ఏళ్ల అధికారి తెలిపారు.

పౌరసత్వ బిల్లుపై ఆగ్రహజ్వాల

- మిజోరంవ్యాప్తంగా ర్యాలీలు
- మోడీ, రాజ్‌నాథ్ దిష్టిబొమ్మల దహనం
- కేంద్రంలో మొదలైన వణుకు



నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన



ఐజ్వాల్‌లో భారీ ర్యాలీ

ఐజ్వాల్ : పౌరసత్వ (సవరణ) బిల్లుపై ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఆగ్రహజ్వాలలను వెళ్లగక్కుతున్నారు. ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి తదితరుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ర్యాలీలు నిర్వహించారు. ప్రధాని, హోంమంత్రి రాజీనామా చేయాలన్న నినాదాలతో హోరెత్తించి కేంద్రంలో వణుకు పుట్టించారు. ఈ బిల్లుపై ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు కేంద్ర హోంశాఖ ప్రయత్నించింది. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల సమ్మతి లేకుండా విదేశీయులకు భారత పౌరసత్వం ఇవ్వబోమని స్పష్టం చేసింది. "ఈశాన్య ప్రాంతంలో తప్ప భారత్‌లో ఎక్కడైనా స్థిరపడేవారికి ప్రోత్సహకాలు కల్పించే ప్రతిపాదన ప్రస్తుతం పరిశీలనలో ఉందని హోంశాఖ తెలిపింది. ఆ శాఖ అధికార ప్రతినిధి అశోక్ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ బిల్లు అభద్రతాభావాన్ని సృష్టించింది. ఈశాన్య ప్రాంతంలో తప్పుడు అవగాహన కలిగించింది. ఈ బిల్లు ఎవరికీ ఆటోమేటిక్‌గా పౌరసత్వం కల్పించదు. ప్రత్యేకించి పేర్కొన్న ప్రాంతాలలోని నిర్దిష్ట కేటగిరికి చెందిన ప్రజలను నిర్దిష్ట నిబంధనలకు లోబడి జోన్ పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటారు. ఎవరూ రాత్రికి రాత్రే భారతీయ పౌరులుగా మారరు' అని చెప్పారు. ఈ బిల్లును నిరసిస్తూ మిజోరంలో బుధవారం వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. ప్రజలు నిరసనజ్వాలను రగిలించారు. విద్యార్థులు, యువకులు, ఇతర వర్గాల ప్రజలు వీధుల్లోకి వచ్చి ఈ బిల్లుపై తమ నిరసనను వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని ఐజ్వాల్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏడు జిల్లా కేంద్రాల్లో, 50 ఇతర ప్రాంతాలలో ఈ నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ వివాదాస్పద బిల్లు మిజోరం ప్రజలకు ఎంతో ముప్పు కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి, హోంమంత్రి రాజీనామా చేయాలని వారు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. మిజో జిర్లాయ్ పవాల్ (ఎంజెడ్‌పీ) లేదా మిజో విద్యార్థి ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి. ఈనెల 8న 11 గంటల బంద్ కూడా నిర్వహించాయి. ఈ బిల్లు ఆమోదం పొందితే 'మిజోరం ప్రజలు పూర్తిగా పరాయీకరణవుతారు' అని ఎంజెడ్‌పీ అధ్యక్షుడు ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్‌ల నుంచి ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండానే భారత్‌కు వచ్చి ఇక్కడ ఆరేళ్లు నివసించిన హిందువులు, జైన్లు, సిక్కులు, బౌద్ధులు, పర్షియన్లకు భారత పౌరసత్వాన్నిచ్చేందుకు వీలు కల్పించే పౌరసత్వ (సవరణ)బిల్లును లోక్‌సభ ఈనెల 8న ఆమోదించిన విషయం తెలిసిందే.

బీజేపీని ఓడిస్తాం..



- బీఎస్పీ, ఎస్పీతో వైరం లేదు
- కలిసి పనిచేస్తాం
- ప్రియాంక సమర్థురాలు.. జ్యోతిరాదిత్య డైనమిక్ నాయకుడు
- అమేథి సభలో రాహుల్‌గాంధీ

అమేథి : బీఎస్పీ, ఎస్పీతో ఎలాంటి వైరం లేదని, ఐక్యంగానే బీజేపీని ఓడిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తెలిపారు. బుధవారం ఆయన తన సొంత నియోజకవర్గమైన అమేథిలో పర్యటించారు. అఖిలేశ్‌తోగానీ, మాయావతితోగానీ ఎలాంటి శత్రుభావం లేదని, బీఎస్పీ, ఎస్పీ, కాంగ్రెస్ సిద్ధాంతాల్లో సారూప్యత ఉందని, బీజేపీని గద్దెదించడమే మూడు పార్టీల లక్ష్యమని, ఇందుకోసం కలిసి పనిచేస్తామని రాహుల్ అన్నారు. తన సోదరి ప్రియాంక గాంధీ క్రియాశీల రాజకీయాల్లోకి రావడం సంతోషంగా ఉందని చెప్పారు. ఉత్తరప్రదేశ్ తూర్పుప్రాంత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంకకు బాధ్యతలు ఇవ్వడాన్ని రాహుల్ స్వాగతించారు. ఇప్పుడు తన సోదరి తనతో కలిసి పనిచేస్తుందంటూ ఆనందం వ్యక్తంచేశారు. ప్రియాంక సమర్థురాలన్నారు. జ్యోతిరాదిత్య సింధియా వంటి డైనమిక్ నాయకుడు, సమర్థురాలైన ప్రియాంకతో కలిసి యూపీ రాజకీయాలను మార్చేస్తామన్నారు. వీరు పార్టీని మరింతగా బలపరుస్తారని ఆకాంక్షించారు. పేదలు, బడుగుల తరపున పోరాడతామని, అభివృద్ధి మిషన్‌తో ముందుకెళతామని చెప్పారు.

వెనక్కుతగ్గేది లేదు...

'ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం ప్రకారం పోరాడతాం. యూపీ యువత కాంగ్రెస్ నుంచి ఆశించినది చేస్తాం. గుజరాత్, యూపీతో సహా ఎక్కడా వెనుకంజ వేయలేదు. వచ్చిన ఏ అవకాశాన్ని పదలకుండా ముందుకుసాగుతాం. యూపీలో నూతన ఆలోచనాధోరణి.. సానుకూల వైఖరి రానున్నది. మేం రాజకీయం చేస్తున్నది ప్రజల కోసమే' అని రాహుల్ అన్నారు. మీరు బీజేపీకి చాలా సమయమిచ్చారని, ఆ పార్టీ రాష్ట్రాన్ని నాశనం చేసినట్లు యువతకు, రైతులకు చెప్పదలిచామన్నారు. రెండ్రోజుల అమేథి పర్యటనలో భాగంగా రాహుల్‌గాంధీ నుక్కడ్ సభతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 24న అతిథిగృహంలో పార్టీ కార్యకర్తలతో రాహుల్ భేటీ అవుతారు. లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లను సమీక్షిస్తారు. రాహుల్ ఈనెల 4నే అమేథిలో పర్యటించాల్సి ఉండగా పార్లమెంటు సమావేశాల కారణంగా ఆయన పర్యటన వాయిదా పడింది. ఆయనతో పాటు యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ కూడా అమేథికి రావాల్సి ఉండగా, అనారోగ్యం కారణంగా ఆమె పర్యటన రద్దు అయింది.

'తదుపరి ప్రధాని రాహుల్' పోస్టర్లతో స్వాగతం

'అమేథికి ఎంపీ, 2019లో ప్రధాని'; 'త్వరలో ప్రధాని కాబోతున్న రాహుల్‌గాంధీకి మిషన్ 2019-విధాన్‌సభ తిలోయ్ స్వాగతం పలుకుతోంది', 'ఇప్పుడు మూడు రాష్ట్రాల్లో గెలిచారు, 2019లో యావత్ దేశాన్ని ఏలుతారు' అనే పోస్టర్లు రాహుల్‌కు స్వాగతం పలికాయి. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ విజయం తర్వాత రాహుల్ అమేథికి రావడం ఇదే తొలిసారి కావడంతో ఆయన మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు ఈ పోస్టర్లతో హల్‌చల్ చేశారు.

అందుకే ప్రియాంక...!



న్యూఢిల్లీ : దేశంలో కునారిల్లుతున్న కాంగ్రెస్‌పార్టీకి జవసత్వాలు కల్పించేందుకే ఆపార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోదరి ప్రియాంక గాంధీ క్రియాశీల రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. వాస్తవంగా ఆమె క్రియాశీల రాజకీయాల్లోకి రావడానికి ఇష్టపడ లేదు. ఎంతమంది విజ్ఞప్తి చేసినా... ఒత్తిడి తెచ్చినా రాజకీయాల్లోకి రావడానికి సుముఖత ప్రదర్శించలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడటంతో ఎలాగైనా బలం పెంచుకోవాలన్న లక్ష్యంతో ప్రియాంకను కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దించినట్టు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఆమె కీలకపాత్ర పోషించేలా కాంగ్రెస్ అత్యంత ప్రాధాన్యతగల ఈ రాజకీయ నిర్ణయం తీసుకున్నది. అంటే ప్రియాంకను కాంగ్రెస్ పార్టీ 'ట్రంప్ కార్డు'గా వాడుకోవాలని భావిస్తోంది. దీనితో పాటు ప్రియాంక క్రియాశీల రాజకీయాల్లోకి రావడానికి కొన్ని బలమైన, స్పష్టమైన కారణాలు ఉన్నాయి.

అచ్చం ఇందిరలా ఉండటం...

సాధారణంగా ప్రియాంకను తరచూ తన నానమ్మ ఇందిరాగాంధీతో పోలుస్తుంటారు. ప్రియాంక రూపురేఖలు, ఆమె ముఖ కవళికలు, హావభావాలు, నడిచే తీరు, చీర ధరించడం. హెయిర్ స్టైల్ అంతా ఇందిరాగాంధీని పోలి ఉంటాయి. అనేక ప్రజావేదికలలో పాలుపంచుకున్న సందర్భాల్లోనూ ప్రియాంక అచ్చం ఇందిరాగాంధీ తరహాలోనే చీర ధరించారు. ఇందిరాగాంధీ వారసత్వాన్ని ప్రియాంక ద్వారా తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందుకు ఆమెను క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకొచ్చింది. ఎన్నికలకు సంబంధించి ఉత్తర ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ కాంగ్రెస్‌కు బలమైన స్థానంగా భావిస్తున్నారు. ఇక్కడి నుంచి సోనియా గాంధీ ఇప్పటిదాకా ఎంపీగా విజయం సాధించారు. ప్రస్తుతం సోనియా ఆరోగ్య పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఈసారి ఎన్నికల్లో సోనియాగాంధీ పోటీ చేసే పరిస్థితి కనిపించడం లేదు. సంప్రదాయబద్ధంగా తమకు లభించిన రాయ్‌బరేలీ సీటును కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రియాంకను రంగంలోకి దించినట్టు తెలుస్తోంది. యూపీలో పటిష్టవంతం కావడం ద్వారానే కేంద్రంలో అధికారానికి దగ్గర కావాలని కాంగ్రెస్ బలంగా కోరుకుంటున్నది. ప్రత్యేకించి యూపీ తూర్పు ప్రాంత బాధ్యతలు ప్రియాంకకు అప్పగించడానికి ప్రధాన కారణం ఇదే. ఒకవేళ ప్రియాంక క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటే అమేథీ, రాయ్‌బరేలీ స్థానాల్లో ఎన్నికల ప్రచారానికే పరిమితం కావాల్సి వస్తుంది.

కార్యకర్తలు, ప్రజల్లో ప్రజాదరణ

ప్రియాంకగాంధీని క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సుదీర్ఘకాలంగా డిమాండు చేస్తున్నారు. కాంగ్రెస్‌లో ప్రస్తుతం ఉన్న గాంధీ కుటుంబసభ్యుల్లో అత్యంత ప్రజాదరణ ప్రియాంకకు ఉందని ఆ పార్టీ బలంగా నమ్ముతోంది. తమ కార్యకర్తల డిమాండ్లు ఓ వైపు... ప్రియాంకకు లభిస్తున్న ప్రజాదరణను పరిగణనలోకి తీసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆమె ద్వారా పార్టీకి పూర్వ వైభవం తెచ్చుకోవాలని కోరుకుంటున్నది. యూపీలో కోల్పోయిన ప్రతిష్టను తిరిగి పొందడానికి ప్రియాంక దోహదపడుతుందని భావిస్తోంది.

కూటమిని ఆకర్షించేందుకే..

ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘోరపరాభవం చవిచూసింది. మూడు కీలక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకుంది. దీనితో పాటు దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోడీ ప్రభ తగ్గుతోంది. ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వస్తున్నాయి. బీజేపీ ఓటమే లక్ష్యంగా పెద్దఎత్తున చర్చలు జరుగుతున్నాయి. మహాకూటమి ప్రయత్నాలు ఊపందుకున్నాయి. అయితే, నాయకత్వం విషయంలో కాంగ్రెస్‌పై విపక్షాల్లో ఏకాభిప్రాయం రావడం లేదు. మహాకూటమిలో కీలక పాత్ర పోషించాలని కోరుకుంటున్నా అందుకు అవసరమైన సంఖ్యాబలం కాంగ్రెస్‌కు కనిపించడం లేదు. కూటమి నాయకుల్లో అత్యధికులు తామే కీలకమని చెప్పుకుంటున్నారు. మరోవైపు, యూపీలో కాంగ్రెస్‌ను పక్కనపెట్టి ఎస్పీ, బీఎస్పీ పొత్తు ఖరారు చేసుకున్నాయి. కాంగ్రెస్‌పై బీఎస్పీ అధినేత్రి మాయావతి ఒంటికాలుపై లేస్తున్నారు. బీహార్‌లో సంకీర్ణం నుంచి కాంగ్రెస్‌ను తప్పించారు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన మమతా బెనర్జీ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అక్కడా కాంగ్రెస్‌కు పెద్ద ప్రాధాన్యత లభించలేదు. మహాకూటమికి తమను దూరంగా ఉంచడం కాంగ్రెస్‌లో ఆందోళన పెంచింది. ఈ పరిణామాలు ప్రియాంక క్రియాశీల రాజకీయాలకు ఊతమిచ్చాయి. వాస్తవంగా ఇప్పటి దాకా ప్రియాంక క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి సంబంధించి అనేక కీలక నిర్ణయాల్లో ఆమె భాగస్వామ్యం ఉంది. ఇదంతా తెర వెనుక రాజకీయమే. తెరముందుకు వచ్చిన దాఖలాలు లేవు. అందుకే ఇక నుంచి ప్రజల్లో ఉండే రాజకీయాలు చేయాలని ప్రియాంకను రంగంలోకి దించారు.

ఈవీఎంలు భేష్ : నితీష్



పాట్నా : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల)పై అనుమానాలు వ్యక్తమౌతుండగా, బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ వాటిని సమర్థించారు. 'అవి బాగా పనిచేస్తున్నాయి. ఓటును వినియోగించుకునే ప్రజల హక్కును బలోపేతం చేస్తున్నాయి' అని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు వెరిఫబుల్ పేపరు ఆడిట్ ట్రెయిల్స్ (వీవీపాట్)లు అందుబాటులో ఉంచితే ఎటువంటి సమస్యలు తలెత్తబోవని ఆయన చెప్పారు. ఎంపీఎంలపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. ఈ విమర్శలతో ఏకీభవించనని నితీష్ అన్నారు. ఇతర ప్రతిపక్ష పార్టీలతో పాటు కాంగ్రెస్ కూడా ఈవీఎంలను విమర్శించడాన్ని ఆయన ప్రస్తావిస్తూ, 'ఎవరి హయాంలో ఈవీఎం వ్యవస్థను ప్రవేశపెట్టారు?" అని ప్రశ్నించారు. 'ఈవీఎంల వినియోగంపై నా వైఖరి సుస్పష్టం. ఈవీఎంలు కచ్చితంగా మంచివి. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీవీపాట్‌లు అందుబాటులో ఉంచితే ఏ సమస్య ఉండదు. ఈవీఎంలకు సంబంధించి చేసే విమర్శలతో ఏకీభవించను. ఓటుహక్కుకు సంబంధించి ప్రజల హక్కును బలోపేతం చేస్తుందని ఈవీఎంలకు సంబంధించి నా అభిప్రాయం' అని నితీష్ అన్నారు. 122వ జయంతి సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఆయన నివాళులర్పించారు. బోగస్ ఓట్లు, పోలింగ్ కేంద్రాల ఆక్రమణ వంటి ఘటనలు బ్యాలెట్ పేపర్లు ఉన్నప్పుడు చోటుచేసుకున్నాయనీ, ఈవీఎంలను ప్రవేశపెట్టిన తరువాత ఇటువంటి ఘటనలు తగ్గాయని, వీవీపాట్‌లతో మరింత తగ్గుతాయని నితీష్ అభిప్రాయపడ్డారు.

జాతీయ పార్టీలకు 50శాతం 'అజ్ఞాత' నిధులు : ఏడీఆర్

న్యూఢిల్లీ : జాతీయ పార్టీలకు 2017-18 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నిధులలో 50శాతం 'అజ్ఞాత' వర్గాల నుంచి వచ్చినవిగా ఎలక్షన్ వాచ్‌డాగ్ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తెలిపింది. ఈ మేరకు బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, బీఎస్పీ, టీఎంసీ, ఎన్‌సీపీలపై విశ్లేషణ ఆధారిత నివేదికను బుధవారం విడుదల చేసింది. ఆరు పార్టీల ఐటీ రిటర్న్స్, ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన సమాచారం ఆధారంగా 2017-18లో వాటి మొత్తం ఆదాయం రూ.1293.05 కోట్లని తేల్చింది. ఈ పార్టీలకు అజ్ఞాత వర్గాల నుంచి రూ.689.44కోట్లు వచ్చాయని, ఇది మొత్తం ఆదాయంలో 53శాతమని తెలిపింది. రూ.553.38 కోట్ల 'అజ్ఞాత' ఆదాయం వచ్చినట్టు బీజేపీ ప్రకటించిందని, ఇది మిగతా జాతీయ పార్టీలకు ఇతరత్రా వర్గాల నుంచి వచ్చిన ఆదాయంలో 80శాతమని పేర్కొంది. రూ. 689.44కోట్లలో రూ.215 కోట్లు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చినట్టు తెలిపింది. స్వచ్ఛందంగా వచ్చే (రూ.20వేల లోపు) 'అజ్ఞాత' నిధుల ద్వారా 51శాతానికి మించి అంటే రూ.354.22 కోట్ల ఆదాయాన్ని ఈ పార్టీలు పొందాయని తెలిపింది. ఇతర మార్గాల్లో రూ.4.5కోట్లు వచ్చినట్టు వెల్లడించింది. ఎన్నికల కమిషన్ వద్ద పొందుపర్చిన ఆయా దాతల వివరాలు ఆధారంగా 'తెలిసిన' వర్గాల నుంచి రూ.467.13 కోట్లు వచ్చాయని పేర్కొంది. ఆస్తుల విక్రయాలు, ప్రచురణలు, సభ్యత్వ రుసుము, బ్యాంకు వడ్డీ, పార్టీ లెవీ రూపేణ రూ.136.48కోట్ల ఆదాయం వచ్చినట్టు ఏడీఆర్ పేర్కొంది. రూ.20వేలకు మించిన విరాళాల వివరాల ఆధారంగా జాతీయ పార్టీలకు నగదు రూపేణ రూ.16.80లక్షలు మాత్రమే వచ్చినట్టు తెలిపింది. ఏడీఆర్ విశ్లేషించిన జాతీయ పార్టీల జాబితాలో సీపీఎం లేదు. ఆ పార్టీకి సంబంధించిన 2017-18 ఆర్థిక సంవత్సర ఆదాయ వివరాలు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం. అయితే, ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారం రూ.20వేల లోపు విరాళాలు ఇచ్చే దాతలు, సంస్థల పేర్లతో పాటు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చే నిధుల వివరాలను జాతీయ పార్టీలు వెల్లడించాల్సిన అవసరం లేదు.

ఎన్నికలకు ఈశాన్యం సంసిద్ధం

- ఏర్పాట్లపై ప్రభుత్వ, పోలీసు అధికారులతో ఈసీ సమీక్ష
- 60 సీఏపీఎఫ్ కంపెనీలను మోహరించాలి..
- సీఈసీని కోరిన అరుణాచల్ ప్రదేశ్



ఇటానగర్ : త్వరలో జరగబోయే లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలకు అన్ని రాష్ట్రాలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లు మొదలు పెట్టాయి. ఈ క్రమంలో సీఈసీ సునీల్ అరోరాతో కలిసి కేంద్ర ఎన్నికల కమిషనర్ అశోక్ లావసా ఈశాన్య రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, సీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లపై అధికారుల నుంచి స్టేటస్ రిపోర్టులు తీసుకున్నారు.

ఎన్నికల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, 60 కేంద్ర సాయుధ పోలీసు దళం (సీఏపీఎఫ్) కంపెనీలను మోహరించాలని అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యగోపాల్ ఈ సందర్భంగా సీఈసీని కోరారు. సమస్యాత్మక నియోజకవర్గాలను గుర్తించినట్టు తెలిపారు. ఆయా చోట్ల తగు భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇండో-మయన్మార్ సరిహద్దు వెంబడి, పక్కనే ఉన్న అసోంపై నిఘా పెట్టాలని కోరారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సత్యగోపాల్ తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీఐ) మార్గదర్శకాల ప్రకారం అధికారులు, పోలీసుల బదిలీలు, నియామకాలను చేపట్టినట్టు తెలిపారు. సిబ్బంది కొరత ఉన్న జిల్లాల్లో ఫిబ్రవరి మొదటి వారంలోగా సరిపడ యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లతో పాటు నోడల్ అధికారుల నియామకాల ప్రతిపాదనను ఈసీఐ పరిశీలనకు పంపామని, శాంతి భద్రతలు, ఎన్నికల నిర్వహణ కోసం బడ్జెట్‌ను సిద్ధం చేశామని సత్యగోపాల్ తెలిపారు.


ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్ : కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో బుధవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ముగ్గురు ఉగ్రవాదులను సైన్యం మట్టుబెట్టిందని పోలీసులు తెలిపారు. ఆ ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నట్టు ముందుగా అందిన సమాచారం మేరకు భద్రతాదళాలు మోహరించి గాలింపు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఉగ్రవాదులు, భద్రతాదళాల మధ్య కాల్పులు హోరాహోరీగా జరిగాయన్నారు. ముగ్గురు ఉగ్రవాదులు హతమైనట్టు తెలిపారు. ఘటనాస్థలం నుంచి ఆయుధాలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

యూనిటెక్ ప్రమోటర్లకు సుప్రీంలో చుక్కెదురు


న్యూఢిల్లీ : యూనిటెక్ ప్రమోటర్లకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఇళ్ల కొనుగోలుదారుల నగదును దారి మళ్లించిన యూనిటెక్ ప్రమోటర్లు సంజయ్ చంద్ర, అజయ్ చంద్రకు సుప్రీంకోర్టు బెయిల్ తిరస్కరించింది. 2017, అక్టోబరు 30 నాటికి రూ.750 కోట్లు అత్యున్నత న్యాయస్థానం రిజిస్ట్రీలో డిపాజిట్ చేయాలన్న ఆదేశాలను బేఖాతరు చేయడంతో న్యాయమూర్తులు డీవై చంద్రచూడ్, హేమంత గుప్తాలతో కూడిన ధర్మాసనం వారికి బెయిల్ నిరాకరించింది. నిందితులు ఏడాదిన్నరపాటు తీహార్ జైల్లో గడిపారు. ప్రస్తుతానికి వారు రూ.400 కోట్లు డిపాజిట్ చేశారు. 2015లో 158 మంది గురుగ్రామ్‌లో యూనిటెక్ ప్రాజెక్టు నిర్మించిన వైల్డ్‌ఫ్లవర్ కంట్రీ, అంథేయా ప్రాజెక్టుల్లో ఇళ్ల కొనుగోలుదారులు ఇచ్చిన ఫిర్యాదులో బెయిల్ కోసం ఎదురు చూస్తున్నారు.

వికలాంగుల హక్కుల సాధనకు
31న చలో విజయవాడ



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : వికలాంగులకు పింఛన్ కాకుండా గౌరవవేతనంగా ప్రతినెలా 5వేల రూపాయలు ఇవ్వాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలన్నారు. వికలాంగుల సంక్షేమ పథకాల అమలులో శ్లాబ్ విధానం రద్దు చేయాలన్నారు. వికలాంగుల హక్కుల సాధన కోసం ఈ నెల 31వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మహాధర్నా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరావు, కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, విజయవాడ నగర అధ్యక్షుడు తిరుపతిరావు, మహిళా అధ్యక్షురాలు సుజాత, నాయకులు స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం
యువతి మృతి.. యువకుని పరిస్థితి విషమం



విశాలాంధ్ర - మల్కాపురం : విశాఖ జిల్లా పారిశ్రామికప్రాంతం 49వ వార్డు, మల్కాపురం దరి జైఆంధ్రా కాలనీలో బుధవారం ఉదయం ఓ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానికంగా సంచలనం రేపింది. జై ఆంధ్రా కాలనీలో నివాసముంటున్న కొవ్వాడ దేవి(22), అదే ప్రాంతానికి చెందిన ఆర్. భానుప్రశాంత్ (24) గత కొన్నేళ్ళుగా ప్రేమించుకుంటున్నారు. దేవి డిగ్రీ ఫైనలియర్ చదువుతుండగా, భానుప్రశాంత్ ఐటీఐ పూర్తి చేసి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరి పెళ్ళికి దేవి ఇంట్లో నో చెప్పడమే కాక దేవికి వేరే సంబంధం కుదిర్చి నిశ్చితార్థం కూడా చేశారు. ఈ విషయాన్ని భానుప్రశాంత్‌కు చెప్పి తీవ్ర మనోవేదనకు గురైంది. కలిసి జీవించలేమని నిర్ధారించుకున్న వీరిద్దరూ ఎవరింటికి వారు వెళ్ళి ఫ్యానుకు ఉరివేసుకున్నారు. దేవి ఇంట్లోని వారు గమనించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ఆసుపత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించిందని కేజీహెచ్‌కు తరలించమని చెప్పారు. తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. కాగా, భానుప్రశాంత్‌ను ఇంట్లోని వారు గమనించి రక్షించడంతో ప్రాణాపాయం తప్పింది. భానుప్రశాంత్ స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు బంధువులు తెలిపారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దేవి మృతదేహాన్ని పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.


19న మాదిగల విశ్వరూప మహాసభ

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : రాష్ట్రవ్యాప్తంగా మాదిగ, రెల్లి కులాలు, వాటి ఉపకులాల ఆధ్వర్యంలో అమరావతిలో ఫిబ్రవరి 19న జరగబోయే మాదిగ విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. విశాఖలోని ఓ హోటల్లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తెలంగాణాలో నడిచినా, ఏపీలో గెలిచినా అది కేవలం మాదిగ, రెల్లి, వాటి ఉపకులాల దయతోనే అన్న విషయం మరిచిపోయి మాలలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. 2014లో జూపూడి ప్రభాకరరావుకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టినప్పటి నుంచి స్వరం మార్చారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 41 లక్షల మంది మాలలు ఉంటే, 39 లక్షలమంది మాదిగలు, 6 లక్షల మంది రెల్లి కులస్తులున్నారని గుర్తుచేశారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నలభైవేల కోట్లు కేటాయించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ తమ వర్గానికి నాలుగు వందల కోట్లు కూడా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ, మంత్రి నక్కా ఆనందబాబు, క్రైస్తవ మైనారిటీశాఖ చైర్మన్ తదితరులంతా మాల కులస్తులేనని అందుకే తమకు అన్యాయం జరుగుతోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణకు, తెలంగాణాలో ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా వర్గీకరణకు అంగీకరించిన చంద్రబాబు కేవలం ఒక్క నవ్యాంధ్రప్రదేశ్‌లో ఎందుకు వ్యతిరేకంగా ఉన్నారని ప్రశ్నించారు.

ఏసీబీ వలలో సోంపేట వీఆర్ఓ

విశాలాంధ్ర - సోంపేట రూరల్ : శ్రీకాకుళం జిల్లా సోంపేట మండల తహశీల్దార్ కార్యాలయంలో మరో అవినీతి అధికారి బుధవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. సోంపేట మేజర్ పంచాయతీ వీఆర్వోగా పనిచేస్తున్న గుంట కృష్ణదాస్ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో సోంపేటకు చెందిన తూముల వినోదకృష్ణ నుంచి భూమి బదలాయింపు నిమిత్తం రూ.10వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రాజేంద్ర ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వినోదకృష్ణకు తన తండ్రి నుంచి వచ్చిన మూడు ఎకరాల వ్యవసాయ భూమి బారువా రెవెన్యూ పరిధిలో ఉంది. ఆ భూమి తన తండ్రి నుంచి తనకు వచ్చిందని, దాన్ని తన పేరుమీదకు మార్చాలని ఈ నెల 4న మీసేవలో దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించి వివరాలు సేకరించాలని బారువా ఇన్‌చార్జ్ వీఆర్వో క్రిష్ణదాస్‌కు అప్పగించారు. తన పనిని వేగంగా పూర్తిచేయాలని వీఆర్వోను వినోద్‌కృష్ణ అడిగాడు. అయితే ఈ పని జరగాలంటే తనకు రూ.15 వేలు లంచంగా ఇస్తే పని పూర్తిచేస్తానని వీఆర్వో చెప్పాడు. దీంతో వినోదకృష్ణ చేసేదిలేక రూ. 10 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ తర్వాత లంచం ఇవ్వడం ఇష్టం లేక వినోదకృష్ణ శ్రీకాకుళం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఏసీబీ అధికారులు వలపన్ని లంచం తీసుకుంటున్న వీఆర్వోను పట్టుకున్నారు.

ఢిల్లీ రిపబ్లిక్‌డే పెరేడ్‌కు ముత్యాలపాడు వాసి



విశాలాంధ్ర - చాగలమర్రి రూరల్ : కర్నూలు జిల్లా చాగల మర్రి మండలం ముత్యాలపాడు గ్రామానికి చెందిన నాగేశ్వర రావుకు ఈ నెల 26న ఢిల్లీలోని ఎర్రకోట రిపబ్లిక్‌డే పెరేడ్‌లో పాల్గొనే అరుదైన అవకాశం లభించింది. ముత్యాలపాడుకు చెందిన శ్రీనివాసులు, వెంకటేశ్వరమ్మ దంపతుల కుమారుడు నాగేశ్వరరావు ఎన్‌సీసీ నిర్వహించిన గుర్రపుస్వారీ పోటీలలో బంగారు పతకం సాధించాడు. నాగేశ్వరరావు పదవతరగతి ఆళ్లగడ్డ భారతి విద్యా మందిరంలో, ఇంటర్మీడియెట్ కడప సెంట్‌జోసఫ్ కళాశాలలో పూర్తిచేసి, ప్రస్తుతం తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో బీఏ డిగ్రీ తృతీయ సంవత్సరం అభ్యసిస్తున్నాడు. ఈ నెల 26న ఎర్రకోటలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే రిపబ్లిక్‌డే పెరేడ్‌లో రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకోబోతున్నాడు. నాగేశ్వరరావును ఎంపీపీ మస్తాన్‌వలీ, మాజీ సర్పంచ్ స్వప్న, తహశీల్దార్ మాలకొండయ్య, ఎంపీడీవో రాణెమ్మ, ఎంఈవో అనూరాధ, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ప్రశంసించారు.

ఉద్యోగులకు వైద్యం బంద్ !

- పెన్షనర్లు, జర్నలిస్టులకూ సేవల నిలిపివేత
- బకాయిలు చెల్లించని ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు
- చేతులెత్తేసిన కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు

విశాలాంధ్ర బ్యూరో - విజయనగరం : ఉద్యోగులకు, పెన్షనర్లకు, జర్నలిస్టులకు కార్పొరేట్ ఆసుపత్రులు వైద్య సేవలు నిలిపివేయడంతో వేతన జీవులంతా నానా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) కింద సేవలు 20 రోజుల నుంచి ఆగిపోవడంతో కార్డుదారులు అవస్థలు పడుతున్నారు. డబ్బులిచ్చి వైద్యం చేయించుకోలేని పెన్షనర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు జర్నలిస్టులకు హెల్త్‌కార్డులపై సేవలు నిలిచిపోవడంతో వీరంతా అనివార్య పరిస్థితుల్లో సొంత డబ్బుతో వైద్యం చేయించుకుంటున్నారు. స్తోమత లేని వారు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు కార్పొరేట్ ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో జనవరి ఒకటో తేదీ నుంచే సేవలను నిలిపివేశాయి. ఎప్పుడో ఒకప్పుడు బిల్లులు వస్తాయన్న ఆశతో అక్కడక్కడా చిన్నచిన్న ఆసుపత్రుల్లో మాత్రమే ఈహెచ్ఎస్ ద్వారా సేవలు అందుతున్నాయి. రాష్ట్రంలోని పెద్దపెద్ద కార్పొరేట్ ఆసుపత్రులన్నీ ఒక నిర్ణయానికి రావడంతో కొత్త



ఎన్టీఆర్ వైద్యసేవ

ఏడాది నుంచి ఆపివేశాయి. బకాయిలు సుమారు రూ.500 కోట్లకు చేరడంతో రాష్ట్రవ్యాప్తంగా సామాన్యులకు ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ), ఉద్యోగులకు ఇచ్చే ఈహెచ్ఎస్ సేవలు, పింఛనర్లకు, జర్నలిస్టులకు హెల్త్‌కార్డుల ద్వారా సేవలను నిలిపివేశాయి. ఆరోగ్యశ్రీ సేవలు ఆగిపోవడంతో ప్రభుత్వ పెద్దలు హుటాహుటిన రంగంలోకి దిగి కార్పొరేట్ ఆసుపత్రులతో చర్చలు జరిపారు. తక్షణమే కొంత మొత్తం విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో జనవరి 11 నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ)ను మాత్రం తాత్కాలికంగా పునరుద్ధరించారు.

ఉద్యోగులు, పెన్షనర్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేటికీ వైద్య సేవలు పునరుద్ధరణ కాలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.5 లక్షల మంది ఉద్యోగులు, మరో 4 లక్షల మంది కుటుంబ పింఛన్‌దారులతోపాటు, దాదాపు 18 వేల మంది జర్నలిస్టులు ఇబ్బంది పడుతున్నారు. పొరుగురాష్ట్రం తెలంగాణాతోపాటు మన రాష్ట్రంతో కలిపి దాదాపు 551 నెట్‌వర్కు ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. వీటిలో వంద వరకు ప్రభుత్వాసుపత్రులు కాగా, మిగిలిన వాటిలో దాదాపు 300కి పైగానే కార్పొరేట్ ఆసుపత్రులు ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో ఎక్కడా ప్రస్తుతం ఉద్యోగులకు, పెన్షనర్లకు, జర్నలిస్టులకు సేవలు అందటం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే తప్ప సేవలను పునరుద్ధరించే ప్రసక్తే లేదని కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ హామీ మేరకు ప్రస్తుతం పేదలకు అక్కడక్కడా సేవలు అందుతుండటంతో సర్కారు పెద్దలు పట్టించుకోవడమే మానేశారు.

నేటి నుంచి జాతీయ స్థాయి
డ్యూ బాల్ పోటీలు

విశాలాంధ్ర - కర్నూలు కలెక్టరేట్ : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో మూడవ జాతీయస్థాయి సబ్ జూనియర్ డ్యూ బాల్ చాంపియన్‌షిప్ ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు కర్నూలులో జరగనున్నదని నిర్వాహకులు రామాంజనేయులు, అవినాష్ శెట్టి, కిరణ్ కుమార్ స్టాలిన్ బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిన 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఈ మేరకు డ్యూ బాల్ క్రీడా ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దామని, జోసఫ్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు, సాంఘిక సంక్షేమ సంఘం దిన్నె దేవరపాడు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు 20 రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ చేయనున్నట్లు తెలిపారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త టీజీ భరత్, స్పోర్ట్స్ అథారిటీ సీఈవో సుధాకర్ రెడ్డి, ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రశాంతి, భారత్ ఆగ్రో ఏజన్సీస్ అధినేత వాజిద్ హుస్సేన్, భారత డ్యూ బాల్ ఫెడరేషన్ అధికారులు, బంగ్లాదేశ్ డ్యూ బాల్ ఫెడరేషన్ అధికారులు, వివిధ రాష్ట్రాలకు చెందిన అసోసియేషన్ కార్యదర్శులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన విద్యాకుసుమాలు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. కమలాయిపుట్టుగ గ్రామానికి చెందిన బచ్చు సాయిప్రసాద్ మెయిన్స్‌లో 99.98 శాతం మార్కులు సాధించి కేంపస్ టాపర్‌గా నిలిచాడు. తండ్రి జగ్గారావు వృత్తి రీత్యా న్యాయవాదిగా, తల్లి హేమలత ఉపాధ్యాయురాలిగా ఉన్నారు. పదో తరగతిలో పదికి పది పాయింట్లు సంపాదించుకుని ఐఐటీ సీటు దక్కించుకునే లక్ష్యంతో చదువుతున్న సాయి ప్రసాద్ మ్యాథ్స్, ఫిజిక్స్ పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుంటాడు. స్థానిక ముత్యాలమ్మ పేటకు చెందిన పిలక విశ్వనాథం, భారతిల కుమారుడు కౌశిక్ 95.7శాతం మార్కులు సాధించాడు. స్థానిక జ్ఞానభారతిలో చదివి పదికి పది పాయింట్లు సాధించుకున్నాడు.

టీజీ దుమారం

- టీడీపీ, జనసేనలు కలిసే అవకాశాలున్నాయన్న వెంకటేష్
- పార్టీ పాలసీలపై వ్యక్తిగత ప్రకటనలు సరికాదంటూ చంద్రబాబు ఆగ్రహం
- ప్రజల మనోభావాలతో ఆడుకోవద్దంటూ పవన్‌కళ్యాణ్ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ బుధవారం మీడియా ఎదుట చేసిన వ్యాఖ్యలు టీడీపీ, జనసేన పార్టీల్లో దుమారం రేపాయి. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసే అవకాశాలు మెండుగా ఉన్నాయని టీజీ చేసిన సంచలన వ్యాఖ్యలపై పవన్‌కళ్యాణ్ తీవ్ర ఆగ్ర హం వ్యక్తం చేయగా, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కూడా పార్టీ పాలసీలపై వ్యక్తిగత ప్రకటనలు సరికాదంటూ ఘాటుగా హెచ్చరించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో బుధవారం ముఖ్య మంత్రి చంద్రబాబును కలిసిన టీజీ అనంతరం మీడియాతో మాట్లాడారు. టీడీపీ, జనసేనల మధ్య పెద్దగా విభేదాలు లేవని, కేవలం కేంద్రంపై పోరాటం చేసే విషయంలోనే తేడాలున్నాయని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ తనకు సీఎం కుర్చీపై ఆశ లేదని ఎప్పుడో చెప్పారని గుర్తు చేశారు. పాము-ముంగిసలా ఉండే ఎస్పీ, బీఎస్పీ కలిసినప్పుడు టీడీపీ, జనసేనలు కలిస్తే తప్పే ముందని ప్రశ్నించారు. మార్చిలో ఇరువురు మధ్య సీట్ల సర్దుబాటు విషయంలో చర్చలు జరగొచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కర్నూలు అసెంబ్లీ సీటు విషయంలో సర్వే నివేదికలను బట్టే పార్టీ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. సర్వేల్లో టీజీ భరత్‌కి ఎక్కువ ప్రజాదరణ వస్తే కర్నూలు అసెంబ్లీ టికెట్ భరత్‌కే ఇవ్వాలని సీఎంను కోరినట్లు చెప్పారు. ఒకవేళ ఎస్వీ మోహన్ రెడ్డికి ఎక్కువ ప్రజాదరణ వస్తే ఆయనకే ఇవ్వాలని కూడా సీఎంను కోరినట్లు వెల్లడించారు. కాగా పాడేరు పర్యటనలో ఉన్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో టీజీపై మండిపడ్డారు. మేం వద్దనుకుని వదిలేసిన రాజ్యసభ సీటుతో పార్ల మెంటు సభ్యులైన టీజీ వెంకటేష్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. పరిశ్రమ లతో పర్యావరణానికి హాని చేసి నదులను కలుషితం చేసిన వెంకటేష్, ఇకనైనా పనికొచ్చే మాటలు మాట్లాడాలని హితవు చెప్పారు. ప్రజల మనోభావాలతో ఆడుకోవద్దంటూ ఘాటుగా హెచ్చరించారు. మరోవైపు టీజీ చేసిన వివాదస్పద వ్యాఖ్యలపై టీడీపీ అధినేత చంద్రబాబు సైతం సీరియస్ అయ్యారు. పార్టీ పాలసీ విధానాలపై వ్యక్తిగత ప్రకటనలు సరికాదని, ఈ తరహా ప్రకటనలతో అయోమయానికి గురిచేయొద్దని హెచ్చరించారు. పార్టీ విధానాలపై కామెంట్లు చేసేటప్పుడు నేతలు సంయమనం కోల్పోవద్దని సూచించారు. ఎన్నికల తరుణంలో ఇలాంటి కామెంట్లతో గందరగోళం సృష్టిస్తే ఎవరికీ మంచిది కాదని చంద్రబాబు హితవు చెప్పారు. అయితే తాను మాట్లాడిన మాటలను పూర్తిగా విని పవన్ స్పందించి ఉంటే బాగుండేదని సీఎం ఇంటి దగ్గర టీజీ వెంకటేష్ మరో మారు మీడియా ఎదుట వివరణ ఇచ్చారు. లీడర్లకు ఆవేశం పనికి రాదని, ఆవేశం తగ్గించుకుంటే పవన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యకర్తలకు ఆవేశం ఉండొచ్చు కానీ, లీడర్లకు ఆవేశం ఉండకూడదన్నారు. పొత్తులపై ఆయా పార్టీల బాస్‌లే నిర్ణయిస్తారని చెప్పానని తెలిపారు. తనను పెద్ద మనిషి అన్నాడు కాబట్టే, పెద్ద మనిషిగా పవన్‌కు చెబుతున్నానని టీజీ వెల్లడించారు.

విమాన ప్రయాణాలకు మొగ్గు

- డొమెస్టిక్ కార్గోలో 17.5 శాతం వృద్ధి
- అంతర్జాతీయ కార్గో రెట్టింపు ఆదాయం
- విశాఖ విమానాశ్రయానికి కొత్త కళ

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : విశాఖపట్నం విమానాశ్రయం ఆదాయంలో దూసుకుపోతోంది. ప్రయాణికులు, సరకు రవాణాలోనూ మంచి ప్రగతి సాధిస్తోంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు తొమ్మిది నెలల కాలంలో 21,43,863 మంది ప్రయాణించారు. ఈ సంఖ్య గత ఏడాది ఇదే కాలంతో పోల్చుకుంటే 18.52 శాతం అధికం. 2017 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 29,38,889 మంది ప్రయాణిస్తే, 2018లో వివిధ ప్రాంతాల నుంచి 10,15,054 మంది విశాఖ వచ్చారు. దేశంలో వివిధ ప్రాంతాలకు 10,18,495 మంది వెళ్ళారు. వివిధ దేశాల నుంచి 53,598 మంది ప్రయాణికులు ఇక్కడకు రాగా, విదేశాలకు 58,776 మంది వెళ్లారు.

విశాఖ నుంచి వివిధ నగరాలకు 2017 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 3,260 టన్నుల డొమెస్టిక్ కార్గో చేరవేసింది. 2018లో ఇదే కాలానికి 3,83,353 టన్నులు తరలించారు. సరుకు రవాణాలో 17.5 శాతం వృద్ధి నమోదు అయ్యింది.

విదేశాలకు సరకు తరలించే అంతర్జాతీయ కార్గో 2018లో రెట్టింపయింది. 2017 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 1,88,337 కిలోలు పంపించగా, 2018లో ఇదే కాలానికి 3,81,347 కిలోల మెటీరియల్ ఎగుమతి చేశారు. అంతకు ముందు ఏడాదితో పోల్చుకుంటే 102.48 శాతం అధికం.

రెండు కొత్త సర్వీసులు

విశాఖ నుంచి రెండు కొత్త విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయని ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.కుమారరాజా, ఓ.నరేష్‌కుమార్, డీఎస్ వర్మ తెలిపారు. విస్తార సంస్థ ఢిల్లీకి, గో ఎయిర్ సంస్థ హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు సర్వీసులు నడపనున్నాయన్నారు. వీటికి సంబంధించిన వేసవి షెడ్యూల్‌ను సమర్పించామన్నారు.

విమాన ప్రయాణికుల వివరాలు నెలవారీగా...

నెల	2017	2018	పెరుగుదల శాతం
ఏప్రిల్	1,96,406	2,33,350	18.8 శాతం
మే	2,31,586	2,48,321	7.2 శాతం
జూన్	2,08,924	2,30,301	10.2 శాతం
జూలై	1,88,628	2,36,158	25.2 శాతం
ఆగస్టు	1,82,866	2,36,256	29.2 శాతం
సెప్టెంబర్	1,78,281	2,26,250	26.9 శాతం
అక్టోబర్	2,02,329	2,46,040	21.6 శాతం
నవంబర్	2,00,063	2,20,586	10.3 శాతం
డిసెంబర్	2,19,816	2,66,601	21.3 శాతం

కుంభకోణాలే జగన్ నవరత్నాలు
ఆర్థికమంత్రి యనమల ఎద్దేవా

విశాలాంధ్రబ్యూరో- అమరావతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నవ రత్నాలను టీడీపీ కాపీ కొట్టిందని ఆ పార్టీ నేతలు చేస్తున్న విమర్శలపై ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు బుధవారం ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుంభకోణాలే జగన్మోహన్ రెడ్డి నవరత్నాలని, ఆయన నేరాలను కాపీకొట్టడం ఎవరి తరమూ కాదని, హార్వర్డ్ యూనివర్సిటీలో జగన్ అవినీతి ఒక సబ్జెక్టుగా పెట్టాలని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రకటించినవి నవ రత్నాలు కాదు జగన్ అష్టావక్ర దోపిడీలని విమర్శించారు. ఎమ్మార్ కుంభకోణం, టైటానియం, వోక్స్ వ్యాగన్, మద్యం, ముగ్గురాయి, బాక్సైట్, ఇనుప ఖనిజం, వాన్ పిక్, లేపాక్షి, జలయజ్ఞాన్ని ధన యజ్ఞంగా మార్చిన కుంభకోణాలన్నీ జగన్ రత్నాలేనని పేర్కొన్నారు. రూ.లక్ష కోట్లు, 13ఛార్జి షీట్లు, 16నెలల జైలు...ఇవి తప్ప జగన్ సాధించింది ఏముందని ప్రశ్నించారు. పింఛన్ రూ.200నుంచి రూ.2వేలకు దాదాపు 10 రెట్లు పెంచిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. నెలకు రూ.2వేలు పింఛన్ గొప్ప భరోసా అని, దీనిని అందరూ స్వాగతిస్తుండగా వైసీపీ మాత్రం నిందిస్తోందన్నారు. అలాగే కాపులకు 5శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని, ఆటో డ్రైవర్లకు, ట్రాక్టర్లపై పన్ను తొలగించడాన్ని విమర్శిస్తోందన్నారు. మంచి చేయడాన్ని వ్యతిరేకించే ఏకైక పార్టీ వైసీపీ అన్నారు. ప్రజాధనం దోపిడీ చేయాలని, సమాజానికి చెడు జరగాలని వైసీపీ కోరుకోవడం వల్లే, పేదల సంక్షేమానికి పాటుపడుతున్న తెలుగుదేశం పార్టీని అన్నివర్గాల ప్రజలు వెన్నంటిఉంటున్నారని యనమల పేర్కొన్నారు.

'భీమసింగి'కి ఆప్కాబ్ దెబ్బ

- రుణాలకు తాజాగా గ్యారంటీ మెలిక
- రెండు నెలలుగా ఉద్యోగులకు వేతన బకాయిలు
- చలించని రాష్ట్రప్రభుత్వం

విశాలాంధ్ర - విజయనగరం/జామి : కాళ్ళు, చేతులు చచ్చుబడి అచేతనావస్థలో కొట్టుమిట్టాడుతున్న బిడ్డను కన్నతల్లి ఛీత్కరిస్తే ఎలా ఉంటుంది.. ఆ బిడ్డకు చావుతప్ప మరో దారి ఉంటుందా.. ఇదే పరిస్థితి భీమసింగి సహకార చక్కెర కర్మాగారానికి ఎదురవుతోంది. ఇప్పటికే అష్టకష్టాలు పడుతున్న కర్మాగారం ఎట్టకేలకు ఈ ఏడాది సీజన్ మొదలుపెట్టింది. కానీ కన్నతల్లి లాంటి ఆప్కాబ్ సంస్థ ఈ ఏడాది రుణం ఇచ్చేందుకు సరికొత్త నిబంధనలు పెట్టడంతో భీమసింగి యాజమాన్య పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.


భీమసింగి చక్కెర కర్మాగారంలో ప్రస్తుతం ఆర్థిక సంక్షోభం నెలకొంది. దాదాపు 262 మంది ఉద్యోగులు, కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదు. నెలకు అన్‌సీజన్‌లో రూ.25 లక్షలు, సీజన్‌లో రూ.50 లక్షల చొప్పున రెండు నెలలకు గాను రూ.75 లక్షల వరకు బకాయిలు పేరుకుపోయాయి. పండగ నేపథ్యంలో కనీసం ఒక్కనెల వేతనం అయినా ఇవ్వాలని కార్మికులు కోరినా యాజమాన్యం చేతులెత్తేసింది. దీంతో కార్మికుల కుటుంబాల్లో పండగ కళ కానరాలేదు. ప్రతి సంవత్సరం ఇస్తున్నట్టు ఈ ఏడాదీ ఆప్కాబ్ (ఏపీ సహకార బ్యాంకు) భీమసింగి కర్మాగారానికి రుణం మంజూరు చేస్తుందని అందరూ భావించారు. ప్రభుత్వం కూడా రుణం వచ్చేస్తుందని, తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. క్రషింగ్ ప్రారంభించి రెండు నెలలు కావస్తుండడంతోపాటు కార్మికులకు వేతనాల చెల్లింపునకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో యాజమాన్యం ప్రభుత్వం వైపు ఆశగా ఎదురుచూస్తోంది. కానీ ఆప్కాబ్ సంస్థ కొత్త నిబంధనలతో ఆశలు గల్లంతయ్యాయి.


భీమసింగి చక్కెర కర్మాగారం

ప్రభుత్వం గ్యారంటీ ఇస్తేనే రుణం..

ప్రతి సంవత్సరం భీమసింగి కర్మాగారంలో ఉత్పత్తి అయిన సరకును దృష్టిలో పెట్టుకుని ఆప్కాబ్ సంస్థ రుణం మంజూరు చేస్తూ వస్తోంది. గతేడాది నిల్వలోని 18 వేల పంచదార బస్తాలు గోదాముల్లో ఉన్నాయి. ప్రస్తుతం క్రషింగ్‌తో మరికొంత నిల్వ పెరగనుంది. అయినా ఆప్కాబ్ రుణం మంజూరుకు ముందుకు రాలేదు. రుణాన్ని ఇవ్వాలంటే ప్రభుత్వం గ్యారంటీ తప్పనిసరని నిబంధన విధించింది. ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో రుణం మంజూరుకు ఆప్కాబ్ వెనుకంజ వేసింది. దీంతో నిధులు ఆగిపోయాయి. నిల్వ బస్తాలపై ప్లెడ్జ్ లోను కింద రుణం అడిగినా ప్రస్తుతం ఆప్కాబ్‌కు బకాయి ఉన్న రూ.6 కోట్లను వడ్డీతో సహా కట్టాలని మెలిక పెడుతున్నారు. కర్మాగారం ఆస్తులపై అప్పు చేద్దామనుకున్నా, గతంలో ఓ సంస్థకు అన్ని ఆస్తులను తనఖా పెట్టడంతో ప్రస్తుతం రూ.16 లక్షల వరకు చెల్లించాల్సి ఉన్నట్టు సమాచారం. ఈ దశలో ప్రభుత్వం చొరవ చూపితే ఈ ఏడాది కష్టాలు గట్టెక్కుతాయని యాజమాన్యం ఎదురుచూస్తోంది. లేకపోతే మరో తుమ్మపాల ఫ్యాక్టరీ కాక తప్పదు.


ప్రయత్నాలు చేస్తున్నాం



యాజమాన్యం తరఫున మావంతు ప్రయత్నాలు చేస్తున్నాం. ఆప్కాబ్ రుణం మంజూరుకు ఈ ఏడాది ప్రభుత్వ గ్యారంటీ అడుగుతోంది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రభుత్వం స్పందిస్తుందని భావిస్తున్నాం. రుణం రాగానే సిబ్బందికి జీతాలు చెల్లిస్తాం.

వీవీ రమణారావు, ఎమ్‌డీ, కర్మాగారం

అర్ధాకలితో పనిచేస్తున్నారు



కర్మాగారంలోని కార్మికులకు రెండు నెలలుగా జీతాలు లేవు. కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయి. ఎట్టిపరిస్థితిలోనూ బకాయి మొత్తం ఈ నెల 31లోపు ఒకేసారి చెల్లించాలని కోరుతున్నాం. ఫ్యాక్టరీ పరిస్థితిని చూసి కష్టమైనా కార్మికులు పనిచేస్తున్నారు. యాజమాన్యం ప్రభుత్వంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాం.

వి. కృష్ణంరాజు, అధ్యక్షుడు, గుర్తింపు సంఘం



రూ.6.40 కోట్లు స్వాధీనం

పోలీసుల అదుపులో ఇద్దరు

విశాలాంధ్ర - తడ : బిల్లులు, ఆధారాలు లేకుండా అక్రమంగా భారీ మొత్తంలో ఆరు కోట్ల నలభై లక్షల రూపాయిల నగదును కారులో చెన్నైకు తరలిస్తుండగా పోలీసులు బుధవారం ఇక్కడ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు జాతీయ రహదారిపై ఎస్ఐ దాసరి వెంకటేశ్వరరావు తన సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా, నర్సాపురానికి చెందిన పాత సుజుకి సీయాజ్ ఏపీ 37సీకె 8280 కారుని ఆపి తనిఖీ చేయగా అందులో మూటలు కట్టి భారీ నగదు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నగదును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. రెండు బస్తాల్లో రూ.2 వేలు, రూ.500 నోట్ల కట్టలతో కూడిన భారీ నగదును ఎక్కడికి తరలిస్తున్నారన్న విషయాన్ని పోలీసులు విచారించారు. వాహనం నర్సాపురంలోని నగలు దుకాణం యజమాని ప్రవీణ్ కుమార్‌దిగా గుర్తించారు. పట్టుబడ్డ ఇద్దరు నిందితులు హరీష్, కనక సురేష్‌లు నగల దుకాణంలో గుమస్తాలమని తెలిపారు. సమాచారం అందుకున్న సూళ్లూరుపేట సీఐ కిషోర్ బాబు ఐటీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్న నగదుతోపాటు నిందితులను నెల్లూరుకు తరలించినట్లు ఎస్.ఐ దాసరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. భారీగా నగదు పట్టుబడిన విషయం తెలిసి స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. గతంలో ఈ ప్రాంతంలో కమర్షియల్ ట్యాక్స్ నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహించే క్రమంలో మత్తు పదార్థాలు, ఎర్రచందనంతో పాటు అనేక అక్రమాలకు చెక్ పెట్టేవారని, జీఎస్టీ తర్వాత తనిఖీలు లేకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారని వారు ఆరోపిస్తున్నారు.

ఇక కొత్త పద్దు...!

న్యూఢిల్లీ : ప్రస్తుతం అమలు జరుగుతున్న ఆర్థిక సంవత్సరాన్ని జనవరి నుంచి డిసెంబరుగా మార్చాలని ఎన్‌డీఏ సర్కార్ నిర్ణయించింది. దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాలతోపాటు కొన్ని ప్రతిపక్ష పార్టీల ఆధీనంలోని రాష్ట్రాలుసైతం ఆర్థిక సంవత్సరం మార్పునకు అనుకూలంగా ఉన్నట్లు సమాచారం. 2016 ఏప్రిల్‌లో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలోనూ ఆర్థిక సంవత్సరం మార్పునకు అన్ని రాష్ట్రాలు సంసిద్ధులవ్వాలని ప్రధాని మోడీ కోరారు. దేశంలో మొట్ట మొదటిగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆర్థిక సంవత్సరాన్ని జనవరి నుంచి డిసెంబరుకు మార్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసినా, నేటికీ అమలుకు నోచుకోలేదు. ఇందుకు సంబంధించి ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రవేశపెట్టనున్న మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర తాత్కాలిక ఆర్థికశాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయి. కొత్త ఆర్థిక సంవత్సరం ఈ ఏడాది మార్చి నుంచి అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి ఒకటిన ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో మార్చి నుంచి డిసెంబరు వరకు మాత్రమే మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం రెండు రోజుల క్రితమే కసరత్తును ఆర్థికశాఖ సహాయ మంత్రులు శుక్లా, పొన్ రాధాకృష్ణ చేపట్టారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వైద్య పరీక్షల నిమిత్తం అమెరికా వెళ్లటంతో, సంప్రదాయంగా వస్తున్న హల్వా వేడుక, బడ్జెట్ డాక్యుమెంట్ల ముద్రణకు ఆర్థికశాఖ నార్త్ బ్లాక్‌లో వారు శ్రీకారం చుట్టారు. కొత్త బడ్జెట్ పుస్తకాలను 2019 పేరుతో ముద్రించనుండటంతో ఆర్థిక సంవత్సరం మార్పును తెలియజేస్తుంది. దీంతో 152 సంవత్సరాలుగా దేశంలో ఏప్రిల్ నుంచి మార్చి వరకు కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరానికి ఎన్‌డీఏ సర్కార్ తిలోదకం పలకనుంది.

చైనా, రష్యా తరహాలో

ప్రపంచంలోని పలు దేశాలలో జనవరి నుంచి డిసెంబరు వరకు ఆర్థిక సంవత్సరం అమలవుతోంది. ఈ నేపథ్యంలో దేశాల వృద్ధి రేటును పోల్చి అంచనా వేయటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అందుకే ఆర్థిక సంవత్సరాన్ని మార్చాలని ప్రధాని మోడీ యోచిస్తున్నారు. మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సర్కార్ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ఆర్థిక సంవత్సరాన్ని మార్పు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే ఫిబ్రవరి నెలాఖరుకు ప్రవేశపెట్టే బడ్జెట్‌ను 2017 నుంచి ఫిబ్రవరి ఒకటిన ప్రవేశపెట్టేలా మార్పు చేశారు. ప్రపంచంలో రష్యా, చైనా, జర్మనీ తదితర దేశాలలోనూ ఆర్థిక సంవత్సరం జనవరి నుంచి డిసెంబరుగా ఉంది. ఆ దేశాల ఆర్థిక సంవత్సరాన్ని అనుకరించేందుకే మోడీ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం 2016 జూలైలో ఆర్థికశాఖ మాజీ సలహాదారు శంకర అచార్య నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలపై అధ్యయనం చేసిన కమిటీ, ఆర్థిక సంవత్సరం మార్చాలనే కేంద్ర అభిప్రాయానికి భిన్నంగా నివేదిక సమర్పించినట్లు సమాచారం. ఆ నివేదికను కేంద్రం ఇంత వరకు వెల్లడించలేదని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.



2019 బడ్జెట్ పుస్తకాల ముద్రణ సందర్భంగా హల్వా వేడుకను నిర్వహిస్తున్న కేంద్ర మంత్రులు శుక్లా, రాధాకృష్ణన్ (ఫైల్)

ఏపీ, తెలంగాణ, మధ్యప్రదేశ్ సుముఖత

మూడేళ్ల క్రితం జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో మొట్ట మొదటిసారిగా ఆర్థిక సంవత్సరం మార్పుపై చర్చ జరిగింది. దేశ ఆర్థిక, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆర్థిక సంవత్సరాన్ని జనవరి నుంచి డిసెంబరు వరకు అమలు చేయాలని మోడీ ప్రతిపాదించారు. అందుకు అప్పట్లో ఎన్‌డీఏలో ఉన్న ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, అప్పటి మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోపాటు తెలంగాణ సీఎం కేసీఆర్‌సైతం మోడీ ప్రతిపాదనకు సుముఖత వ్యక్తం చేశారు. అదే సమయంలో డెలాయిట్ సంస్థ నిర్వహించిన ఒక సర్వేలో 84 శాతం మంది ప్రజలు ఆర్థిక సంవత్సరం మార్పును స్వాగతించారు. దీనిపై 2015లో కేంద్ర ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. ప్రతిపక్ష నేత వీరప్ప మొయిలీ నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ కూడా 2017లో ఆర్థిక సంవత్సరం మార్పునకు సిఫార్సు చేసింది. దీంతో మోడీ సర్కార్ కొత్త ఆర్థిక సంవత్సర కాలాన్ని ప్రకటించేందుకు సిద్ధమవుతోంది.

మార్పుపై నిపుణుల భిన్నాభిప్రాయాలు

దేశంలో ఆర్థిక సంవత్సరం మార్పుపై ఆర్థిక నిపుణులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం మార్పు మంచి పరిణామమని చార్టెడ్ అకౌంటెంట్ వికాస్ జైన్ అభిప్రాయపడ్డారు. అయితే, రెండు మూడేళ్లపాటు అమలు కాస్త ఇబ్బందిగా ఉండవచ్చన్నారు. ఆ తర్వాత నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం వల్ల మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఈ మార్పుపై ప్రత్యేక ప్రణాళిక అవసరమని, లేనిపక్షంలో బాండ్లపై కొత్త ఆర్థిక సంవత్సర ప్రభావం ఉండే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కొత్త ఆర్థిక సంవత్సరం వల్ల చిన్న వ్యాపారులకు పలు సమస్యలు ఉత్పన్నమవుతాయని చార్టెడ్ అకౌంటెంట్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు చెబుతున్నారు. పలు సంస్థలు తొమ్మిది నెలలకు ఆడిట్ చేయించటంతోపాటు ఉద్యోగులు ఒకే ఏడాది రెండుసార్లు ఆదాయ పన్ను రిటన్స్ దాఖలు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన వారు వాటి కాలపరిమితిని మార్పు చేసుకోవటం పెద్ద సమస్యగా తయారవుతుందని నిపుణులు వాదిస్తున్నారు.

ప్రయోజనాలు ఇవీ

- అంతర్జాతీయంగా పలు దేశాలలో ఆర్థిక సంవత్సరం జనవరి నుంచి డిసెంబరుగా ఉంది
- దేశంలో ఆ విధంగా లేకపోవటంతో ఇతర దేశాల కంపెనీలు భారత్‌కు బదులు ఇతర దేశాలకు వెళుతున్నాయి. సంవత్సరం మార్చటం వల్ల వ్యాపార రంగం మరింత వృద్ధి చెందే అవకాశం ఉంటుంది.
- అన్ని రంగాల్లోనూ వృద్ధి, ఇతర అంశాలను పోల్చి అంచనా వేయటం సులువుగా ఉంటుంది
- డిసెంబరుకు ముందే బడ్జెట్‌ను ప్రవేశపెట్టటం వల్ల వ్యవసాయరంగానికి ఉపయుక్తంగా ఉంటుంది. ఖరీఫ్ సీజన్ ఏటా నవంబరుతో పూర్తి అవుతుంది. దీనివల్ల రైతులకు రుణాలు ఇవ్వటం కూడా సులభతరంగా ఉంటుందనేది కేంద్ర ఉద్దేశం.
- కంపెనీలకుసైతం త్రైమాసిక ఫలితాలను వెల్లడించటం అనుకూలంగా ఉంటుంది.

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం : పవన్



పాడేరు సభలో ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, జేవీఎస్ఎన్ మూర్తి, బాలరాజు తదితరులు

విశాలాంధ్ర-పాడేరు : విశాఖ ఏజెన్సీలో అక్రమ మైనింగ్ బాక్సైట్ తవ్వకాలపై ఉక్కుపాదం మోపుతామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖ జిల్లా పాడేరులో బుధవారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో టూరిజం, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు అంశాలను సీఎం చంద్రబాబు గాలికి వదిలేసారని తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే టూరిజం, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కృషిచేస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. గిరిజన ప్రాంత సమస్యలు తనకు తెలుసని గిరిజనులకు ఉపయోగపడే కార్యక్రమం చేయాల్సిన ఐటీడీఏలు గిరిజన అభివృద్ధికి కృషి చేయడం లేదని విమర్శించారు. ప్రత్యేక డీఎస్సీ తీసి గిరిజన ఉపాధికి తోడ్పడాలని, గిరిజనులను మోసం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుంద న్నారు. గిరిజన ప్రాంతంలో ప్రత్యేక అభివృద్ధి టూరిజం, యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి తమ ప్రభుత్వం కృషిచేస్తుందని అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. గిరిజనులు తనపై చూపిస్తున్న ఆదరణ, అభిమానాలను కొనియాడారు. బాలికల కళాశాల్లో మరుగు దొడ్లు, ప్రహరీ గోడలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందన్న నమ్మకంతో అప్పట్లో టీడీపీకి అండగా నిలబడ్డానని అన్నారు. ఒంటరిగా తమ పార్టీ 175 స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్దంగా వుందన్నారు. అందుకు గిరిజనులు సహకరించి తమ పార్టీ ప్రతిపాధించిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముందుగా ఆయన విశాఖపట్నం నుంచి ప్రత్యేక హెలీక్యాప్టర్ ద్వారా చింతలవీధి చేరుకుని అక్కడ నుంచి నేరుగా రోడ్డు మార్గంలో పాడేరు మోదకొండమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని అక్కడ నుంచి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సభ అనంతరం టీడీపీ నాయకులు పాంగి రాజారావు సుమారు 500 మంది తన అనుచరులతో జనసేన కండువా కప్పుకున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ నాయకులు అశోక్ తన అనుచరులతో జనసేన కండువా వేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, మాజీ మంత్రి, జనసేన ఉత్తరాంధ్ర నాయకులు పసుపులేటి బాలరాజు, నాదెండ్ల మనోహర్ వంపూరు గంగులయ్యా, కితలంగి పద్మ ఆధ్వర్యంలో భారీగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఫిబ్రవరిలోగా పరిష్కరించకుంటే

సమ్మె అనివార్యం : చండేశ్వర్ సింగ్

విశాలాంధ్ర - తిరుపతి : ఫిబ్రవరి లోగా బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె అనివార్యమని ఎన్ఎఫ్‌టీఈ బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ జాతీయ ప్రధాన కార్యదర్శి చండేశ్వర్ సింగ్ హెచ్చరించారు. స్థానిక కొర్లగుంట శ్రీపాద కళ్యాణ మండపంలో రాష్ట్ర వర్కింగ్ కమిటీ రెండు రోజుల సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కొండలరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. సభలో సింగ్ మాట్లాడుతూ, వేతన సవరణను అమలు చేయాలని, 4జీ స్పెక్ట్రమ్ తక్షణమే బీఎస్ఎన్ఎల్‌కు విడుదల చేయాలని, పెన్షన్ రివిజన్ తదితర డిమాండ్లను ఫిబ్రవరి లోగా పరిష్కరించాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ, ఉద్యోగుల డిమాండ్ల సాధన పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్మికుల సమస్యలపై బీజేపీ ప్రభుత్వం పక్షపాత వైఖరి అవలంభిస్తోందని, కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని డిమాండు చేశారు.

ఆర్టీసీ సమ్మె సైరన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించకపోతే వచ్చేనెల 6వ తేదీ నుంచి నిరవధిక సమ్మెను చేపడతామని ఏపీఎస్ఆర్టీసీ జేఏసీ బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. విజయవాడలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏపీఎస్ఆర్టీసీ జేఏసీ కన్వీనర్‌పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సీహెచ్ సుందరరావు, వి.వరహాలనాయుడులు మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపనందునే సమ్మెబాట పట్టనున్నట్టు తెలిపారు. 2017, ఏప్రిల్ నుంచి వేతన సవరణ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, బస్సులకు ఎంవీ ట్యాక్స్ రద్దు, ప్రజల అవసరాలకు అనుగుణంగా వెయ్యి బస్సుల పెంపు, ఎక్సెస్ పేరుతో తొలగించిన కాంట్రాక్టు కండక్టర్లు, డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాల డిమాండు చేశారు. వేతన సవరణ బకాయిలను వెంటనే చెల్లించాలని, పదవీవిరమణ వయస్సును 60ఏళ్లకు పెంచాలని, మహిళా కండక్టర్లకు కార్గోల్లో పనిచేసే అవకాశం కల్పించాలని డిమాండు చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించక పోతే ఈనెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెసన్నాహక పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఏపీఎస్ఆర్టీసీలో ఉన్న తొమ్మిది కార్మిక సంఘాల్లో ఎనిమిది సంఘాలతో పాటు ఓస్వా అసోసియేషన్ జేఏసీలో ఉన్నట్లు తెలిపారు. తమ పోరాటానికి మద్దతు పలికిన ఎన్ఎంయూ కూడా జేఏసీలోకి రావాలని నాయకులు ఆహ్వానించారు. ఈనెల 26-28 తేదీల్లో కార్మికులంతా నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతారని వెల్లడించారు. 28న రాష్ట్రంలోని 128 డిపోల్లో ఒక రోజు సామూహిక నిరాహార దీక్ష చేపడతామని చెప్పారు. 30న అన్ని ఆర్ఎం కార్యాలయాల ఎదుట సమ్మె సన్నాహక మహాధర్నాలు చేస్తామన్నారు. సమావేశంలో వైఎస్ఆర్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకుడు సీబీఎస్ రెడ్డి, జి.శ్రీనివాస్ (యునైటెడ్ వర్కర్స్ యూనియన్), ఎంవీ కొండారెడ్డి (ఓస్వా), శ్రీనివాసరాజు, (వర్కర్స్ యూనియన్) సీహెచ్ శ్యాంసన్ (బహుజన వర్కర్స్ యూనియన్) పాల్గొన్నారు.

ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్ కలిస్తే

యూపీలో బీజేపీ చిత్తే

- ఐదు స్థానాలకే పరిమితం
- లేకుంటే కాషాయానికి 18 స్థానాలు
- ఇండియా టుడే - కార్వీ ఇన్‌సైట్స్ సర్వే
- ఆజ్‌తక్ - కార్వీ ఇన్‌సైట్స్ సర్వేలోనూ వెల్లడి

న్యూఢిల్లీ : ఈ ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో అధికార బీజేపీకి భంగపాటు తప్పేటట్లు కనిపించటంలేదు. రానున్న ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్‌డీ) ఉమ్మడిగా పోటీ చేసేందుకు ఇప్పటికే పొత్తు ఖరారైంది. రాష్ట్రంలో అధికార కాషాయ పార్టీని నిలువరించేందుకు కాంగ్రెస్‌లేని కూటమే మేలని ఎస్పీ, బీఎస్పీ అధినేతలు అఖిలేష్ యాదవ్, మాయావతి భావిస్తున్నారు. ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు నిర్వహిస్తే యూపీలో బీజేపీ చిత్తు కావటం ఖాయంగా కనిపిస్తుంది. ఎస్పీ, బీఎస్పీ, ఆర్ఎల్‌డీ, కాంగ్రెస్ ఉమ్మడిగా పోటీ చేస్తే బీజేపీ ఐదు స్థానాలకే పరిమితం అవుతుందని 'ఇండియా టుడే - కార్వీ ఇన్‌సైట్స్' సర్వే వెల్లడించింది. ఉత్తర ప్రదేశ్‌లో అత్యధికంగా 80 లోక్‌సభ స్థానాలుండగా, కూటమికి 75 స్థానాలు వస్తాయని సర్వేలో తేలింది. బీజేపీ, అప్నాదళ్ కూటమి ఐదుతో సరిపెట్టుకోక తప్పదని స్పష్టమవుతోంది. 2014 ఎన్నికల్లో బీజేపీ కూటమి ఏకంగా 73 స్థానాల్లో విజయం సాధించగా, ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్, ఆర్ఎల్‌డీకి ఏడు స్థానాలే దక్కాయి. ఈసారి రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేక గాలి వస్తోందని, నాలుగు పార్టీలు ఉమ్మడిగా పోటీ చేస్తే ఏకంగా 75 స్థానాలను కైవసం చేసుకుంటాయని సర్వే స్పష్టం చేసింది. అయితే, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునేందుకు ఎస్పీ, బీఎస్పీ నిరాకరిస్తున్నాయి. ఒకవేళ కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తే నాలుగు స్థానాలలో, ఎస్పీ, బీఎస్పీ, ఆర్ఎల్‌డీ కూటమికి 58 స్థానాలు, బీజేపీకి 18 స్థానాలు వస్తాయని సర్వే వెల్లడించింది. ఆజ్‌తక్ - కార్వీ ఇన్‌సైట్స్ సర్వేలోను ఇదే విషయం వెల్లడైంది. ప్రతిపక్షాలు ఉమ్మడిగా పోటీ చేస్తే బీజేపీ 68 స్థానాలను, కాంగ్రెస్ లేకుండాపోటీ చేస్తే 55 స్థానాలను కోల్పోవచ్చని తేలింది. ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల ఆధారంగా నిర్వహించిన సర్వేలో ఇండియా టుడే - కార్వీ ఇన్‌సైట్స్ 2,400 మంది అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంది. ఈసారి ఎన్నికల్లో బీజేపీ, అప్నాదళ్ కూటమి ఓట్ల శాతం 43 శాతం నుంచి 36 శాతానికి తగ్గిపోనుండగా, ఎస్పీ, బీఎస్పీ, ఆర్ఎల్‌డీ కూట మికి 42.8 శాతం నుంచి 46 శాతానికి, కాంగ్రెస్‌కు 7.5 శాతం నుంచి 12 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది.

ఇండియా టుడే - కార్వీ ఇన్‌సైట్స్ సర్వే (కాంగ్రెస్ లేని కూటమి)

కూటమి	2014	2019
బీజేపీ, అప్నాదళ్	73	18
ఎస్పీ, బీఎస్పీ, ఆర్ఎల్‌డీ	5	58
కాంగ్రెస్	2	4
మొత్తం	80	80

ఇండియా టుడే - కార్వీ ఇన్‌సైట్స్ సర్వే (కాంగ్రెస్ ఉన్న కూటమి)

కూటమి	2014	2019
బీజేపీ, అప్నాదళ్	73	5
కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ, ఆర్ఎల్‌డీ	7	75
మొత్తం	80	80



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాభవాని

దశలవారీగా పోరాటాలు : దుర్గాభవాని

విశాలాంధ్ర-కాకినాడ : ప్రపంచీకరణ నేపథ్యంలో మహిళల హక్కులు క్రమక్రమంగా కోల్పోతున్నామని, వీటిపై దశలు వారి పోరాటాలు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని వెల్లడించారు. స్థానిక గాంధీ భవన్‌లో మహిళా సమాఖ్య తూర్పుగోదావరి జిల్లా 12వ మహాసభ జిల్లా అధ్యక్షురాలు నల్లా భ్రమరాంభ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముందుగా మహిళా సమాఖ్య జెండాను సీనియర్ నాయకురాలు యడ్లలక్ష్మి ఆవిష్కరించారు. ఇటీవల మరణించిన అమర వీరులకు మహాసభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. అనంతరం సమాఖ్య రాష్ట్ర నేత దుర్గాభవాని మాట్లాడుతూ పాలకులు మహిళలను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నారని అన్నారు. మహిళా సాధికారత పేరుతో గద్దినెక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 33శాతం రిజర్వేషన్ పెంచడానికి ముందుకు రావడం లేదని, పైగా మహిళల హక్కులను కాలరాస్తూ మహిళల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. శబరిమలలో మహిళలకు ఆలయ ప్రవేశం కల్పించిన సుప్రీంకోర్టు తీర్పును అమలు చెయ్యాలన్నారు. సమానత్వం కోసం కేరళలో కోటిమంది ర్యాలీ నిర్వహించడం దేశానికి చాలా గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 29 నుంచి 31వరకు ఏలూరులో జరిగే 14వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రముఖ వైద్యులు డా.దేవా సుజాతా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలల్లోను రాణించాలని, మహిళా అభివృద్ధితోనే దేశం అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు లోవరత్నం, దంకల నాగమణి, నూకరత్నం, సేపేని రమణమ్మ, నక్క లక్ష్మి తులసి పాల్గొన్నారు.

హైకోర్టు భవనాలకు పటిష్ట భద్రత

విశాలాంధ్ర - అమరావతి : ఫిబ్రవరి 3న హైకోర్టు భవనాల ప్రారంభోత్సవం నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని జీఏడీ కార్యదర్శి శ్రీకాంత్ ఆదేశించారు. బుధవారం సచివాలయంలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా జీఏడీ కార్యదర్శి శ్రీకాంత్, హోం శాఖ కార్యదర్శి అనురాధ, ఇతర ఉన్నతాధికారులు మాట్లాడుతూ హైకోర్టుకు పటిష్ట భద్రత కల్పించడంతో పాటు, ఫైర్ సర్వీసులు, ట్రాఫిక్, పార్కింగ్, ప్రముఖుల రాకపోకలకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వీఐపీల వాహనాలు, ఇతర వాహనాలకు పార్కింగ్‌తో పాటుగా పోలీసు బీట్ పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. భూములిచ్చిన రైతులు సైతం రానున్న నేపథ్యంలో అన్ని రకాల వసతులు కల్పించాలని ఆదేశించారు. న్యాయమూర్తుల ఇంటి వద్ద గార్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షలో సమాచార శాఖ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్, ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో అత్యుత్తమ బైబిల్ మ్యూజియం

మంత్రి నక్కా ఆనంద్ బాబు

విశాలాంధ్ర - అమరావతి : రాజధాని ప్రాంతంలో ప్రపంచంలోనే అత్యుత్తమ బైబిల్ మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్ బాబు చెప్పారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో పలువురు క్రైస్తవ మత పెద్దలు మంత్రిని కలిసి బైబిల్ మ్యూజియం ఏర్పాటుకు సంబంధించిన నమూనా చిత్రాలు చూపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రాజధాని అమరావతిలో ఉత్తమమైన బైబిల్ మ్యూజియం ఏర్పాటుకు సంబంధించి భూమి పూజ, డిజైన్ల ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పవిత్ర బైబిల్ గ్రంథంలో పేర్కొన్న ప్రముఖ చారిత్రాత్మక సంఘటనలు అందుబాటులో ఉంచాలని క్రైస్తవ పెద్దలు సూచించారు. సోలమాన్ క్రైస్తవ దేవాలయం కంటే మిన్నగా ఈ మ్యూజియం నిర్మించాలని కోరారు. దక్షిణాసియాలో 1818లో ప్రథమంగా విద్యావేత్త విలియం కేరి కలకత్తాలో సిరంపూర్ కళాశాల(విశ్వ విద్యాలయాన్ని) ఏర్పాటు చేశారని మంత్రికి వివరించారు. అదే రీతిలో రాజధానిలో సింగపూర్ విశ్వ విద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం మూడు ఎకరాల స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 12,345 మంది బిషప్, పాస్టర్లకు ఈ విశ్వ విద్యాలయం అందించిన డిగ్రీలకు విదేశాల్లో హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, స్టాఫర్డ్ వంటి యూనివర్సిటీలు మంచి గుర్తింపు ఇచ్చాయని మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఎం.జోసఫ్, ఇమ్మానియెల్, బిషప్ జాన్ నక్కా పీఎస్ఏఎస్ చంద్రబోస్, రాబర్ట్స్, సునీల్, రెవరెండ్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.



65 ఏళ్ల కల నెరవేరింది: మంత్రి ఉమా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణా జలాలను చిత్తూరు జిల్లాకు అందించడం ద్వారా స్వాతంత్ర్యానంతరం 65 ఏళ్ల కల నెరవేరిందని జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. విజయవాడలోని జలవనరుల శాఖ కార్యాలయంలో బుధవారం భూగర్భజలాల అభివృద్ధి, నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, కృష్ణా- గోదావరి నదుల అనుసంధానం ఒక చారిత్రాత్మకమైన ఘట్టమని చెప్పారు. యువ ఇంజనీర్లు అంకిత భావంతో సేవలందించాలని, శిక్షణలతో నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం 'భూగర్భజలాల అన్వేషణ' పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జలవనరులశాఖా కార్యదర్శి శశిభూషణ్, రీజనల్ డైరెక్టరు డి.సుబ్బారావు, ఆచార్య నాగార్జున వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతులకు

రూ.25 కోట్లు మంజూరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో డిజిటల్ తరగతుల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.25 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్ బుధవారం జీవో నంబరు-31 విడుదల చేశారు. 2018-19 విద్యా సంవత్సరానికిగాను 13 జిల్లాల్లోని 450 ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో డిజిటల్ తరగతుల కోసం ఈ నిధులను ఖర్చుచేస్తారు. ఇంటర్మీడియట్ విద్యాకమిషనర్ విజ్ఞప్తిమేరకు ఈ నిధులను కేటాయించారు. డిజిటల్ తరగతుల ప్రవేశంతో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విద్యాబోధన కొనసాగనుంది.

టీచర్లకు ఈఎల్ మంజూరు హర్షణీయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొని 33రోజులపాటు పనిచేసిన ఉద్యోగులకు 17 రోజుల ఈఎల్ (సంపాదిత సెలవులు) ప్రభుత్వం మంజూరు పట్ల ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, జి.నాగేశ్వరరావు హర్షం తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో ఉపాధ్యాయ సంఘాల నేతలపై నమోదైన కేసులు తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విశాలాంధ్ర

క్రీడలు

కోహ్లికి రెస్ట్..!

రోహిత్‌కు పగ్గాలు



న్యూఢిల్లీ : వరుస సిరీస్‌లలో జట్టుకు చారిత్రక విజయాలు అందించిన టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లికి సెలక్టర్లు విశ్రాంతినిచ్చారు. ఈ నేపథ్యంలో న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా కోహ్లి తుది రెండు వన్డేలకు దూరం కానున్నాడు. అదేవిధంగా టీ20 సిరీస్‌కు కోహ్లి అందుబాటులో ఉండడని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తెలిపింది. కోహ్లి స్థానంలో వైస్ కెప్టెన్ రోహిత్ శర్మకు సారథ్య బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొంది.

విశ్రాంతి అవసరం..

'కొన్ని నెలలుగా కోహ్లిపై పని ఒత్తిడి పెరిగింది. ప్రస్తుతం అతడికి విశ్రాంతి అవసరం. అదే విధంగా భారత్‌లో ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్‌కు కోహ్లి సన్నద్ధం కావాలి. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని సీనియర్ సెలక్షన్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది' అని బీసీసీఐ మీడియాకు వెల్లడించింది. ఈ నేపథ్యంలో హామిల్టన్, వెల్లింగ్‌టన్ వన్డేలతో పాటు.. ఫిబ్రవరి 6న మొదలయ్యే టీ20 సిరీస్‌కు కూడా రోహిత్ శర్మ సారథ్యం వహించనున్నాడు.

పరిస్థితి చేయి దాటింది : కరణ్



ముంబై : భారత క్రికెటర్లు పాండ్య, కేఎల్ రాహుల్ 'కాఫీ విత్ కరణ్' టీవీ షోలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి నిషేధం ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ వివాదంపై చాలామంది ప్రముఖ క్రికెటర్లు స్పందించారు. అయితే ఇంత వివాదానికి వేదికగా నిలిచిన 'కాఫీ విత్ కరణ్ షో' హోస్ట్ కరణ్ జోహర్ మాత్రం ఇంతవరకూ ఈ విషయం గురించి మాట్లడలేదు. దాంతో కరణ్ మీద విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో.. ఈ విషయంపై కరణ్ తొలిసారి స్పందించాడు. 'పాండ్య, రాహుల్ విషయంలో జరిగిన నష్టానికి నేను చింతిస్తున్నాను. నా షోలో ఇలా జరగడం నిజంగా దురదృష్టకరం. ఇందుకు నేను పూర్తి బాధ్యత వహిస్తున్నాను. నేనే వారిని ఈ కార్యక్రమానికి అతిథులుగా ఆహ్వానించాను. షోలో ఉన్నంతవరకే ఏదైనా నా ఆధీనంలో ఉంటుంది. కాబట్టి నా షోలో జరిగే పరిణామాలకు నేను బాధ్యత వహించాలి. ఒక్కసారి టెలికాస్ట్ అయితే తరువాతి పరిస్థితులు నా చేతిలో ఉండవు. ప్రస్తుతం ఇదే జరిగింది. నా షో వల్ల రాహుల్, పాండ్యలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీని గురించి ఆలోచిస్తూ ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపాను. ఈ నష్టాన్ని నేను నివారించలేకపోయాను అంటూ నా సన్నిహితుల దగ్గర చెప్పుకొని చాలా బాధపడ్డాను. కానీ ఏం లాభం. ఇప్పుడు పరిస్థితి నా చేయి దాటిపోయింది. నన్ను క్షమించండి' అని ఆవేదన వ్యక్తం చేశాడు. మరోపక్క 'కాఫీ విత్ కరణ్' నిర్వాహకులు పాండ్య, రాహుల్‌కు సంబంధించిన షో వీడియోలను వారి వెబ్‌సైట్ నుంచి, సోషల్‌మీడియా నుంచి తొలగించారు.

సంజితా చానుకు ఊరట

నిషేధం తొలగింపు



హైదరాబాద్: రెండుసార్లు కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత అయిన సంజితా చానుపై విధించిన సస్పెన్షన్‌ను అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ తాత్కాలికంగా తొలగించింది. యాంటీ డోపింగ్ నియమాలను ఉల్లంఘించిన కారణంగా చానుపై అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ (ఐడబ్ల్యూఎఫ్) గతేడాది నిషేధాన్ని విధించిన సంగతి తెలిసిందే. దీనిపై భారత వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ సహదేవ్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. "చానుపై విధించిన నిషేధం తాత్కాలికంగా తొలగింది. నిషేధాన్ని ఐడబ్ల్యూఎఫ్ పూర్తిగా ఎత్తేయలేదు. విచారణ కొనసాగుతుంది. తాజా నిర్ణయం ఆమెకు కలిసిరానుంది. చాను ఇప్పుడు శిక్షణ కోసం క్యాంప్‌కు రావొచ్చు. తుది తీర్పు ఆమెకు అనుకూలంగా వస్తుందని నమ్ముతున్నాం. చానుపై మాకు పూర్తి విశ్వాసం ఉంది" అని అన్నారు. దేశం ఆమెను వదులుకోవడానికి సిద్ధంగా లేదని ఆయన చెప్పారు. నిషేధం ఎత్తివేసేందుకు తమ వంతుగా ప్రయత్నిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఆస్ట్రేలియాలోని గోల్డ్ కోస్ట్ వేదికగా 2018లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో 53కేజీల విభాగంలో సంజితా చాను స్వర్ణ పతకం సాధించింది. నవంబర్ 2017లో యునైటెడ్ స్టేట్స్ వేదికగా వరల్డ్ చాంపియన్‌షిప్ జరగడానికి ముందు ఆమె యూరిన్ శాంపిల్‌ను తీసుకుని పరీక్షించడంతో డోపింగ్ నియమాలను ఉల్లంఘించినట్లు తేలింది. దీంతో అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ మే 15, 2018న నిషేధం విధించింది.

బోణీ అదిరింది..!

- రాణించిన భారత బౌలర్లు
- హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్న ధావన్
- 5 వన్డేల సిరీస్‌ను గెలుపుతో ఆరంభించిన భారత్



నేపియర్ : ఆస్ట్రేలియా పర్యటనను దిగ్విజయంగా ముగించిన టీమిండియా న్యూజిలాండ్ గడ్డపై కూడా అదే ఊపును కొనసాగించింది. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన తొలి వన్డేలో కోహ్లీసేన అదరగొట్టింది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించి డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 8 వికెట్ల తేడాతో ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. బౌలింగ్‌లో కుల్దీప్(4/39), మహ్మద్ షమీ(3/19)లు చెలరేగగా.. బ్యాటింగ్‌లో శిఖర్ ధావన్ (75 నాటౌట్, 103 బంతుల్లో 6 ఫోర్లు), కెప్టెన్ విరాట్ కోహ్లి (45, 59 బంతుల్లో 3 ఫోర్లు), అంబటి రాయుడు (13 నాటౌట్) రాణించారు. ఈ గెలుపుతో కోహ్లీసేన.. కివీస్ పర్యటనను ఘనంగా ఆరంభించింది. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టును భారత బౌలర్లు దెబ్బతీశారు. కెప్టెన్ విలియమ్సన్ (64) మినహా మిగితా బ్యాట్స్‌మెన్ దారుణంగా విఫలమవ్వడంతో కివీస్ 38 ఓవర్లలో 157 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లలో కుల్దీప్ నాలుగు, షమీ మూడు వికెట్లు తీయగా.. చాహల్ రెండు, జాదవ్ ఒక వికెట్ తీశారు.

ధనాధన్ ధావన్..

ఇక 158 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మలు మంచి ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 41 పరుగుల భాగస్వామ్యం నమోదైన అనంతరం రోహిత్(11) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కోహ్లితో ధావన్ దాటిగా ఆడాడు. అయితే తీవ్ర ఎండ కారణంగా మ్యాచ్‌కు స్వల్ప అంతరాయం కలిగింది. దీంతో అంపైర్లు భారత లక్ష్యాన్ని 49 ఓవర్లలో 156 పరుగులకు కుదించారు. మ్యాచ్ పునఃప్రారంభం అనంతరం ధావన్ తనదైన రీతిలో చెలరేగాడు. ఈ క్రమంలో 69 బంతుల్లో కెరీర్‌లో 26వ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు కోహ్లి కూడా హాఫ్ సెంచరీకి చేరువగా వచ్చి ఫెర్గుసన్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. దీంతో మూడో వికెట్‌కు నమోదైన 91 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత క్రీజులోకి వచ్చిన హైదరాబాద్ స్టార్ బ్యాట్స్‌మెన్ అంబటి రాయుడితో ధావన్ మిగతా పనిని పూర్తి చేశాడు. దీంతో భారత్ 85 బంతులు మిగిలి ఉండగానే 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది.

ధావన్ మరో మైలురాయి

టీమిండియా క్రికెటర్ శిఖర్ ధావన్ వన్డే కెరీర్ మరో కీలక మైలురాయిని చేరుకున్నాడు. దీంతో దిగ్గజాల సరసన చోటు దక్కించుకున్నాడు. అతి తక్కువ వన్డే ఇన్నింగ్స్‌ల్లో 5000 పరుగుల మైలురాయిని చేరుకున్న టీమిండియా రెండో క్రికెటర్‌గా నిలిచాడు. కివీస్‌తో జరుగుతున్న తొలి వన్డేలో ఆది నుంచి దూకుడుగా ఆడిన గబ్బర్ తన కెరీర్ కీలక మైలురాయిని చేరుకోవడం విశేషం. అతి కొద్ది ఇన్నింగ్స్‌లో ఐదు వేల పరుగుల మైలురాయిని చేరుకున్న వారిలో దక్షిణాఫ్రికా ఆటగాడు హాషీమ్ ఆమ్లా(101 ఇన్నింగ్స్) తొలి స్థానంలో ఉన్నాడు. తర్వాతి ఈ ఘనతను 114 ఇన్నింగ్స్‌లోనే విండీస్ లెజెండరీ క్రికెటర్ వివ్ రిచర్డ్స్, టీమిండియా సారథి విరాట్ కోహ్లి సాధించారు. ఇక శిఖర్ ధావన్ కూడా 118 ఇన్నింగ్స్‌లో ఐదు వేల పరుగులు మైలురాయిని చేరుకున్నాడు. దీంతో క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారా రికార్డును ధావన్ సమం చేశాడు. ధావన్ తర్వాతి స్థానంలో కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్(119 ఇన్నింగ్స్), విండీస్ మాజీ గ్రీనిడ్జ్(121 ఇన్నింగ్స్), దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్(124 ఇన్నింగ్స్) ఉన్నారు.

మా పేసర్లు ఏ జట్టునైనా అవుట్ చేయగలరు

మా ఫాస్ట్ బౌలింగ్ బలంగా ఉంది. వారు ఏ జట్టునైనా అవుట్ చేయ గలరని టీమిండియా కెప్టెన్ కోహ్లి అన్నాడు. మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ కోహ్లి 'ఇది మా జట్టు నుంచి వచ్చిన సమతూకమైన ప్రదర్శన అని చెప్పగలను. బౌలర్ల నుంచి ఇంతకంటే ఇంకేమి ఆశించగలం. టాస్ ఓడగానే ప్రత్యర్థి జట్టు 300 పై పరుగులు చేస్తుందని అనుకున్నాను. ఇటువంటి పిచ్‌పై బౌలర్ల అద్భుత ప్రదర్శనతో 157 పరుగులకు కట్టడి చేయగలిగాం. షమీ మాకు మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. మా పేసర్లు ఏజట్టునైన అవుట్ చేయగలరని నమ్మకంగా చెప్పగలను' అని అన్నాడు.

సెమీస్‌లో జోకో

- పౌలీ, ఒసాకా, ప్లిస్కోవా కూడా
- సెరీనాకు షాక్



మెల్‌బోర్న్ : ప్రపంచ నెంబర్ వన్ నొవాక్ జోకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్ చేరాడు. మరో క్వార్టర్స్ మ్యాచ్‌లో రోనిక్‌కు షాక్ తగిలింది. ఫ్రాన్స్‌కు చెందిన 28 సీడ్ లూకాస్ పౌలీ 16 సీడ్ రోనిక్‌ను ఓడించి తొలిసారి గ్రాండ్ స్లాం సెమీస్‌లో అడుగుపెట్టాడు. జోకోవిచ్ నిషికొరీ మధ్య జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో నిషికొరీ రిటైర్ కావడంతో నిలిచిపోయింది. దీంతో జోకోవిచ్ సెమీస్‌లోకి ప్రవేశించాడు. నిషికొరీ మ్యాచ్ నుంచి వైదొలిగిన సమయంలో స్కోరు 6-1, 4-1గా ఉంది. తొలి సెట్‌ను జోకోకు ఎటువంటి పోటీ ఇవ్వకుండా నిషికొరీ 6-1తో కోల్పోయాడు. రెండోసెట్ తొలిగేమ్ నుంచీ నిషికొరీ ఇబ్బందిగానే కదిలాడు. స్కోరు 4-1తో వెనుకబడి ఉన్న సమయంలో గాయం కారణంగా మ్యాచ్ నుంచి వైదొలిగాడు. రోనిక్‌కూ క్వార్టర్స్‌లో చుక్క ఎదురైంది. పౌలీతో జరిగిన మ్యాచ్‌లో 6-7, 3-6, 7-6, 4-6 తేడాతో ఓడిపోయాడు. తొలి రెండు సెట్లనూ చేజార్చుకున్న రోనిక్ మూడో సెట్‌ను పోరాడి 7-6 తేడాతో గెలుచుకున్నా..నాలుగో సెట్ కోల్పోయి టోర్నీ నుంచి తప్పుకున్నాడు. పౌలీ సెమీస్‌లో జోకోవిచ్‌తో తలపడతాడు.

సెరీనా అనూహ్య పరాజయం..

టోర్నీ ఫ్యావరెట్ సెరీనా అనూహ్య రీతిలో పరాజయం పాలై క్వార్టర్ ఫైనల్స్‌లోనే ఇంటి ముఖం పట్టింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన ఏడో సీడ్ కరోలీనా ప్లిస్కోవా చేతిలో సెరీనా 4-6, 6-4, 5-7 తేడాతో ఓడింది. తొలి సెట్‌ను ప్లిస్కోవా గెలువగా రెండో సెట్‌ను సెరీనా గెలుచుకుంది. కీలక మూడో సెట్‌లో సెరీనా 5-1 ఆధిక్యంలో విజయానికి ఒక్క పాయింటు దూరంలో ఉండగా అనూహ్యంగా ఓటమి పాలైంది. ప్లిస్కోవా వరుసగా నాలుగు మ్యాచ్ పాయింట్లను కాచుకుని గేమ్‌ను నిలుపుకొని, సెరీనాకు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా వరుసగా గేమ్‌లను బ్రేక్ చేస్తూ తన సర్వీలను నిలుపుకుంటూ చివరికి 5-7 తేడాతో సెట్‌ను గెలుచుకుని సెరీనాకు పెద్ద షాకే ఇచ్చింది. రెండో క్వార్టర్స్‌లో జపాన్ స్టార్ ఒసాకా స్విటోలీనాకు 6-4, 6-1 తేడాతో ఓడించి సెమీస్ చేరింది. ఒసాకా సెమీస్‌లో ప్లిస్కోవాతో ఆడనుంది.

ప్రకటనల వెనుక వెళ్లను : పుజారా



ముంబై : వాణిజ్య ప్రకటనల వెనుక నేను వెళ్లనని భారత టెస్టు స్టార్ బ్యాట్స్‌మన్ ఛతేశ్వర్ పుజారా తెలిపాడు. చాలా కాలంగా భారత టెస్టు జట్టుకే పరిమితమైన పుజారా జట్టులో కీలక సభ్యుడిగా మారి జట్టు విజయాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇతర స్టార్ క్రికెటర్లు వాణిజ్య ప్రకటనల ద్వారా సంపాదిస్తున్నంతగా పుజారా ఆర్జించడంలేదనేది తెలిసిందే. ఈ విషయంపై పుజారా మాట్లాడుతూ 'నేను టెస్టు క్రికెటర్‌ను కనుకే నాకు వాణిజ్య ప్రకటనలు రావడంలేదని తెలుసు. కానీ ప్రకటనల వెనుక వెళ్లే వ్యక్తిని నేను కాదు. నాకు ఆట అంటే ఇష్టం. నాకోసం నేను ఆడను, దేశం కోసం ఆడతాను. దేశం నాపై చూపే ప్రేమే నాకు వాణిజ్య ప్రకటనల కంటే ఎక్కువ' అని అన్నాడు. పుజారా ఐపీఎల్ వేలంలోనూ అమ్ముడు అవ్వని విషయం తెలిసిందే. 2010లో అరంగేట్రం చేసిన పుజారా 68 టెస్టుల్లో 51.18 సగటుతో 5,426 పరుగులు చేయగా ఐదు వన్డేలోనే ప్రాతినిధ్యం వహించాడు.

ఇది కేసీఆర్ చాణుక్యనీతి

కేబినెట్ ఏర్పాటు చేయకపోవడంపై నారాయణ వ్యాఖ్య



విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నెల రోజులు దాటిపోయినా కేబినెట్‌ను ఏర్పాటు చేయకుండా కేసీఆర్ చాణుక్య రాజనీతిని పాటిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టరు కె. నారాయణ విమర్శించారు. పంచాయతీలను గెలిపించుకురావాలని ఎమ్మెల్యేలను తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు పురమాయించి యాగంలో కూర్చోవడాన్ని తప్పుపడుతు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటన ఇలా ఉన్నది. రాజులు గతంలో శత్రుకోటలు అధిరోహించాలంటే ఉడుము ముక్కుకు తేనె పూసి, నడుముకు తాడుకట్టి వదిలేవారు. తేనె వాసనతో యింకా ముందుకెళితే తేనె దొరుకుతుందని కోటగోడను యెగబాకేది. తీర పైకి వెళ్లాక ఉడుము బల్లూకం పట్టు సాయంతో సైన్యం శత్రుకోటను కైవసం చేసుకునే వారు" అని తెలిపారు. 'కేసీఆర్ ముఖ్యమంత్రి అయినా కేబినెట్ ఏర్పాటు చేయకుండా, పంచాయతి ఎన్నికలు ప్రారంభించి, యెవరెక్కువ పంచాయతీలు గెలిపించుకుంటే వారిని మంత్రి పదవి వరిస్తుందని ఎమ్మెల్యేలనుపురమాయించి కేసీఆర్ "యాగం'లో కూర్చున్నారు. వారుపాట్లు వారివీ , వీరియాగం వీరిది. చాణుక్య రాజకీయనీతి అంటే యిదే' అని ఆ ప్రకటనలో నారాయణ ఎద్దేవా చేశారు.

ఒక్కొక్కరికి రూ62 లక్షలు

చైనాలో ఓ కంపెనీ సంచలనం

బీజింగ్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా చైనాలోని ఓ కంపెనీ తమ ప్రతి కార్మికుడికి రూ.62 లక్షలు చొప్పున బోనస్ ప్రకటించింది. నాన్‌చాంగ్ నగరానికి చెందిన ఓ కంపెనీ బోనస్‌గా 300 మిలియన్ యువాన్లు (దాదాపు రూ.34 కోట్లు) డబ్బు కట్టలను గుట్టలుగా పేర్చింది. ఈ డబ్బును కంపెనీ కార్యాలయంలో ప్రదర్శనగా ఉంచారు. ఈ కంపెనీలో దాదాపు 5000 మంది ఉద్యోగులు ఉన్నారు. వారిలో ఒక్కో ఉద్యోగికి రూ.62 లక్షల చొప్పున బోనస్ అందజేసింది. 'ఇంత భారీ మొత్తాన్ని ఎలా ఖర్చుపెట్టాలో అర్థంకావడంలేదు' అని ఓ ఉద్యోగి మీడియా ద్వారా వెల్లడిస్తూ సంబరపడిపోయాడు. గతంలోనూ నాన్‌చాంగ్ ఇదే విధంగా ఉద్యోగులకు బోనస్‌లు ప్రకటించింది. కంపెనీలోని ఓ హాలులో డబ్బు కట్టలను గుట్టలుగా పోసింది. ఒక్కో ఉద్యోగికి పరిమిత సమయం ఇచ్చి ఆ సమయంలో ఎంత డబ్బును తీసుకెళ్లగలిగితే అంత మొత్తం బోనస్‌లుగా ఇచ్చేసింది.

దళితుల సంక్షేమం కోసం పోరాటం

- 2న విజయవాడలో రౌండుటేబుల్ సమావేశం
- జల్లి విల్సన్, దడాల సుబ్బారావు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సామాజిక న్యాయం, దళితుల సంక్షేమం కోసం పోరాటాలకు సిద్ధమవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లి విల్సన్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దడాల సుబ్బారావు దళిత శ్రేణులకు పిలుపునిచ్చారు. విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్ సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ దళితుల సబ్‌ప్లాన్ స్ఫూర్తిని ప్రభుత్వాలు పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. అన్ని దళిత సంఘాలతో ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం 10.30 గంటలకు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. దడాల సుబ్బారావు మాట్లాడుతూ నూతన రాజకీయ ప్రత్యామ్నాయం రూపొందించుకోవాల్సిన అవసర ముందని సూచించారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రభాకర్, కరవది సుబ్బారావు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, ఎం.శ్రీనివాస్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప పాల్గొన్నారు.

'రక్షణ' సమ్మెకు మద్దతు

- చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే 73 విభాగాల్లో కనీస వేతనాలు ఇవ్వాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు



విశాలాంధ్ర-విశాఖ సిటీ బ్యూరో : రక్షణశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ డిమాండ్లు పరిష్కరించాలని బుధవారం నుంచి మూడు రోజులు పాటు తలపెట్టిన 5లక్షల మంది ఉద్యోగ, కార్మికుల సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని, వారికి అండగా నిలబడుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. విశాఖలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియాతో మాట్లాడారు. దేశంలో కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోడీ సర్కార్‌కు ఇటీవల జరిగిన రెండురోజుల సార్వత్రిక సమ్మె చెంపపెట్టువంటిదన్నారు. 25 కోట్ల మంది ఈ సమ్మెలో పాల్గొన్నారని, 40 వేల కోట్లకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లిందని చెప్పినా మోడీకి బుద్ధిరాలేదన్నారు. ఉద్యోగ, కార్మికులపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారన్నారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో రక్షణరంగంలో ఉద్యోగ, కార్మికులు సమ్మె బాట పట్టారన్నారు. రాష్ట్రంలో కార్మికుల హక్కులను చంద్రబాబు ప్రభుత్వం హరిస్తుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయాలని, అందరికి కనీస వేతనం రూ.18 వేలు, కనీస పింఛన్ రూ.7 వేలు ఇవ్వాలన్నారు. సామాజిక భద్రత కరువై అసంఘటిత రంగ కార్మికులు రాష్ట్రంలో దాదాపు కోటీ 70లక్షల మంది జీవిస్తున్నారన్నారు. 73రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికీ ఉద్యోగ భద్రత, పనికితగ్గ వేతనం ఇవ్వాలన్నారు. బడ్జెట్‌లో హమాలీ, ఆటో కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేసేలా నిధులు కేటాయించా లన్నారు. మున్సిపల్ కార్మికులకు గుదిబండగా మారిన జీవో 279ను రద్దు చేసి 151 ప్రకారం జీతాలు చెల్లించాలని ఈనెల 28నుంచి మున్సిపల్ కార్మికులు ఆందోళన బాట పట్టనున్నారన్నారు. ఉత్తరాంధ్రలో జూట్ పరిశ్రమను దివాలా తీయించిన టీడీపీ ప్రభుత్వం అనేక పరిశ్రమలు మూతకు గురైనా తెరిపించ లేదన్నారు. చిట్టివలస జూట్ మిల్ కార్మికులకు ఏదాది నష్ట పరిహారంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. వచ్చేనెల 5న మరో మారు చర్చలకు మంత్రులు గంటా, పితాని పిలవడం సమస్యను దాట వేయడమేనన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పడాల రమణ, బీసీహెచ్ మసేన్, ఉపప్రధాన కార్యదర్శి బి.వెంకటరావు, సహాయ కార్యదర్శి ఎం. మన్మథరావుతో పాటు నాయకులు సత్యాంజనేయ, వామనమూర్తి, రెహమాన్, తెడ్డు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి జిందాల్ !

రూ.3500 కోట్ల పెట్టుబడి



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి ; ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులు పెట్టడానికి మరో పారిశ్రామిక దిగ్గజం ముందుకొచ్చింది. ఉక్కు, ఇంధన, సిమెంట్, మౌలిక సదుపాయాలు, క్రీడారంగాలలో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన జిందాల్ గ్రూప్ రూ.3500 కోట్లతో ప్రకాశం జిల్లా రామాయపట్నం పోర్టులో రెండు జెట్టీల అభివృద్ధి, పైప్‌లైన్ ప్రాజెక్టులు చేపట్టేందుకు అవగాహన ఒప్పందం చేసుకుంది. దావోస్ ఆర్థిక సదస్సులో ఏపీ ప్రభుత్వ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న ఐటీ, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి నారా లోకేష్‌తో జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో ఈ ఒప్పందాలపై నాలుగు పక్షాలకు చెందిన అధికారులు సంతకాలు చేసుకున్నారు. రాష్ట్ర మౌలిక సదుపాయాల (పోర్టులు) శాఖ, ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి, ఏపీ మ్యారీటైమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లతో జేఎస్‌డబ్ల్యూ ఈ ఒప్పందం చేసుకుంది. ఒప్పందం మేరకు ఏపీలోని రామాయపట్నం పోర్టులో స్టాక్‌యార్డు, పోర్టు కార్యకలాపాలకు వీలయ్యే సుమారు 200 ఎకరాల స్థలంలో రూ.1000 కోట్లతో రెండు జెట్టీలు నిర్మిస్తారు. రూ.2500 కోట్లతో పైప్‌లైన్ ఏర్పాటు చేస్తారు. ఈ రెండు ప్రాజెక్టుల్లో కలిపి మొత్తం 40 మందికి ప్రత్యక్షంగా, 175 మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రామాయపట్నం పోర్టు అభివృద్ధికి ఇటీవల సీఎం చంద్రబాబు భూమిపూజ చేసిన విషయం తెల్సిందే. పోర్టును అభివృద్ధి చేయడమే కాకుండా ప్రకాశం జిల్లాలో పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఊతమివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో దావోస్‌లో జేఎస్‌డబ్ల్యూ చైర్మన్ సజ్జన్ జిందాల్‌తో లోకేష్ జరిపిన సమావేశంలో ఇదే అంశం ప్రస్తావనకు వచ్చింది. రానున్న కాలంలో రామాయపట్నం పోర్టు దగ్గర ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సజ్జన్ జిందాల్ సుముఖత వ్యక్తం చేయడం విశేషం. ఏపీలో తమ సంస్థ విద్యుత్ వాహనాల పరిశ్రమ ఏర్పాటుకు సంసిద్ధంగా ఉన్నదని జిందాల్ గ్రూపు చైర్మన్ చెప్పారు. కొత్త రాష్ట్రంలో అపెరల్ పార్కు ఏర్పాటునకు తాము ఆసక్తిగా ఉన్నామని తెలిపారు. ప్రపంచంలోని పలు దేశాలలో స్టీల్, ఎనర్జీ, ఇన్‌ఫ్రా, సిమెంట్ తదితర వ్యాపారాలు నిర్వహిస్తున్న జేఎస్‌డబ్ల్యూ ఏపీలో జరుగుతున్న పారిశ్రామికాభివృద్ధిని నిశితంగా గమనిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. విశాఖ-చెన్నై (వీఐసీసీ), చెన్నై-బెంగళూరు (సీబీఐసీ) కారిడార్లతో పారిశ్రామిక అభివృద్ధి సాధించాలనేది లక్ష్యంగా చేసుకున్నామని లోకేష్ తెలిపారు. అందులో భాగంగానే విమానాశ్రయాలు, పోర్టులు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. మరిన్ని రంగాలలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఎంవోయూపై ఏపీఎమ్ఐడీసీ డైరెక్టర్ డాక్టర్ కోయా ప్రవీణ్, ఏపీఈడీబీ తరపున సీఈవో జె.కృష్ణకిశోర్, జేఎస్‌డబ్ల్యూ నుంచి సంస్థ జేఎండీ, సీఈవో బీవీజీకే శర్మ సంతకాలు చేశారు. సమావేశంలో ఏపీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ బాబు, సమాచార శాఖ కార్యదర్శి బి.రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేయాలి

ముఖ్యమంత్రికి సీపీఐ రామకృష్ణ లేఖ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జీవో నెంబరు 5ని రద్దు చేసి, ఏపీపీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రికి బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ లేఖ రాశారు. 1997వ సంవత్సరంలో తీసుకువచ్చిన జీవో570ను మార్పుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 5 తీసుకువచ్చింది.దీనివలన ఏపీపీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రిలిమినరీ పరీక్షలో రిజర్వేషన్ కోటా క్రింద అర్హత పొంది, మెయిన్స్ పరీక్షలో మొదటి ర్యాంకు సాధించినప్పటికీ ఆ అభ్యర్థిని జనరల్ కోటా క్రింద పరిగణించరు. మెయిన్స్‌లో అత్యున్నత ప్రతిభ చూపినప్పటికీ రిజర్వేషన్ అభ్యర్థిగా పరిగణించడం వల్ల ఆ కులానికి చెందిన రోస్టర్‌లో ఖాళీలు లేకపోతే ఆ అభ్యర్థి ఉద్యోగాన్ని పొందలేడు. ప్రిలిమినరీ పరీక్షలలోని మార్కులను అర్హతగానే చూస్తున్నారేతప్ప వాటిలో మార్కులను మెయిన్స్‌కు కలపడం లేదు. అలాంటప్పుడు ఆ మార్కులకు మెయిన్స్‌కు ఎలా సంబంధం ఉంటుంది?కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఈ విధానం లేదు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ అర్హత పరీక్షలలో అర్హత సాధించిన అభ్యర్థులను జనరల్ కేటగిరీతోపాటు రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులుగా కూడా పరిగణించడం జరుగుతోంది. ఈనేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులకు అన్యాయం చేసే జీవో5 రద్దు చేసి, ఏపీపీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ వర్గాల వారికి న్యాయం చేకూర్చాలని కోరారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.